ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 28.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 308 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

యువ భారత్ భారీ విజయం **12**

మేడారానికి పగిడిద్దరాజు

పూనుగొండ్ల నుంచి పయనం

- నేడు మేడారంలో కొలువుదీరనున్న పగిడిద్దరాజు
- సంప్రదాయ పద్ధతుల్లో కోయ పూజారులు పూజలు
- నేటి నుంచి నాలుగు రోజుల పాటు మహాజాతర
- గిరిజన సంప్రదాయాలు, ఆచారాలకు ప్రభుత్వం పూర్తి మద్దతు
- పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ప్రతిపక్షం ప్రతినిధి, మేడారం

జనవరి 27: గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు మేడారం వైపు బయలుదేరారు. సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కోయ పూజారులు పగిడిద్దరాజును ఘనంగా మేడారం తీసుకొస్తున్నారు. పూనుగొండ్ల గ్రామంలో ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించగా, కోయ గిరిజనులు సంప్రదాయ వేషధారణలో పగిడిద్దరాజుకు పూజలు చేశారు. పూజల అనంతరం భక్తుల నినాదాల మధ్య ఊరేగింపుగా పగిడిద్దరాజును మేడారం దిశగా

...:: మిగతా 2లో

మహా జాతరను వైభవంగా జరుపుకోవాలి

- చరిత్రలో నిలిచిపోయేలా మేడారం పునర్నిర్మాణం
- రూ.250 కోట్లతో ఆలయ ప్రాకారం విస్తరణ
- మేడారం తల్లుల స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం
- జాతర సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

...:: 2లో

మంత్రుల భేటీపై ‘విష ప్రచారం’

అందరి ముందే మేమంతా ఒకే కారులో వెళ్లాం

బహిరంగంగా వెళ్తే రహస్యం ఎలా అవుతుంది?

- పాలనను సమన్వయం చేసుకోవడం మా బాధ్యత
- మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత పైనే మా భేటీ
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: "ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల మధ్య జరిగే ప్రతి చర్చకు రాజకీయాలను ఆపాదిస్తూ "రహస్య భేటీ" అంటూ విష ప్రచారం చేయడం తగదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంత్రుల భేటీపై సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కొందరు కావాలనే పని గట్టుకొని ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. "ప్రజాస్వామ్యంలో కేబినెట్ అనేది ఒక యూనిట్. పాలనాపరమైన అంశాల్లో ఎక్కడా జాప్యం ఏర్పడకుండా ఉండటానికి

...:: మిగతా 2లో

మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్

116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు

- నేటి నుంచే నామినేషన్లు దాఖలు
- ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌంటింగ్
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- పురపోరుకు అన్ని పార్టీలు సన్నద్ధం
- రసవత్తంగా జరగనున్న ‘మున్సిపల్’ పోరు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. జనవరి 28 నుంచి మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి జనవరి 30 వరకు అవకాశం కల్పించారు. అలాగే 31వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ

...:: మిగతా 2లో

ఇదీ షెడ్యూల్

జనవరి 28:	నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
జనవరి 30 :	నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ
జనవరి 31 :	నామినేషన్ల పరిశీలన
ఫిబ్రవరి 03 :	ఉపసంహరణకు తుది గడువు
ఫిబ్రవరి 11 :	పోలింగ్
ఫిబ్రవరి 12 :	అవసరమైన చోట రీపోలింగ్
ఫిబ్రవరి 13 :	ఓట్ల లెక్కింపు
ఫిబ్రవరి 16 : మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక	
మున్సిపల్ స్థానాలు	116
కార్పొరేషన్లు	7
మొత్తం వార్డులు, డివిజన్లు	2,996
మొత్తం ఓటర్లు	52.43 లక్షలు
మహిళా ఓటర్లు	26.80 లక్షలు
పురుషులు	25.62 లక్షలు
ఇతరులు	600
పోలింగ్ కేంద్రాలు	8,203
లెక్కింపు కేంద్రాలు	136
బ్యాలెట్ బాక్సులు	16,301

భారత్ – ఈయూ ఒప్పందం

ఓ చారిత్రక ఘట్టం

- ప్రపంచమంతా దీనిని ‘మదర్ ఆఫ్ ఆల్ డీల్స్’ అంటున్నారు: ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 27: భారత్ -యూరోపియన్ యూనియన్ మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇండియన్ ఎనర్జీ వీక్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ ఈ విషయాన్ని ప్రకటించారు. ప్రపంచ జీడీపీలో 25 శాతం, ప్రపంచ వాణిజ్యంలో

...:: మిగతా 2లో

రేవంత్‌కు ప్రధాన గూఢచారి

సంతోష్ రావే

- రాజకీయ రక్షణతో శిక్ష తప్పించుకునే ప్రయత్నం
- కేసీఆర్‌ను ఉద్యమకారులకు దూరం చేసిన దుర్మార్గుడు
- కేసీఆర్ ను బలహీనపరిచే కుట్రలో సంతోష్ రావు కీలక పాత్ర
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు
- గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు నిమ్స్‌లో పరామర్శ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: రేవంత్ కు ప్రధాన గూఢచారి సంతోష్ రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ కు ప్రధాన గూఢచారిగా సంతోష్ రావు వ్యవహరిస్తున్నాడని, కేసీఆర్ వ్యక్తిగత జీవితం నుంచి ఫార్మ్ హౌస్‌లో ఆయన తిన్న ఇడ్లి వరకూ ప్రతి సమాచారం ప్రత్యర్థులకు చేరవేసే స్థాయిలో ఆయన పాత్ర ఉందని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఇంతటి కీలక సమాచారాన్ని లీక్ చేస్తూ కేసీఆర్ ను బలహీనపరిచే కుట్రలో సంతోష్ రావు

...:: మిగతా 2లో

సోలార్ పవర్ స్కాం

తెలంగాణలోనే రూ.7 కోట్లు ఎందుకు?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- బొగ్గు గనుల కేటాయింపులపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫిర్యాదు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: భారతదేశంలో ఎక్కడైనా మెగావాట్‌కు రెండున్నర నుంచి మూడు కోట్లలో నేడు సోలార్‌లో నిర్మాణం జరుగుతుంది. కానీ తెలంగాణలో సింగరేణి పిలిచిన సోలార్ టెండర్లలో మాత్రం రూ.7 కోట్లు ఎందుకు అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. సింగరేణిలో అవినీతి వెలికితీశాక పాలకుల్లో వణుకు మొదలైందని, తాము సోలాం పవర్ స్కాం గురించి కూడా బయటపెట్టామని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ నేతలు బొగ్గు గనుల కేటాయింపులపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫిర్యాదు చేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. భారతదేశంలో ఎక్కడైనా

...:: మిగతా 2లో

ప్రభాకర్ రావును కొనసాగించడం

ఎవరి నిర్ణయం?

- మాజీ ఎంపీ సంతోష్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించిన సిట్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం రికార్డు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ రావు సిట్ విచారణకు హాజరయ్యారు. మంగళవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లోని ఏసీపీ కార్యాలయానికి చేరుకున్న సంతోష్‌రావు సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఆయన్ను సుదీర్ఘంగా ప్రశ్నించిన సిట్ అధికారులు, ఆయన వాంగ్మూలం నమోదు చేశారు. ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్ రావు

...:: మిగతా 2లో

బడ్జెట్‌కు ముందు హల్వా తినండి

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నిర్మలా సీతారామన్ మంగళవారం హల్వా వేడుకను నిర్వహించారు. భారత్‌లో ఏ మంచి కార్యక్రమం ప్రారంభించినా ముందుగా తీపి పదార్థాలు పంచడం శుభప్రదంగా భావిస్తారు. దిల్లీలోని కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయం- నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుక చేస్తుంటారు. బడ్జెట్ తయారీ ప్రక్రియలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ఆ హల్వాను పంచిపెట్టారు. హల్వా వేడుకతో బడ్జెట్ లాక్-ఇన్ పీరియడ్ ప్రారంభం అవుతుంది.

రాహుల్‌ను మూడో వరుసలో కూర్చోబెట్టడం కుట్రపూరితం

గణతంత్ర వేడుకల్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మూడో వరుసలో కూర్చోబెట్టడం కుట్రపూరితమైన అవమానమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.

3



బడ్జెట్ సెషన్‌కు రంగం సిద్ధం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు.

11

ట్రంప్ నిర్ణయాలకు అమెరికన్ల అసంతృప్తి

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు ఈ అంశంలో ట్రంప్ నిర్ణయాలకు ప్రజల మద్దతు భారీగా తగ్గింది. రాయిటర్స్-ఇప్సాస్ నిర్వహించిన పోల్‌లో ఈ విషయం వెల్లడైంది.

11

ఆల్‌టైమ్ కనిష్టానికి ఇరాన్ కరెన్సీ

ఒకవైపు ఆందోళనలు, మరోవైపు ఆర్థికపరమైన ఆంక్షలతో నడుమ దేశ కరెన్సీ మళ్లీ పతనమైంది. డాలర్ విలువతో పోలిస్తే చరిత్రలోనే అత్యల్ప స్థాయి 15 లక్షల రియాల్స్‌కు పడిపోయింది.

11

రాజకీయం

భారత్ – ఈయూ ఒప్పందం

ఓ చారిత్రక ఘట్టం

మొదటిపేజీ తరువాయి

మూడో వంతు వాటా కలిగిన ఈ ఒప్పందాన్ని''మదర్ ఆఫ్ ఆల్ డీల్స్''గా ప్రధాని అభివర్ణించారు. సోమవారం ఈ కీలక ఒప్పందంపై సంతకాలు జరిగాయని మోదీ వెల్లడించారు. ఈ ఒప్పందం వల్ల 140 కోట్ల మంది భారతీయులకు, కోట్లాది మంది యూరోపియన్లకు అపారమైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. భారత్ ఈయూ ట్రేడ్ డీల్ ప్రపంచంలోని రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య భాగస్వామ్యానికి ఒక అద్భుతమైన ఉదాహరణ అని చెప్పారు. బ్రిటన్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ తో ఇప్పటికే ఉన్న ఒప్పందాలకు ఇది అదనపు బలాన్ని ఇస్తుందని చెప్పారు. ప్రపంచ సప్లై చెయిన్ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా అంతర్జాతీయ వ్యాపారవేత్తలకు, పెట్టుబడిదారులకు భారత్ పట్ల నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కేవలం తయారీ రంగాన్నే కాకుండా, సేవా రంగాన్ని కూడా భారీగా విస్తరిస్తుందని మోదీఆశాభావం వ్యక్తం చేశారు. వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, తోలు, పాదరక్షలు వంటి రంగాలతో సంబంధం ఉన్న వారిని ఈ సందర్భంగా ప్రధాని అభినందించారు. ఈ ఒప్పందం ఈ రంగాల్లోని వారికి ఉపయోగపడుతుందని వివరించారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ రిఫైనింగ్ హబ్ గా భారత్

భారత్ త్వరలోనే ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ రిఫైనింగ్ హబ్‌గా అవతరిస్తుందని అన్నారు. ఈ దశాబ్దం చివరి నాటికి చమురు, వాయు రంగాల్లో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని మోదీచెప్పారు. ''మీరంతా ఇంధన భద్రత, సుస్థిర భవిష్యత్తు గురించి మాట్లాడేందుకు భారత్‌కు వచ్చారు. మా వద్ద భారీ రిఫైనింగ్ సామర్థ్యాలు ఉన్నాయి. ఈ విషయంలో మేం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాం. త్వరలో నంబర్‌వన్ స్థానానికి చేరుకుంటాం''అని ప్రధాని మోదీ అన్నారు. ఇక ఈ ఎనర్జీ వీక్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాలకు చెందిన ప్రతినిధులు గోవాకు వచ్చారు.

మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్

మొదటిపేజీ తరువాయి

ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్ నిర్వహించి, 13న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 16వ తేదీన చైర్ పర్సన్స్, మేయర్ల ఎన్నిక ప్రక్రియ చేపడతారు. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తుండగా.. 8203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓట్ల కౌంటింగ్ కోసం 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక ఉంటుందని రాణి కుముదిని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు సైతం ఎక్కడికక్కడ తనిఖీలు ముమ్మరం చేశారు.

రిజర్వేషన్లు ఇలా...

మున్సిపల్ ఎన్నికల్లో వివిధ వర్గాలకు రిజర్వేషన్ స్థానాలను పరిశీలిస్తే బీసీ జనరల్ 463, బీసీ మహిళలు 391, ఎస్సీ జనరల్ 254, ఎస్సీ మహిళలు 190, ఎస్టీ జనరల్ 147, ఎస్టీ మహిళలు 40, జనరల్ వార్డులు 647, జనరల్ మహిళలకు రిజర్వ్ వార్డులు 864గా ఉన్నాయి. మంగళవారం ఎస్ఈసీ రాణి కుముదిని ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సీఎస్ రామకృష్ణారావు, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీదేవి, డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీ మహేశ్ భగవత్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎస్ఈసీ ఎన్నికల కోడ్ అమలు, తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతూనే ఉన్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీలు హోరాహోరీగా తలపడే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో పెద్ద మొత్తంలో సీట్లు గెలుచుకున్న బీఆర్ఎస్ ప్రస్తుత ఎన్నికల్లో రకరకాల వ్యూహాలను రచిస్తోంది. ఈ బాధ్యతను ముఖ్యంగా కేటీఆర్ తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ముఖ్యమంత్రి కొన్ని జిల్లాల్లో ఏకంగా బహిరంగ సభలే నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే వేగంగా అభివృద్ధి జరుగుతుందని ప్రజలను కోరారు. ఇక బీజేపీ కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలతో ప్రచారం చేయాలని చూస్తోంది.

మంత్రుల భేటీపై 'విష ప్రచారం'

మొదటిపేజీ తరువాయి

సీనియర్ మంత్రులుగా మేం చర్చించుకుంటే అందులో తప్పేముంది... ? అది ప్రభుత్వ సమష్టి బాధ్యత. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నివాసంలో మేము భేటీ అయ్యి పాలనాపరమైన అంశాలను చర్చించాం" అని స్పష్టం చేశారు. "లోక్ భవన్ లో ఎట్ హోమ్ కార్యక్రమం ముగిసిన తర్వాత అందరి ముందే మేమంతా ఒకే కారులో వెళ్లాం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరఫున అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించాం. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సన్నద్ధత అనేది రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత. దీనికి కూడా లేనిపోని రంగులు పూయడం సమంజసం కాదు" అని అన్నారు. "నిర్మాణాత్మకమైన విమర్శలను మేము ఎప్పుడూ స్వాగతిస్తాం. కానీ వ్యక్తిత్వ హననానికి, ఊహాజనిత కథనాలకు పాల్పడితే అది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. రాష్ట్రాభివృద్ధి కోసం... భావితరాల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న మా ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం ఇకనైనా మానుకొని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి" అని కోరారు.

సోలార్ పవర్ స్కాం

మొదటిపేజీ తరువాయి

మెగావాట్ కు రెండున్నర నుంచి మూడు కోట్లలో నేడు సోలార్‌లో నిర్మాణం జరుగుతుంది. కానీ తెలంగాణలో సింగరేణి పిలిచిన సోలార్ టెండర్లలో మాత్రం రూ.7 కోట్లట.. దేశం మొత్తంలో 2, 3 కోట్లలో అయ్యేది ఒక్క తెలంగాణలోనే రూ.7 కోట్లు ఎందుకు అవుతుంది.. ఇది సోలార్ పవర్‌లో స్కాం కాదా అని మేం నిలదీస్తే ఇంత వరకు సమాధానం లేదని ప్రశ్నించారు. అలాగే గనుల్లో వాడే పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్ 30 శాతం అదనంగా రేటు పెంచారు.. ఎందుకు పెంచారని అడిగితే సమాధానం లేదన్నారు. 'చివరికి సింగరేణిలో ఒక డైరెక్టర్ జీవీ రెడ్డి, డైరెక్టర్ వీకే శ్రీనివాస్.. ఈ ఇద్దరూ కూడా ఈ 30 శాతం అదనంగా ఎందుకు పెడుతున్నారు. ఖర్చు ఇంత పెట్టాల్సిన అవసరం లేదు. జిలెటిన్ స్టిల్స్, పేలుడు పదార్థాల మీద 30 శాతం ఎందుకు పెంచారని డైరెక్టర్లు బోర్డులో నిలదీస్తే వాళ్ల మీద చర్యలు తీసుకున్నారు తప్ప కాంట్రాక్టర్లను లాభం చేసే పనిలో మాత్రం కాంగ్రెస్ పార్టీ వెనకకు తగ్గలేదని, ఇది వాస్తవమా..? అని మేం నిలదీస్తే సమాధానం లేదని' కేటీఆర్ పేర్కొన్నారు. ఈ అన్ని విషయాలు ఇవాళ గవర్నర్ దృష్టికి సవివరంగా తెచ్చాం. బెదిరించి కాంట్రాక్టర్లను ఒక రింగు చేసి ప్రజాధనాన్ని.. ప్రజాధనం ఎందుకంటే సింగరేణి కాలరీస్ అనే సంస్థలో 51 శాతం ఓనర్‌షిప్ తెలంగాణ ప్రభుత్వానిది.. 49 శాతం ఓనర్‌షిప్ కేంద్రప్రభుత్వానిది. మరి ప్రభుత్వాలది అన్నప్పుడు ఈ సొమ్ము మొత్తం ప్రజలదే.. సింగరేణి కార్మికులదేనన్నారు.

బావమరిదికి సింగరేణిని గుత్తకు రాసిచ్చిండు..

ఈ కోల్‌బెల్ట్‌లో ఉండే మా కార్మిక సోదరులు ఆలోచన చేయాలి. వేల కోట్ల రూపాయలు ఏ రకంగా ఈ ప్రభుత్వం కొల్లగొడుతున్నదో.. దీనిపై మేం ఎన్నిసార్లు అడిగినా సమాధానం రావడం లేదన్నారు. వాస్తవేమేంటంటే అన్నదమ్ముళ్లు దోచుకున్నది రేవంత్‌రెడ్డికి సరిపోవడం లేదని, హిల్ట్ కుంభకోణం పేరు మీదు హైదరాబాద్‌లోని పారిశ్రామిక వాడల్లో భూములను కొల్లగొట్టడానికి 5 లక్షల కోట్ల విలువ చేసే 9200 ఎకరాల భూమిని కొల్లగొట్టేందుకు ప్రయత్నం చేస్తే మా పార్టీ బయటకు తీసుకొచ్చింది. అన్నదమ్ముళ్ల దోపిడీని అడ్డుకున్నది. కానీ రేవంత్ రెడ్డికి అన్నదమ్ముళ్ల దోపిడి సరిపోవడం లేదట. ఇప్పుడు బావమరిది కండ్లలో ఆనందం కోసం సింగరేణిని ఆయనకు గుత్తకు రాసిచ్చిండని కేటీఆర్ ఆరోపించారు.

ప్రభాకర్ రావును కొనసాగించడం ఎవరి నిర్ణయం?

మొదటిపేజీ తరువాయి

పదవీ విరమణ పొందిన తర్వాత ఇంటెలిజెన్స్ చీఫ్‌గా కొనసాగించడం ఎవరి నిర్ణయం అనే దానిపై సంతోష్ రావును సిట్ విచారించనున్నట్లు సమాచారం. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్ గుర్తించింది. ఫోన్ ట్యాపింగ్ కోసమే రిటైర్డ్ అయిన తరువాత కూడా ఎస్ఐబీ చీఫ్, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్ రావును ప్రభుత్వం కొనసాగించినట్లు సిట్ అనుమానిస్తోంది. ఈ బాధ్యతలు అప్పగించడంలో నిర్ణయం, ఆదేశాలు ఎవరిచ్చారనే దానిపై సంతోష్ రావును సిట్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్‌లో ఆయన కొన్ని నంబర్లను ఎస్ఐబీకి ఇచ్చి ట్యాప్ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏ నంబర్ ట్యాప్ చేయాలో సంతోష్ రావు నుంచి ఆదేశాలు అందినట్లు సిట్ ఆధారాలు సేకరించింది.

మేడారానికి పగిడిద్దరాజు

మొదటిపేజీ తరువాయి

తీసుకువస్తున్నారు. రేపు సాయంత్రం సారలమ్మ గద్దెలకు చేరే సమయానికి పగిడిద్దరాజు కొలువుదీరనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన సంప్రదాయాలు, ఆచారాలకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని మంత్రి తెలిపారు. మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిందని, ఈ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆమె వెల్లడించారు. కాగా, ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర వైభవంగా జరుగనుంది. ఈ జాతర కోసం ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన జాతర ప్రారంభానికి ముందే గత కొన్ని రోజులుగా భక్తులు పెద్ద సంఖ్యలో మేడారం జాతరకు చేరుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి,మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇర్ప సుకన్య, స్టేట్ డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి,కొత్తగూడెం గంగారం మండలాల అధ్యక్షులు వజ్జె సారయ్య,జాడి వెంకటేశ్వర్లు,పలు గ్రామాల్ సర్పంచులు, మండల నాయకులు,పూజారులు తదితరులు పాల్గొన్నారు.

మహాజాతరకు సర్వం సిద్ధం

ప్రపంచంలోనే రెండో అతిపెద్దదిగా ప్రసిద్ధిగాంచిన ఆదివాసీ కోయ గిరిజన మేడారం మహాజాతరకు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి శనివారం వరకు నాలుగు రోజులపాటు ఆదివాసీ కోయగిరిజన సమాజం తమ ఇలవేల్పులైన సమ్మక్కసారలమ్మకు మొక్కులు చెల్లించేందుకు మేడారం పయనం అవుతున్నది. బుధవారం సాయంత్రం మేడారానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని కన్నెపల్లి గుడి నుంచి సారలమ్మ, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజును తీసుకువచ్చి మేడారం గద్దెల ప్రాంగణంలో ప్రతిష్ఠించడంతో మహాజాతర ప్రారంభానికి అంకురార్పణ జరుగుతుంది. గురువారం సా యంత్రం మేడారం సమీపంలోని చిలుకలగుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో సమ్మక్కను తీసుకువచ్చి మేడారంలోని గద్దెపై ప్రతిష్ఠిస్తారు. శుక్రవారం వనదేవతలు సమ్మక్కసారలమ్మను భక్తకోటి దర్శించుకుంటారు. శనివారం సాయంత్రం జనదేవతల వనప్రవేశంతో మహాజాతర పరిసమాప్తి అవుతుంది. ప్రతి రెండేండ్లకోసారి జరిగే ఈ మహాఘట్టానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ ప్రేమికులు తరలివస్తారు. నాలుగు రోజుల పాటు సాగే మహా ఘట్టాన్ని సమర్థంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సన్నద్ధమయ్యాయి. ఈ సారి సౌకర్యాల కల్పనతోపాటు నిర్మాణ పనులనూ ఏకకాలం చేపట్టారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఒకవైపు వన దేవతల గద్దెల పునర్నిర్మాణ పనులు సాగుతున్న సమయంలోనే లక్షలాది మంది ముందస్తుగా అమ్మలను దర్శించుకున్నారు. ప్రధాన జాతర తేదీల్లో భక్తుల రద్దీ కారణంగా గద్దెల ప్రాంగణం వద్ద అమ్మల దర్శనం ఆషామాషీ విషయం కాదు. ఈ సారి గద్దెల పునర్నిర్మాణం నేపథ్యంలో ప్రాకారం విస్తరించారు.

ఆర్టీసీ విశాలమైన ప్రాంగణాలు

జాతరకు ఆర్టీసీ విశాలమైన ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. 4 వేల బస్సులను ప్రయాణికులను తరలించేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉంచింది. ఈ నెల 31 వరకు మొత్తంగా 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తోంది. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం వర్తింపజేశారు.

జాతర ఖ్యాతిని ప్రపంచానికి చాటాలి: మంత్రి సీతక్క

మేడారంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను పంచాయతీ రాజ్, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. గద్దల ప్రాంగణం పక్కనే ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఈ మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరిస్తూ, మేడారం జాతరకు సంబంధించిన సమగ్ర సమాచారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ద్వారా ప్రజలకు సకాలంలో చేరేలా అన్ని సౌకర్యాలు ఈ మీడియా సెంటర్‌లో కల్పించినట్లు తెలిపారు. జాతర నిర్వహణ, భక్తుల రద్దీ, భద్రత, దర్శన ఏర్పాట్లు వంటి అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అత్యంత తక్కువ సమయంలో జాతర ఏర్పాట్లు పూర్తవడానికి అమ్మవారి దయే కారణమని పేర్కొన్నారు. మేడారం మహాజాతర సందర్భంగా భక్తులందరూ శాంతియుతంగా దర్శనం చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. రేపటి నుంచి మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే భారీ సంఖ్యలో భక్తులు మేడారం చేరుకుంటున్నారని తెలిపారు. జాతర నిర్వహణ కోసం అధికారులు రాత్రింబగళ్లు శ్రమించి పనిచేశారని మంత్రి ప్రశంసించారు. ఎక్కడైనా చిన్నచిన్న లోపాలు కనిపిస్తే భక్తులు క్షమించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అమ్మవారి దర్శనంతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి సమృద్ధి కలగాలని ఆమె అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సమాచార పౌర సంబంధర శాఖ అధికారులు డిప్యూటీ డైరెక్టర్ వై వెంకటేశ్వర్లు, కె. వెంకట సురేష్,ఏడీ లక్ష్మణ్ కుమార్, వసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహా జాతరను వైభవంగా జరుపుకోవాలి

- చరిత్రలో నిలిచిపోయేలా మేడారం పునర్నిర్మాణం
- రూ.250 కోట్లతో ఆలయ ప్రాకారం విస్తరణ
- మేడారం తల్లుల స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం
- జాతర సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 27: సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణా కుంభమేళాగా పేరొందిన మేడారం మహా జాతరను వైభవంగా జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలతో నాలుగు రోజుల పాటు జరిగే పండుగను వన దేవతల మహోత్సవంగా జరుపుకోవాలని అన్నారు. కోటిన్నరకు పైగా భక్తులు తరలి వచ్చే జాతరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఘనంగా ఏర్పాట్లు చేసిందని తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేలా మేడారం ఆలయాన్ని ప్రజా ప్రభుత్వం పునర్నిర్మించిందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. రూ.250 కోట్లతో ఆలయ ప్రాకారం విస్తరణతో పాటు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజు గద్దెలను విశాలంగా నిర్మించామన్నారు. గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని ఆధునీకరించి, ప్రాంగణానికి నలు దిశలా తోరణాలను నిర్మించినట్లు గుర్తు చేశారు. లక్షలాదిగా నిరంతరం మేడారం తరలివస్తున్న భక్తులకు ఇబ్బంది లేకుండా రోడ్లు, శాశ్వత మౌలిక వసతుల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందన్నారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు, ఆదివాసీల ఆచారాలను పరిరక్షణను ప్రభుత్వం బాధ్యతగా స్వీకరించిందని అన్నారు. మేడారం తల్లుల స్ఫూర్తితో జరిపిన ప్రజాస్వామ్య పోరాటం ఫలితంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటి సారిగా తల్లుల చెంత ప్రజా ప్రభుత్వం రాష్ట్ర మంత్రి మండలి సమావేశం నిర్వహించిందని అన్నారు. జనంకోసం ప్రాణాలైనా ఇవ్వాలనే సందేశం ఇచ్చిన మేడారం సమ్మక్క, సారలమ్మ తల్లుల స్ఫూర్తిగా రాష్ట్రాభివృద్ధికి పునరంకితమవుతామని అన్నారు. కోటిన్నర మంది భక్తులు తరలివచ్చే అంచనాలు ఉండటంతో ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో పని చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అమెరికా నుంచి సీఎం ఫోన్ లో ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకుండా భక్తులు సహకరించాలని కోరారు. పోలీసు విభాగంతో పాటు అన్ని విభాగాల అధికారులు కలిసికట్టుగా మహా జాతర వైభవంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాల అధికారులు నాలుగు రోజుల పాటు నిర్విరామంగా భక్తులకు అందుబాటులో ఉండాలని అప్రమత్తం చేశారు.

రేవంత్‌కు ప్రధాన గూఢచారి సంతోష్ రావే

మొదటిపేజీ తరువాయి

కీలక పాత్ర పోషించాడని మండిపడ్డారు. ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను కేసీఆర్ కు దూరం చేసిన ప్రధాన వ్యక్తి కూడా సంతోష్ రావేనని కవిత ఆరోపించారు. గద్దర్ లాంటి ప్రజా ఉద్యమ నాయకులు గంటల తరబడి గేటు బయట నిలబెట్టే పరిస్థితి రావడానికి, ఉద్యమకారులు ఫార్మ్ హౌస్ గేటు దాటకుండా అడ్డుకోవడానికి వెనుక కూడా ఈ వ్యక్తి పాత్ర ఉందన్నారు. ఉద్యమ చరిత్ర ఉన్న నాయకులను, అమరవీరుల కుటుంబాలను అవమానించే రీతిలో వ్యవహరించడం క్షమించరాని నేరమని కవిత వ్యాఖ్యానించారు. సంతోష్ రావును సిట్ విచారణకు పిలవడం మంచిదేనని పేర్కొన్న కవిత, అయితే రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా పోలీసులు నిజాయితీగా పనిచేస్తేనే ఆయనకు శిక్ష పడుతుందన్న అనుమానం వ్యక్తం చేశారు. సీఎంకు గూఢచారిగా పనిచేస్తున్న వ్యక్తికి శిక్ష పడకుండా చూడటానికి రాజకీయ రక్షణ కవచం సిద్ధంగా ఉందని, అందుకే ఈ కేసు చివరకు ఏ మలుపు తిరుగుతుందో అనుమానమేనని అన్నారు. ఇంతటి వివాదాస్పద వ్యక్తికి కేటీఆర్, హరీష్ రావులు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సంతోష్ రావు వెనుక ఎవరి ఆశీస్సులు ఉన్నాయో, ఎవరి ఆదేశాలతో ఆయన పనిచేశాడో బయటపడాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం నిజంగా తన పని తాను చేసుకుంటూ ముందుకు వెళ్తే, రాజకీయ నీడలు అడ్డుకోకపోతే, ఈ దుర్మార్గుడికి తప్పకుండా శిక్ష పడుతుందన్న విశ్వాసం ఉందని కవిత తెలిపారు. ఉద్యమకారులను కేసీఆర్ కు దూరం చేసిన పాపం సంతోష్ రావును తప్పక వెంటాడుతుందని హెచ్చరించారు.

గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు పరామర్శ

నిజామాబాద్ జిల్లాలో గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. సౌమ్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న కవిత, ఆమె కుటుంబానికి జాగృతి తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత గారు, గంజాయి ముఠాలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడంలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై దాడి చేసే స్థాయికి గంజాయి ముఠాలు ఎదిగాయంటే ప్రభుత్వంపై వారికి భయం లేదని స్పష్టమవుతోందన్నారు. డ్రగ్స్, గంజాయి ఫ్రీ రాష్ట్రం చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ హామీలను పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోనే కాదు, పాఠశాలల వరకు డ్రగ్స్, గంజాయి వ్యాప్తి చెందిందని, దీని వల్ల యువతతో పాటు మహిళలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గృహహింస ఘటనలకు కూడా మత్తుపదార్థాలే ప్రధాన కారణంగా మారుతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి మాఫియాను పూర్తిగా నిర్మూలించాలంటే ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలని, తగిన శిక్షణతో పాటు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జాగృతి నాయకులు, కార్యకర్తలు డ్రగ్స్, గంజాయి వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా మత్తుపదార్థాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సౌమ్య ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం కొంత క్రిటికల్‌గా ఉన్నప్పటికీ స్వల్ప మెరుగుదల ఉందని కవిత తెలిపారు. ఆమె కుటుంబానికి తెలంగాణ జాగృతి పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు.

చిన్నారిని పరామర్శించిన కవిత

సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఏక్తాపూర్ పండిత్-పార్వతమ్మ దంపతుల కుమారుడు శివానంద్ (17) గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండగా, అతడి చికిత్స కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను తల్లిదండ్రులు సంప్రదించారు. వెంటనే స్పందించిన కవిత చొరవ తీసుకొని నిమ్స్ ఆసుపత్రిలో 2025 డిసెంబర్ 17న శివానంద్‌కు విజయవంతంగా శస్త్రచికిత్స చేయించారు. ఆపరేషన్ అనంతరం ఆరోగ్యం మెరుగుపడిన శివానంద్ మంగళవారం తన తల్లిదండ్రులతో కలిసి బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవితను కలిశారు. ఈ సందర్భంగా శివానంద్‌ను పరామర్శించిన కవిత త్వరలోనే పూర్తిగా కోలుకొని చదువును కొనసాగించాలని సూచించారు. ధైర్యంగా ఉండాలని, తమ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. ఇండియా వేరే లెవెల్‌లో ఆడుతోంది. సెమీస్‌కు ఈజీగా చేరుకుంటుంది. కానీ నా గత అనుభవాలను బట్టి చెబుతున్నా. ఆ రోజున ఏ టీమ్ బాగా ఆడితే అదే గెలుస్తుంది. ఎవరో ఒకరు మంచి ఇన్నింగ్స్ ఆడి మిమ్మల్ని అప్‌సెట్ చేయొచ్చు.

- మాజీ కోచ్ ద్రవిడ్

అభివృద్ధేతర వ్యయానికి కళ్లెం

- దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ
- 2024-25లో 18.8 శాతం తగ్గించిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్రాల బడ్జెట్లపై విశ్లేషణలో ఆర్బీఐ వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: రాష్ట్ర ప్రభుత్వం అనధికార వ్యయాన్ని భారీగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటోంది. అనవసర ఖర్చులు తగ్గించడం, అలాగే అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలన్నింటిని ప్రభుత్వ కార్యాలయాల్లోకి తరలించాలంటూ తీసుకున్న కీలక నిర్ణయం ఇందుకు దోహదపడుతున్నది. బడ్జెట్ కేటాయింపుల్లో అభివృద్ధేతర వ్యయానికి కల్లెం వేయడానికి సంబంధించ తొలి ఏడాది ప్రభుత్వం సఫలయం అయ్యింది. దీంతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన తొలి పూర్తి స్థాయి బడ్జెట్ (202425 ఫైనాన్సియల్ ఇయర్) వ్యయాన్ని పరిశీలించినట్లయితే నాన్ డెవలప్‌మెంట్ వ్యయ పద్దు కింద అనవసర ఖర్చులను తగ్గించడంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. ఈ మేరకు రాష్ట్రాల బడ్జెట్లపై విశ్లేషణలో మన దేశంలోని కేంద్ర బ్యాంకు అయిన రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వివరాలను వెల్లడించింది. పలు ఆసక్తికర విషయాలను తెలిపింది.

తెలంగాణకు మొదటిస్థానం

తెలంగాణలో 2023-24 వాస్తవ బడ్జెట్ గణాంకాల ప్రకారం ఎన్‌డీ వ్యయపద్దు కింద రూ.56,554 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అంతకన్నా 18.8 శాతం తగ్గించి రూ.45,894.10 కోట్లకు మాత్రమే పరిమితం చేసింది. ఈ విధంగా 'మైనస్ 18.8 శాతం' ఇంకే ఇతర రాష్ట్రంలో లేదా కేంద్రపాలిత ప్రాంతంలో నమోదు కాలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్లో నాన్ డెవలప్మెంట్ వ్యయ పద్దు కింద 2023-24లో రూ.1.61 లక్షల కోట్లు వెచ్చించారు. 2024-25 సంవత్సరంలో అంతకన్నా ఏకంగా 22.2 శాతం ఎక్కువ (రూ.1.97 లక్షల కోట్లు) వ్యయం అయిందంటే తెలంగాణ రాష్ట్రంలో మాత్రం 'మైనస్ 18.8 శాతం' నమోదవడానికున్న ప్రాధాన్యం అర్థమవుతుంది. బిహార్ రాష్ట్రంలో 34.4, కర్ణాటకలో 18, మధ్యప్రదేశ్‌లో 19.2, మహారాష్ట్రలో 16.7, తమిళనాడులో 11.2, ఏపీలో 3.3 శాతం చొప్పున ఇలా ప్రతి రాష్ట్రంలో ఎన్‌డీ వ్యయం పెరగడమే తప్ప తగ్గిందే లేదని, తెలంగాణ రాష్ట్రం ఒక్కటే తగ్గించగలిగిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివరించింది. జాతీయ స్థాయిలో కూడా ఇది సగటున 13.6 శాతానికి పెరిగింది.

ఆర్బీఐ అధ్యయనంలోని ముఖ్యాంశాలు :

ఈ ఏడాది (2025-26లో) ఇదే పద్దు కింద రూ.50,320 కోట్లను వెచ్చించాలని రాష్ట్ర బడ్జెట్‌లో సర్కారు అంచనా వేసింది. ఇది మొత్తం ఖర్చవుతుందా లేదా అనేది వచ్చే మార్చి నెల చివరు నాటికి తేలనుంది. ఈ మొత్తం కూడా 2023-24లో అభివృద్ధేతర వ్యయం కింద పెట్టిన రూ.56,554 కోట్ల కన్నా తక్కువగానే ఉండటమనేది గమనార్హం. ఎన్‌డీ వ్యయాన్ని తగ్గించి అగ్ర స్థానంలో నిలిచిన తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి వ్యయం 24.8 శాతం పెంపుద్వారా 11వ స్థానంలో ఉంది. ఈ పెరుగుదల శాతం జాతీయ స్థాయిలో 22.2 శాతంగా నమోదైంది. ఈ క్రమంలో మణిపుర్ (96.9 శాతం), త్రిపుర (48.3 శాతం), బిహార్ రాష్ట్రం (46.1 శాతం) తొలి 3 ర్యాంకుల్లో నిలిచాయి. 2023-24 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి వ్యయపద్దు కింద రూ.1.62 లక్షల కోట్లకు పైగా ఖర్చవగా, 2024-25లో రూ.2.03 లక్షల కోట్లను వ్యయం చేశారు. ఈ ఏడాది కూడా గతేడాది కన్నా 15.5 శాతం పెంచి రూ.2.34 లక్షల కోట్లను వ్యయం చేస్తామని బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వం తెలిపినట్లుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివరించింది. అభివృద్ధి పనుల కోసం కేపిటల్ ఎక్స్పెండేచర్ ఎలా ఉందనేది ఆర్బీఐ విడిగా వివరించింది. దీని ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది సామాజిక సేవల రంగానికి రూ.10,503 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారని, గత మూడేళ్ల కాలంలో ఇదే అధికమని తెలిపింది. మూలధన వ్యయం కింద 202425లో ఎడ్యుకేషన్, స్పోర్ట్స్, సాంస్కృతిక రంగాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.1,225.15 కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది దానికి రూ.1,225.40 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో వైద్యం, ప్రజారోగ్యంలో మూలధన వ్యయాన్ని రూ.1,320 కోట్ల నుంచి రూ.1,992.78 కోట్లకు రోడ్లు, వంతెనలకు రూ.947 కోట్ల నుంచి రూ.3,131 కోట్లకు పెంచింది.

రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

- ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం
- కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- నేడు పఠాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి శంకుస్థాపన
- మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 27: తెలంగాణ ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా, అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పదేళ్లలో ఆనాటి పాలకుల స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. గడచిన రెండేళ్లుగా సీఎం రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని, నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. త్వరలో మిగిలిన కార్యాలయాల శంకుస్థాపనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని, పఠాన్ చెరువు శంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ భవనానికి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖలో తీసుకుంటున్న ఈ సంస్కరణలు కేవలం కార్యాలయాల మార్పు మాత్రమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్కరణలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ ద్వారా సుస్థిర నగర జీవనానికి మార్గం

- సీఐయూజీ, ఐడీ, ఏఎస్‌సీఐ డైరెక్టర్ డా.జనార్ధన్ రెడ్డి
- వికేంద్రీకృత తడి వ్యర్థాల నిర్వహణపై జీహెచ్ ఎంసీ బ్రెయిన్ స్టార్మింగ్ సదస్సు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 27 : వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ ద్వారా ప్రజలను నేరుగా భాగస్వాములను చేయడమే సుస్థిర నగర జీవనానికి మార్గమని సీఐయూజీ, ఐడీ, ఏఎస్‌సీఐ డైరెక్టర్, ప్రముఖ ప్రాక్టీస్ ప్రొఫెసర్ డా. బి. జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్న జీహెచ్ఎంసీ, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సదస్సులు నిర్వహించి, నగర పరిశుభ్రత, పర్యావరణ సుస్థిరత దిశగా వినూత్న ఆలోచనలకు వేదికగా నిలవనుందని అధికారులు వెల్లడించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా, వికేంద్రీకృత కమ్యూనిటీ స్థాయి తడి వ్యర్థాల నిర్వహణపై మంగళవారం అబిడ్స్‌లోని తాజ్ మహల్ హోటల్‌లో బ్రెయిన్ స్టార్మింగ్ సదస్సు విజయవంతంగా నిర్వహించారు. తడి వ్యర్థాల నిర్వహణలో నగరంలో ఎదురవుతున్న సమస్యలకు స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్యంతో పరిష్కార మార్గాలు అన్వేషించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించామని అధికారులు తెలిపారు. కార్పొరేట్ స్టార్టప్‌లు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, పౌరులు, నిపుణులు పాల్గొని, ప్రయోగాత్మక, విస్తరించదగిన, కమ్యూనిటీ ఆధారిత మోడళ్లపై విస్తృతంగా చర్చించారు. పీఐయూ, ఎస్బీఎం టీమ్ లీడ్ యశశ్రీ కొమ్మారెడ్డి స్వాగతం ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం ఐఈసీ నిపుణులు జేఎస్ఆర్ అన్నమయ్య, వ్యర్థాల నిర్వహణలో ప్రజల ప్రవర్తన మార్పుకు సమాచారం-విద్య-కమ్యూనికేషన్ (ఐఈసీ) వ్యూహాల పాత్రను వివరించారు. ఆయన రూపొందించిన 'ఏనీ టైం బ్యాగ్' యంత్రం వంటి వినూత్న పరికరాలు సమాజంలో అవగాహన పెంచడంలో కీలకంగా మారతాయని తెలిపారు. సీఐయూజీ, ఐడీ, ఏఎస్‌సీఐ డైరెక్టర్, ప్రముఖ ప్రాక్టీస్ ప్రొఫెసర్ డా. బి. జనార్ధన్ రెడ్డి సదస్సులో మాట్లాడుతూ... వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, వాటికి సాధ్యమైన పరిష్కార మార్గాలపై స్పష్టత ఇచ్చారు. వార్డు, జోన్ స్థాయిలో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే స్థానిక స్థాయిలో త్వరిత, స్థిర పరిష్కారాలు లభిస్తాయని సూచించారు. సీఐఐ-ఐజీబీసీ సీనియర్ కౌన్సిలర్ సంపత్ కుమార్ కబోతు, సింగపూర్, జపాన్‌లలోని అనుభవాలను పంచుకుంటూ, కార్పొరేట్ స్థాయి వ్యర్థాల నిర్వహణ విధానాలను సామాజిక స్థాయికి ఎలా తీసుకురావచ్చో వివరించారు. విద్యార్థులను మార్పు దూతలుగా తీర్చిదిద్దితే దీర్ఘకాలిక మార్పు సాధ్యమని తెలిపారు. సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు వ్యర్థాల సేకరణ విధానాలు, ఆర్డబ్ల్యూఏలో తయారయ్యే కంపోస్ట్ విక్రయ సమస్యలు, బయోగ్యాస్ వంటి ప్రత్యామ్నాయాలు, ప్రోత్సాహక పథకాలు, కంపోస్టర్ డిజైన్‌లు, స్వచ్ఛ ఆటో టిప్పర్లు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు వంటి అంశాలపై సాంకేతిక ప్రశ్నలు లేవనెత్తారు. వీటికి యశశ్రీ కొమ్మారెడ్డి సమగ్రంగా స్పందించగా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీష్ రెడ్డి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రాహుల్ గాంధీని మూడో వరుసలో
కూర్చోబెట్టడం కుట్రపూరితం

- ప్రధాని పదవి పుట్టిందే రాహుల్ గాంధీ ఇంట్లో
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- రాహుల్ సింహం లాంటి వాడు.. ప్రియాంక చిరుత పులి లాంటి నాయకురాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 27: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మూడో వరుసలో కూర్చోబెట్టడం కుట్రపూరితమైన అవమానమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఇది రాజకీయ సంప్రదాయాలను తుంగలో తొక్కిన చర్యగా ఆయన విమర్శించారు. మంగళవారం గాంధీ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీలు దేశంలో రాజకీయ సంప్రదాయాలను గౌరవించారని గుర్తు చేశారు. ప్రధాని జెండా ఎగరేస్తే, ప్రతిపక్ష నాయకుడిని ముందు వరుసలో కూర్చోబెట్టడం రాజ్యాంగం ఇచ్చిన మర్యాద అని, ప్రజలు ఇచ్చిన హక్కు అని స్పష్టం చేశారు. కానీ 26 జనవరి వేడుకల్లో రాహుల్ గాంధీని మూడో లైన్‌లో కూర్చోబెట్టి బీజేపీ ప్రభుత్వం అవమాన పరిచిందన్నారు. బీజేపీకి ప్రజలు అధికారం ఇచ్చింది ప్రజా పాలన చేయమని తప్ప, రాహుల్ గాంధీ కుటుంబాన్ని రాజకీయంగా టార్గెట్ చేయమని కాదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం సంప్రదాయాలను పక్కన పెట్టి పద్ధతి లేని పాలన చేస్తోందని విమర్శించారు. రాహుల్ గాంధీకి ఈ అవమానంతో ఎలాంటి ఫీలింగ్ ఉండదని, ఎందుకంటే ప్రధాని పదవి పుట్టిందే రాహుల్ గాంధీ ఇంట్లోనని వ్యాఖ్యానించారు. మోదీ ఇంట్లో ప్రధాని పోస్టు పుట్టలేదని ఘాటుగా చెప్పారు. 47 ఏళ్ల పాటు రాహుల్ గాంధీ కుటుంబం ఈ దేశాన్ని పాలించి న్యాయమైన పాలన, పేదలకు అండగా ఉండే పాలన అందించిందన్నారు. ఐదో వరసలో కూర్చోబెట్టినా రాహుల్ గాంధీ ఏం ఫీల్ కారని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆలోచన, మాట, ప్రవర్తన అంతా సింహంలా ఉంటుందని, సింహానికి సింహాసనం అవసరం లేదని, సింహం ఎక్కడ కూర్చుంటే అదే సింహాసనమని చెప్పారు. ప్రియాంక గాంధీ పార్లమెంట్ లో మోదీని చిరుత పులిలా వెంటాడారని, ఆమె ధైర్యమైన నాయకురాలని కొనియాడారు. వాజ్‌పేయి, అద్వానీ లాంటి వారిని ప్రతిపక్ష నాయకులుగా ఇందిరాగాంధీ గౌరవించారని గుర్తు చేశారు. ప్రతిపక్షం సభలో ఉంటేనే ప్రభుత్వ లోటుపాట్లు తెలుస్తాయని భావించి వారికి ముందు వరుసలో కూర్చోబెట్టి మర్యాద ఇచ్చేవారని తెలిపారు. కానీ మోదీ మాత్రం ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అవమానించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. బీజేపీ ధర్మం అంటుందని, దేవుడు అంటుందని కానీ వాటిని పాటించదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రులు వస్తారు పోతారు కానీ చరిత్రను కాలరాయలేరని జగ్గారెడ్డి హెచ్చరించారు. ఒక నిజాంను వదిలేస్తే మిగిలిన నిజాం నవాబులను ప్రజలు గుర్తు చేసుకుంటారని వ్యాఖ్యానిస్తూ, బీజేపీ ఎంతసేపూ ప్రజల్లోకి చెడును ఎలా జొప్పించాలనే ఆలోచనతోనే పనిచేస్తోందన్నారు. ప్రజలను ట్రాప్ చేయడమే బీజేపీ పాలసీగా మారిందని, అంతకు మించి దేశానికి ఇచ్చేదేమీ లేదని ఘాటుగా విమర్శించారు.

జీవించే హక్కు కోసం భవిష్యత్తులో పోరాటాలు

- గాలినీ, నీటిని కూడా ప్రయివేటుపరం చేస్తున్న పాలకులు
- మహిళలపై దాడులకు తెగబడుతున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ
- బతకడానికి పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటాం
- ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర రామన్
- ఘనంగా ఐద్వా జాతీయ సదస్సు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 27 : జీవించే హక్కు కోసం భవిష్యత్తులో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పోరాటాలు కొనసాగిస్తుందని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర రామన్ తెలిపారు. మనిషి జీవించేందుకు తప్పనిసరి అయిన గాలి, నీటిని సైతం ప్రయివేటుపరం చేస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాల దిశగా ముందుకెళ్లనున్నట్టు ఆమె చెప్పారు. మంగళవారం హైదరాబాద్ లోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఐద్వా 14వ జాతీయ మహాసభల మూడవ రోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 1981లో ఆవిర్భవించిన ఐద్వా దేశవ్యాప్తంగా 1.6 కోట్ల సభ్యత్వంతో దేశం ఆ మూల నుంచి ఈ మూల వరకు 26 రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాన్ని చేస్తున్నదని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు మహిళలపై దాడులను తీవ్రతరం చేశాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని నిరూపించుకోలేని విధంగా డాక్యుమెంట్లను సమర్పించాలని కోరుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్ పేరుతో బీహార్ లో ఎన్నికలకు ముందు 65 లక్షల మంది ఓట్లను తొలగిస్తే అందులో 45 లక్షల మందికి పైగా మహిళలున్నారని ఆమె తెలిపారు. ఇందులోనూ బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వారిని లక్ష్యంగా చేసుకుని బీజేపీ వారి ఓటు హక్కును తొలగించిందని తెలిపారు. చనిపోయిన తమ తండ్రుల బర్త్ సర్టిఫికెట్లు సమర్పించాలని కొర్రీలు పెడుతూ మహిళలను వేధిస్తున్నారని చెప్పారు. వాతావరణ మార్పుల ప్రభావం మహిళలను మరింత ఒత్తిడికి గురి చేస్తున్నదని సుధా సుందర రామన్ తెలిపారు. అనేకసార్లు ప్రకృతి విపత్తుల కారణంగా మహిళలకు నివసించేందుకు చోటు కూడా లభించని పరిస్థితి నెలకొందని తెలిపారు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల కోసం అనేక రాష్ట్రాల్లో అడవులను నరికేస్తుంటే వాతావరణంలో అనూహ్యమైన మార్పులు సంభవించి వరదలు తదితర ప్రకృతి విపత్తులు వస్తున్నాయని తెలిపారు. దీంతో స్వచ్ఛమైన గాలి, తాగునీరు కోసం కూడా అల్లాడే పరిస్థితి దాపురిస్తుందని చెప్పారు. ఇప్పటికే ఢిల్లీలో స్వచ్ఛమైన గాలి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారని గుర్తుచేశారు. అన్ని సహజ వనరులను ప్రయివేటీకరిస్తూ, విద్యను కాషాయీకరణ, ప్రయివేటీకరణ చేస్తున్న సర్కారు పాఠశాలల విలీనం, మూసివేతలతో బాలికలను చదువులకు దూరం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలోనూ ఇదే పరిస్థితిని తెచ్చిందని తెలిపారు.

కేరళ వామపక్ష ప్రభుత్వానికి ధన్యవాదాలు

వాతావరణ మార్పుల నుంచి మహిళలకు భద్రత కల్పించేందుకు కేరళ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని ఆమె ధన్యవాదాలు తెలిపారు. మహిళల సాధికారతకు కుటుంబశ్రీని అమలు చేస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల్లో మైక్రో ఫైనాన్స్ వేధింపులతో మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బతుకు కోసం, ఆత్మగౌరవం కోసం, మనువాదానికి వ్యతిరేకంగా, మానవ, మహిళల హక్కుల కోసం తాము పోరాడుతూనే ఉంటామన్నారు.

ఎస్సీ, ఎస్టీ, మహిళల పోరాటాలకు ఐద్వా అండ: ఎస్.పుణ్యవతి

ఎస్సీ, ఎస్టీ, మహిళల బతుకులపై బీజేపీ దాడి చేస్తోందని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవించడానికి ఆ వర్గాలు చేస్తున్న పోరాటాలకు ఐద్వా అండగా ఉంటుందని ఆమె తెలిపారు. కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన 4 లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఐద్వా పాల్గొంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఆర్బీఐ మైక్రో ఫైనాన్స్ కంపెనీలకు పావలా వడ్డీకి రుణాలిస్తే వారు రూ.2 నుంచి రూ.10 వడ్డీకి మహిళకిచ్చి పీడిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వేధింపులకు వ్యతిరేకంగా ఐద్వా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వివిధ రూపాల్లో పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. మెరుగైన బతుకు కోసం మహిళలు సాగిస్తున్న పోరాటమే ఐద్వా పోరాటమన్నారు. మనువాద సంస్కృతిని ప్రతిఘటిస్తూ మహిళలను అగ్నికణాలుగా మారుస్తున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు కలిసి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

అభయహస్తం పొదుపు డబ్బులివ్వాలి: -మల్లు లక్ష్మి

అభయహస్తం పథకంలో భాగంగా రాష్ట్రంలో మహిళలు పొదుపు చేసిన రూ.600 కోట్లను తిరిగి వారికివ్వాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభయహస్తం పథకాన్ని పునరుద్ధరించాలని ఆమె కోరారు. 85 శాతం మంది మహిళలకు ఉపాధినిస్తున్న నరేగా పథకాన్ని పునరుద్ధరించాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక రాష్ట్రాల నిధులు కేంద్రానికి వెళుతున్న నేపథ్యంలో రాష్ట్రాల వాటాతో ముడిపెడుతూ తెచ్చిన వీబీ జీరామ్ జీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. దీంతో మహిళలు పని హక్కు కోల్పోతారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి తదితరుల స్ఫూర్తితో భవిష్యత్తులో పోరాటాలు చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఐద్వా నాయకులు ఏడు ప్రచురణలను విడుదల చేశారు. ఈ రచనలు ఏఐడీడబ్ల్యూఏ, మహిళా హక్కుల ఉద్యమం దృక్పథం, చరిత్ర, ప్రచారానికి ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

నగదు రహిత చికిత్సలకు..
ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయండి

- సీఎస్‌ను కోరిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి
- సీఎస్‌కు వినతిపత్రం అందచేసిన జేఏసీ ప్రతినిధులు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి27: రాష్ట్రంలోని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులలో అన్ని రకాల జబ్బులకు అపరిమిత, నగదు రహిత వైద్య సేవలను అందేలా చూడాలన్నారు. ఐపీ, ఓపీ చికిత్సలకు ప్రభుత్వం నుంచే కాకుండా ఉద్యోగి కాంట్రిబూషన్ కూడా ప్రతి నెల సమానంగా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును మంగళవారం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో జేఏసీ ప్రతినిధులు కలిసి ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) అమలు గురించి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి, ఇతర జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పలు విషయాలను వివరించారు. ఈహెచ్ఎస్ అమలుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి ఆధారిత కుటుంబ సభ్యులకు ఎంపానెల్ చేసిన ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించేందుకు ఉద్యోగుల వేతన స్థాయిని కాంట్రిబూషన్‌గా ఈహెచ్ఎస్‌కు చెల్లించేందుకు రూపొందించడం జరిగిందన్నారు. కానీ, కొన్ని అనివార్య కారణాల వలన ఇది అమలు చేయకపోవడంతో వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ విధానమే కొనసాగుతుందని గుర్తు చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ నగదు రహిత చికిత్స కోసం మార్గదర్శకాలు జారీ చేయబడినప్పటికీ, అమలులో అనేక అవాంతరాలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రయివేట్ ఆసుపత్రులు హెల్త్ కార్డులను అంగీకరించకపోవడం, ఆసుపత్రి బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర ఆలస్యం ఉండటం వల్ల ఈహెచ్ఎస్ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రస్తుత రీయింబర్స్‌మెంట్ విధానం ఉద్యోగులకు అనుకూలంగా లేదన్నారు. గుండె, క్యాన్సర్, న్యూరో, కిడ్నీ మార్పిడి వంటి పెద్ద చికిత్సలకు గరిష్ట పరిమితి రూ.2 లక్షలు మాత్రమే ఉందన్నారు. దీనికి సంబంధించిన సడలింపుల ప్రక్రియకు మరింత ఆలస్యం అవుతుందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు సుమారు 10 లక్షల మంది ఉన్నారన్నారు. వీరందరూ నెలవారీగా వారిగా కాంట్రిబూషన్‌ను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. అదే మొత్తాన్ని ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంట్గా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇది జీతపు స్లిప్‌లో డిడక్షన్ గా చూపించి ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పర్యవేక్షణలో ఈహెచ్ఎస్ ఖాతాకు జమ చేయాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రతిపాదనపై సీఎస్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత విభాగాల అధికారులతో సంప్రదించి తుది నివేదికను ఇచ్చేలా చర్యలు చేపట్టనున్నట్టుగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, రమేష్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, గరికె ఉపేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

“

త్వరలో ఏపీలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానుంది. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తాం. జిల్లాల వారీగా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తాం. గతేడాది మాదిరిగా ఈ ఏడాది కూడా వంద మంది బీసీ అభ్యర్థులకు ఉచిత సివిల్స్ కోచింగ్ అందజేస్తున్నాం.
- ఏపీ మంత్రి సవిత

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
బుధవారం
28.01.2026
@prathipaksham
prathipakshamtvtelugu

ప్రక్షాళన పాలకుల నుండే మొదలవ్వాలి

తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ తాజాగా జారీ చేసిన మెమో రాష్ట్రవ్యాప్త రవాణా వ్యవస్థలో ఒక సంచలనానికి, అంతకు మించిన చర్చకు తెరలేపింది. వాహనాల నంబర్ ప్లేట్లపై లేదా బాడీపై అనధికారికంగా హోదాలను, వృత్తిపరమైన చిహ్నాలను ప్రదర్శించడంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ 50, 51 నిబంధనల ప్రకారం, వాహన రిజిస్ట్రేషన్ ప్లేట్ అనేది కేవలం ఆ వాహన గుర్తింపు సంఖ్యను ప్రతిబింబించే ఒక చట్టబద్ధమైన సాధనం మాత్రమే. కానీ, నేడు మన రహదారులపై ఆ ప్లేట్లు అధికార ప్రదర్శనకూ, సామాజిక హోదాకూ ప్రదర్శనా వేదికలుగా మారిపోయాయి. అడ్వకేట్, ప్రెస్, పోలీస్, ఆర్మీ వంటి వృత్తిపరమైన గుర్తులు ఒకెత్తయితే.. ఎమ్మెల్యే, ఎంపీ, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి రాజకీయ పదవుల హంగామా మరో ఎత్తు. వీటికి తోడు కుల సంఘాల పేర్లు, సామాజిక వర్గ గుర్తింపులు కూడా వాహనాలపై రాజ్యమేలుతున్నాయి. ఈ నేపథ్యంలో, హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చట్టబద్ధతను కాపాడటంతో పాటు సామాన్యుడికి, పాలకుడికి మధ్య ఉన్న అదృశ్య విభజనను తొలగించడానికి ఒక సాహసోపేతమైన అడుగుగా భావించవచ్చు. అయితే, ఈ నిబంధనల అమలు ప్రక్రియలో ఒక స్పష్టమైన వైరుధ్యం, నైతిక సందిగ్ధత నెలకొంది. చట్టం కాగితం మీద అందరికీ సమానమే అని ఉద్ఘాటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దాని అమలు తీరుపై సామాన్య పౌరుల్లో ప్రబలమైన అనుమానాలు ఉన్నాయి. సాధారణ పౌరుడు తన వాహనంపై ఏదైనా చిన్న స్టిక్కర్ వేసుకుంటే వెనువెంటనే జరిమానా అస్త్రం ప్రయోగించే యంత్రాంగం, మరి అధికార యంత్రాంగంలో భాగమైన పోలీస్, ఆర్మీ, కలెక్టరేట్ వంటి బలమైన విభాగాల ఉద్యోగుల విషయంలో అదే కఠినత్వాన్ని, నిష్పాక్షికతను ప్రదర్శించగలదా అన్నదే అసలు ప్రశ్న. ఒక సామాన్య ట్రాఫిక్ కానిస్టేబుల్ తన పైఅధికారి ప్రైవేటు వాహనాన్ని ఆపి, నంబర్ ప్లేట్‌పై ఉన్న 'పోలీస్' ముద్రను తొలగించమని ఆదేశించే నైతిక స్థైర్యాన్ని కలిగి ఉంటాడా? లేదా ఒక ప్రభావశీల రాజకీయ నాయకుడి వాహనంపై ఉన్న ఎంపీటీసీ, సర్పంచ్ బోర్డులను తొలగించే ధైర్యం రవాణా శాఖకు ఉందా? నిజానికి, ఈ హోదాల ప్రదర్శన అనేది కేవలం వృత్తిపరమైన గుర్తింపు కోసం మాత్రమే కాదు, అదొక 'అప్రకటిత మినహాయింపు' పొందే సాధనంగా మారిపోయింది. ట్రాఫిక్ ఉల్లంఘనల నుండి సులభంగా తప్పించుకోవడానికి, టోల్ ప్లాజాల వద్ద చట్టవిరుద్ధమైన వెసులుబాటు పొందడానికి, లేదా సమాజంలో ఒక రకమైన భీతిని కలిగించి గౌరవాన్ని ఆశించి ఈ గుర్తులను వాడుతున్నారు. చట్టపరంగా 'ఇంపర్సనేషన్' అంటే తగిన అర్హత లేకపోయినా ఒక హోదాను ఆపాదించుకోవడం తీవ్రమైన నేరం. ఉదాహరణకు, అధికారిక అక్రిడిటేషన్ లేని వారు 'ప్రెస్' అని రాసుకోవడం వల్ల నిజమైన జర్నలిస్టుల విశ్వసనీయత దెబ్బతినడమే కాకుండా, పోలీసు విచారణలకు కూడా విఘాతం కలుగుతుంది. అదేవిధంగా, కాలం చెల్లిన మాజీ పదవులను కూడా ప్రస్తుత హోదాల వలె ప్రదర్శించడం ప్రజలను తప్పుదారి పట్టించడమే అవుతుంది. ఈ సంస్కరణ విజయవంతం కావాలంటే, మార్పు అనేది అధికారిక సోపాన క్రమంలో ఉన్నత స్థాయి నుండే ప్రారంభం కావాలి. ప్రభుత్వమే ఒక చట్టబద్ధమైన ఆదర్శంగా నిలిచి, తన సచివాలయాలు, కలెక్టరేట్ పార్కింగ్ స్థలాల్లో ఉన్న అధికారుల ప్రైవేటు వాహనాలపై ఉన్న అనధికారిక లోగోలను ముందుగా తొలగింపజేయాలి. ప్రజా ప్రతినిధులు తామే స్వచ్ఛందంగా తమ వాహనాలపై ఉన్న అదనపు బోర్డులను తొలగించుకుని 'చట్టం ముందు అందరూ సమానమే' అన్న రాజ్యాంగ సూత్రానికి కట్టుబడి ఉండాలి. కులాల పేర్లు లేదా సామాజిక వర్గాల గుర్తింపులు రహదారిపై ప్రయాణించేటప్పుడు అనవసరమైన వర్గ విభేదాలకు, సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో రహదారిపై వెళ్తున్న ప్రతి పౌరుడూ సమానమే. తెలంగాణ రాష్ట్రం ఒక క్రమశిక్షణతో కూడిన, పారదర్శకమైన రవాణా వ్యవస్థను నిర్మించాలనుకోవడం అభినందనీయం. కానీ, ఈ నిబంధనల అమలులో వివక్ష కనిపిస్తే ఈ ఉత్తర్వుల పరమార్థం నీరుగారిపోతుంది. జరిమానాల వసూలు మాత్రమే ధ్యేయంగా కాకుండా, పౌర బాధ్యతను పెంపొందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. డిజిటల్ విప్లవం ద్వారా వాహన యజమాని సమగ్ర వివరాలను క్షణాల్లో తెలుసుకునే సాంకేతికత అందుబాటులో ఉన్న నేటి కాలంలో, నంబర్ ప్లేట్లపై హోదాల అవసరం ఏమాత్రం లేదు. చట్టసభల్లో చట్టాలు చేసేవారే వాటిని శిరసావహిస్తే, సామాన్య ప్రజలు వాటిని అనుసరించడానికి ఎటువంటి సంకోచం చూపరు. అప్పుడే తెలంగాణ రహదారులు హోదాల హంగామా నుండి విముక్తి పొంది, చట్టబద్ధమైన పాలనకు నిదర్శనంగా నిలుస్తాయి.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
28.01.2026

ఫజుల్ రహమాన్ జీవితం తెరిచిన పుస్తకం

వ్యక్తిగత జీవితంలో ఎలాంటి స్వార్థ ప్రయోజనాలను అంతగా ఆశించకుండా కనీస జీవన వ్యయానికి కూడా అర్రులు చాచకుండా తను ఎంచుకున్న లక్ష్యం వైపు గానే దృష్టిసారించే వారని వారి మిత్రులు శ్రేయోభిలాషులు సహచరులు చెబుతూ ఉంటే ఎలా సాధ్యం అనే ప్రశ్న మనకు ఉదయించక మానదు. అయినా ఇప్పటికీ వారి పిల్లలు కూడా అదే కోవలో జీవిస్తూ తండ్రి ఎంచుకున్న మార్గాన్ని సమర్థిస్తూ తమ వంతు కూడా ఈ సమాజానికి కృషి చేయడానికి వెనుకాడేది లేదని అదే తాము తమ తండ్రికి ఇచ్చే ప్రజా నివాళి అని నిండు సభలో చెబుతూ ఉంటే అపురూపమే..

వడ్డేపల్లి మల్లేశం
9014206412

సాంస్కృతిక పత్రికా రంగాలలో తనదైన శైలిలో ప్రజా జీవితంలో సుమారు నాలుగు దశాబ్దాలు గడిపిన ప్రతిపక్షం సంపాదకులు పజు ల్ రెహమాన్ గారి మరణం ముఖ్యంగా హుస్నాబాద్ ప్రాంతంలో ఎంతో మందిని కలచివేసింది. హుస్నాబాద్ సమీపంలోని అంతకపేట గ్రామములో జన్మించిన వీరు ఆ తర్వాత కాలంలో హుస్నాబాద్ లో కొంతకాలం స్థిరపడినారు . పత్రికా రంగంలోని బాధ్యతలు , పని విస్తృతి కారణంగా ఆ తర్వాత కరీంనగర్ హైదరాబాదుకు వెళ్లాల్సి రావడంతో తరచుగా హుస్నాబాద్ కు రావడం కొంత తగ్గినప్పటికీ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండి బాసటగా నిలిచి ప్రజల్లో భాగమైనాడు అంటే అతిషయోక్తి కాదు. అందుకే వారిని స్మరిస్తూ వారి కర్తవ్యాలు జ్ఞాపకాలు అనుభవాలు అనుభూతులను నెమరు వేసుకుంటూ సాగినటువంటి సంతాప సభలో వెల్లువెత్తిన అంశాలు వ్యక్తిత్వాన్ని, సామాజిక జీవితాన్ని, ఆలోచన సరళిని ,పత్రికారంగం యొక్క భవిష్యత్ ముఖ చిత్రాన్ని విస్తృత స్థాయిలో చర్చించడానికి దోహదపడింది . రాజకీయ ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు, సాహిత్య సాంస్కృతిక సామాజిక రంగాలలోని మేధావులు, కవులు కళాకారులు హాజరైనటువంటి ఈ సభ సంతాప సభగానే కాదు సాహిత్యం యొక్క లోతుపాతులపైన పత్రికా రంగం యొక్క గత వర్తమాన భవిష్యత్తు తీరుతెనుల పైన చర్చ జరిగిన తీరు చనిపోయిన బ్రతికి ఉన్నాడన్నడంలో సందేహం లేదు . ఒక రంగాన్ని ఆసరాగా ఎంచుకొని ఆ నేపథ్యంలో సంపాదిస్తూనే వృత్తికి న్యాయాన్ని చేసి ప్రజల్లో పేరు తెచ్చుకునే వాళ్ళు ఒక రకం కానీ సంపాదన వైపు ఇసుమంత కూడా కన్నెత్తి చూడకుండా ఈ పని చేస్తే ఏమెుస్తుందని నిర్లక్ష్యం ఏవగింపు లేకుండా ప్రజా సమస్యను పత్రికా కోణంలో ఆలోచించడం ద్వారా పరిష్కారాన్ని వెతకదాన్ని ప్రయోగాత్మకంగా స్వీకరించిన పత్రికా రచయితగా అధినేతగా సంపాదకులుగా వీరు పోషించిన పాత్రలను స్పష్టంగా చూడవచ్చు. " ప్రత్యేకంగా తెలుగు భాష పైన పట్టు, చరిత్ర సాంస్కృతిక కోణంలో ప్రతి అంశం పైన మూలాలు తెలిసి ఉండడం, కఠినమైన అంశాలు అయితే తెలుసుకునే ప్రయత్నం చేయడంలో రాజీ పడకుండా వెతుక్కోవడం, భేషజాలకు తావు లేకుండా చెప్పాల్సిన అంశం చర్చించవలసిన కోణం ఓ నగూరే ప్రయోజనాన్ని ముందుగానే అంచనా వేయడం ద్వారా పత్రికా రంగానికి ఒక నూతన ఒరవడిని సృష్టించినారంటే సందేహం లేదు. 1980 ప్రాంతంలో ఆంధ్రప్రభ పత్రికలో తొలిసారిగా రంగ ప్రవేశం చేసిన పజుల్ ఏనాటి కానాటికి వృత్తి గౌరవాన్ని ఇనుమడింపజేస్తూ, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి , రాజీ లేకుండా లక్ష్యాన్ని సాధించే క్రమంలో చూపిన చొరవ, నేర్పు పత్రికా సామాజిక సాహిత్య రంగాలలో నేటి స్థాయికి చేరుకోవడంలో క్రియాశీలక పాత్ర పోషించి ఇతరులకు ఆదర్శమైనవి. ఆ తర్వాత అనేక పత్రికల్లో అంచలంచెలుగా పని చేస్తూ గత రెండు సంవత్సరాలుగా ప్రతిపక్షం అనే పేరుతో సొంత పత్రికను స్థాపించి దానికి సంపాదకులుగా ప్రధాన బాధ్యులుగా పనిచేస్తూ ఎంతోమంది నూతన రచయితలతో పాటు చేయి తిరిగినటువంటి సాహితీవేత్తలతో సమకాలిన అంశాల పైన పత్రికలో రచనలు చేయించడం ద్వారా తన లక్ష్యాన్ని మరింత విస్తృతం చేసుకున్నారు.

జీవితం తెరిచిన పుస్తకం ఎలా

మాట్లాడేది ఒకటి రాసేది ఒకటి మనసులో ఒకటి అనే భిన్న కోణాలు ఏనాడు దరిచేరనివ్వలేదు . అదే సందర్భంలో ఒక రాజకీయ పార్టీ లేదా పార్టీ అధినేత ప్రభుత్వాలకు చేరువ కావాలని ఆశ కూడా అంతగా లేదు. ప్రజల పక్షాన పని చేయడం ద్వారా ప్రజా సమస్యలను పత్రికా రంగం ద్వారా సమాజం దృష్టికి తీసుకువెళ్లి బహుళ ప్రయోజన కరమైనటువంటి లక్ష్యాన్ని దీర్ఘకాలిక స్థాయిలో నెరవేర్చాలన్నటువంటి తపన పట్టుదల పత్రికా రంగములోని వారిని ఒకే పత్రికకు కట్టుపడే విధంగా చేయకపోవచ్చు కానీ పని చేసిన ప్రతి పత్రికలోనూ తన లక్ష్యాన్ని ప్రతిఫలింప చేయడంతో పాటు సరైన ప్రజల భాషలో రచనలు కొనసాగించడం, సంభాషించడం ,చర్చించడం వారి మాతృ భాషను అర్థం చేసుకున్నప్పుడు విచిత్రం ఇది ఎలా సాధ్యం అని అనేకమంది ముక్కున వేలేసుకున్న సందర్భాలు కూడా లేకపోలేదు. వ్యక్తిగత జీవితంలో ఎలాంటి స్వార్థ ప్రయోజనాలను అంతగా ఆశించకుండా కనీస జీవన వ్యయానికి కూడా అర్రులు చాచకుండా తను ఎంచుకున్న లక్ష్యం వైపు గానే దృష్టిసారించే వారని వారి మిత్రులు శ్రేయోభిలాషులు సహచరులు చెబుతూ ఉంటే ఎలా సాధ్యం అనే ప్రశ్న మనకు ఉదయించక మానదు. అయినా ఇప్పటికీ వారి పిల్లలు కూడా అదే కోవలో జీవిస్తూ తండ్రి ఎంచుకున్న మార్గాన్ని సమర్థిస్తూ తమ వంతు కూడా ఈ సమాజానికి కృషిచేయడానికి వెనుకాడేది లేదని అదే తాము తమ తండ్రికి ఇచ్చే ప్రజా నివాళి అని నిండు సభలో చెబుతూ ఉంటే అపురూపమే ... ఆవేదన, ఆందోళన పరిస్థితులు మనిషినిఎంతో ఆలోచింప చేసినా నమ్మిన సిద్ధాంతం కోసం పడుతున్న తపన ఆరాటం మనిషి స్థిత ప్రజ్ఞ తకు అనవాళ్లుగా నిలుస్తాయి. అలాంటి స్థిరమైనటువంటి మానవీయ విలువలతో సామాజిక చింతనతో పత్రికా రంగాన్ని ఎంచుకోవడం అంటే రాజకీయ శక్తి కంటే మరింత ఉన్నతమైన స్థాయిలో పత్రికా రంగం ద్వారా సమాజానికి సేవ చేయడమే అవుతుంది . నైతిక విలువలకు కట్టుబడి ఉండేవాడని కొందరు అంటే మానవీయ విలువల కోసం అంతకుమించిన స్థాయిలో నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడే వాడని అనుచరులు ఏడుస్తూ చెబుతున్న మాటలు వారి అనుభవాలు వ్యక్తిత్వానికి కొలమానాలు కాక మరేమిటి? 2026 జనవరి 9వ తేదీన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చివరి శ్వాస వదిలిన పజు ల్ సోదరులతో సహ తనకు కూడా ఇప్పటికీ నివాసం లేకపోవడం వారి నిజాయితీకి మచ్చుతునక అయినా ఆందోళన కలిగించే విషయం. అయితే నేడు అంతకుమించిన స్థాయిలో హుస్నాబాద్ ప్రాంతంలో వందలాదిమంది కార్యకర్తలు, స్నేహితులు, అభిమానులు, రాజకీయ నాయకుల ఆదరణ ఆత్మీయత ఆప్యాయత చూ రగొన్న వ్యక్తిగా నిలిచిపోవడం అది వ్యక్తిత్వం యొక్క బహుముఖ కోణంవల్లమాత్రమేసాధ్యమైనది.వ్యాసకర్త గా నావ్యాసాలను వివిధ సందర్భాలలో తన పత్రికలకు ఆహ్వానిస్తూ ఈ పత్రికలో మాత్రమే ప్రచురణకు రాయబడినదని హామీ ఇవ్వాలని కోరినాడంటే పత్రిక మనుగడ ,స్వతంత్రత పట్ల ఎంత నిబద్ధత కలవాడో అర్థం చేసుకోవచ్చు. జర్నలిస్టు సంఘం, తను సభ్యులుగా కొనసాగినటువంటి సాంస్కృతిక సంస్థ స్ఫూర్తి అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించినటువంటి సంతాప సభలో పాల్గొన్న ప్రతి ఒక్కరు చెమ్మగిల్లిన కళ్ళతో, బరువెక్కిన మనసుతో, గొంతు దాటి వస్తున్న భాషతో మాట్లాడడం అంటే అతని పట్ల ఎంత అభిమానం గౌరవం అతని బాధ్యత పట్ల గుర్తింపుకు పరాకాష్టగా భావించవచ్చు. ప్రజలు, ప్రజా సంబంధాలను ఆస్తిపాస్తులుగా కర్తవ్యం గా భావించిన పజుల్ రెహమాన్ పత్రిక రంగంలో ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినాడు అనడంలో సందేహం లేదు. వ్యక్తులు వస్తారు పోతారు కానీ వారి నమ్మిన విలువలు ఆదర్శాలు మాత్రమే నే టి తరాన్ని రేపటికి సంసిద్ధులను చేస్తాయి . ఆ రకంగా భవిష్యత్తు వారసత్వానికి రేఖామాత్రాంగానైనా సంసిద్ధులని చేయగలిగితే విలువలను ప్రతిష్టించే కృషికి భీ జం పడినట్లే . హుస్నాబాద్ సాహితీ శిఖరం నేల కూలిందన్న దుఃఖము నుండి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నటువంటి నమ్మిన ప్రజానీకం తమ భవిష్యత్తు కర్తవ్యాన్ని గుర్తిస్తుందని, ప్రజా జర్నలిజానికి పజుల్ రహమాన్ ప్రేరణగా నిలుస్తాడని ఆశిద్దాం.

ఇటీవల హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును సందర్శించినప్పుడు తూము వద్ద ఫజుల్ రహమాన్ ఇష్టంగా తీయించుకున్న ఫొటో

(వ్యాసకర్త సామాజిక రాజకీయ విశ్లేషకుడు , అరసం రాష్ట్ర కమిటీ సభ్యుడు హుస్నాబాద్ జిల్లా సిద్దిపేట తెలంగాణ)

బ్రిటిష్ వారిని గడగడలాడించిన 'సింహం'

జనక మోహన రావు దుంగ
8247045230

"మీ మీద, మీ సామర్థ్యం మీద నమ్మకం ఉంచండి. సమాజంలో మార్పు తెచ్చే సత్తా మీలో ఉంది. అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించండి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ సంక్షేమం కోసం పాటుపడండి'' అని ఒక పెద్దాయన స్వాతంత్ర్య సమరంలో అప్పటి ప్రజలకు పిలుపునిచ్చారు. "నాపై పడిన ప్రతి దెబ్బ బ్రిటిష్ సామ్రాజ్యవాద శవపేటికలో ఒక్కో మేకు వంటిది. నేను జీవించి ఉంటానో లేదో తెలియదు కానీ, నా తర్వాత నా ఆత్మ స్వేచ్ఛ కోసం మరిన్ని త్యాగాలు చేయమని మిమ్మల్ని ప్రోత్సహిస్తూనే ఉంటుంది.'' అలాగే లాఠీ ఛార్జ్ సమయంలో ఆయన ఇచ్చిన సందేశం ఎందరినో ప్రేరేపించింది. ఆయన ఆదర్శం భారతీయ జాతీయవాదం. దీని కోసమే పనిచేశారు, కష్టాలు అనుభవించారు, చివరికి తన జీవితాన్నే అర్పించారు. జాతీయవాద భావానికి తనదైన ముద్రను, కొత్త అర్థాన్ని ఇచ్చి జాతీయోద్యమాన్ని మలుపు తిప్పారు. ''దేశభక్తి అంటే స్వేచ్ఛ, న్యాయం పట్ల అపారమైన ప్రేమ, ఆత్మగౌరవం కలిగి ఉండటమే'' అని ఆయన చాటిచెప్పారు. ఆయనే అతివాద ఉద్యమానికి ఊపిరి పోయడానికి తమ ప్రాణాలనే బలిపెట్టిన ''లాల్ బాల్ పాల్'' త్రయంలో ఒకరైన లాలా లాజపతిరాయ్. ఆయన జన్మదినం అయిన జనవరి 28. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకోవడమే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి.

పాఠశాల స్థాయిలోనే నాయకుడు

లాలా లాజపతిరాయ్ 1865 జనవరి 28న పంజాబ్‌లోని 'ధుడికే' గ్రామంలో రాధా కిషన్, గులాబ్ దేవి దంపతులకు జన్మించారు. తండ్రి నుండి కర్తవ్య నిష్ఠ, నిర్మొహమాటత్వం, నిజాయితీ మరియు త్యాగనిరతిని, తల్లి నుండి దాతృత్వం, విశాల హృదయం, సున్నితత్వం, భక్తి వంటి సుగుణాలను వారసత్వంగా పొందారు. 1880 ప్రారంభంలో లుధియానాలో చదువుతున్నప్పుడు ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ, పాఠశాల స్థాయి నుంచే చదవడం, రాయడం, ప్రసంగించడంపై మక్కువ పెంచుకున్నారు. పాఠ్యేతర అంశాల్లో ఆసక్తి చూపుతూ చిన్ననాడే నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు.

గొప్ప వాగ్ధాటి కలిగిన మేధావి

1886లో హిసార్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించి, చురామణితో కలిసి హిసార్ బార్ కౌన్సిల్ వ్యవస్థాపక సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడ ఆర్యసమాజ్ జిల్లా శాఖను కూడా స్థాపించారు. భారతదేశ రాజకీయ విధానాన్ని రూపొందించడానికి జర్నలిజాన్ని ఒక సాధనంగా ఎంచుకున్నారు. 'ది ట్రిబ్యూన్'తో సహా అనేక పత్రికలకు రెగ్యులర్ కంట్రిబ్యూటర్‌గా ఉండేవారు. 1886లో లాహోర్‌లో 'దయానంద ఆంగ్లోవేద' పాఠశాలను స్థాపించడంలో మహాత్మా హంసరాజ్‌కు సహాయం చేశారు. 1905లో కాంగ్రెస్ కమిటీ ఆయన అంకితభావా



న్ని గుర్తించి, భారత ప్రజల రాజకీయ సమస్యలను బ్రిటిష్ వారి ముందు ఉంచేందుకు ప్రతినిధిగా ఎంపిక చేసింది. గోపాలకృష్ణ గోఖలేతో కలిసి ఇంగ్లాండ్‌లో రాజకీయ ప్రచారం నిర్వహించి, అప్పటి నిరంకుశ ప్రభుత్వ దురాచారాలను బ్రిటిషర్ల దృష్టికి తీసుకువెళ్లారు. గణాంకాలతో కూడిన ఆయన వాక్చాతుర్యం ఆంగ్లేయులపై బలమైన ప్రభావం చూపింది. ఆ తర్వాత ఆయన అమెరికాకు వెళ్లి అక్కడ అనేక విద్యా సంస్థల పనితీరును స్వయంగా పరిశీలించారు. విదేశాల్లో భారత జాతీయ ఉద్యమానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు, 1914 ఏప్రిల్‌లో ఆయన ఇంగ్లాండ్‌కు వెళ్లారు. ఇందుకోసం తన న్యాయవాద వృత్తిని కూడా విడిచిపెట్టి దేశ సేవకే అంకితమయ్యారు. అమెరికాలో కూడా చురుగ్గా ఉంటూ బ్రిటిష్ ఏజెంట్ల ప్రచారాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నారు.

సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీ

1920 కలకత్తా ప్రత్యేక సెషన్‌లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1921లో 'సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీ' అనే లాభాపేక్ష లేని సంక్షేమ సంస్థను స్థాపించారు. కుల వ్యవస్థ, స్త్రీల స్థితిగతులు, అంటరానితనం వంటి అంశాలపై హిందూ సమాజం అంతర్గత పోరాటం చేయాలని ఆయన ఆకాంక్షించారు. కుల, లింగ భేదం లేకుండా ప్రతి ఒక్కరూ వేదాలను చదవాలని విశ్వసించారు. జలియన్ వాలాబాగ్ దుర్ఘటన తర్వాత బ్రిటిష్ ప్రభుత్వంతో సహాయ నిరాకరణ తీర్మానాన్ని ఆయన నాయకత్వంలోనే కాంగ్రెస్ ఆమోదించింది. 1921లో అరెస్టయి ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించారు. 1926లో మోతీలాల్ నెహ్రూ ప్రోద్బలంతో స్వరాజ్ పార్టీలో చేరి దానికి ఉపనేతగా ఎన్నికయ్యారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి - సంఘసంస్కర్త

రాయ్ ఒకే సమయంలో రాజకీయవేత్త, సామాజిక కార్యకర్త, రచయిత, పరోపకారి. 1896, 18991900 కరువులు, 1905 భూకంపం వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అలుపెరగని సేవ చేశారు. అణగారిన వర్గాల కోసం, అనాథ పిల్లల కోసం నిధులను సేకరించి పాఠశాలలు, అనాథాశ్రమాలు నిర్మించారు. సంఘసంస్కర్తగా అంటరానితనం నిర్మూలనకు ఆర్యసమాజ్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇచ్చారు. గాంధీజీ స్థాపించిన 'హరిజన సేవక్ సంఘ్'లో చేరి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. రచయితగా మజ్జినీ, గరిబాల్డి, శివాజీ,స్వామి దయానంద్ వంటి వారి జీవిత చరిత్రలను రాసి తన ముద్ర వేశారు.

పంజాబ్ కేసరి

స్వదేశీ ఉద్యమం ఊపందుకున్నప్పుడు తన పూర్తి శక్తిని అందులో ధారపోసి స్వదేశీ సందేశాన్ని బోధించారు. దీంతో ఆయన పంజాబ్ ప్రజలలో అమితమైన ఆదరణ పొందారు. ఇది గిట్టని బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను 'విప్లవకారుడు'గా ముద్ర వేసింది. పంజాబ్ వలస చట్టం, నీటిపారుదల పన్నుల పెంపును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. 'పంజాబీ' అనే వార్తాపత్రికపై జరిగిన విచారణ పంజాబీల మనోభావాలను రగిల్చింది. ప్రభుత్వం భయపడి 1907 మే 9న ఆయన్ను అరెస్టు చేసి మాండలే కోటలో బంధించింది. 1928 అక్టోబర్ 30న సైమన్ కమిషన్ లాహోర్‌ను సందర్శించినప్పుడు, దానికి వ్యతిరేకంగా అహింసాయుత నిరసన ప్రదర్శనకు రాయ్ నాయకత్వం వహించారు. అప్పుడు పోలీస్ అధికారి జేమ్స్ స్కాట్ నిరసనకారులపై లాఠీ ఛార్జ్ చేయించడమే కాకుండా, స్వయంగా రాయ్‌పై దాడి చేశారు. ఆ గాయాల నుండి కోలుకోలేక 1928 నవంబర్ 17న పరమపదించారు.

మీరు చూస్తున్నది నిజమేనా?!

ఫిరోజ్ ఖాన్
9640466464

డిజిటల్ తెరపై కనిపించే ప్రతిదీ సత్యమేనన్న భావన నేటి సమాజంలో వేగంగా వ్యాపిస్తోంది. ఒక వీడియో వైరల్ అవుతుందంటే అది నిజమేనని, లక్షలాది చందాదారులున్నారంటే అది విశ్వసనీయతకు ముద్రనని భావించే పరిస్థితి ఏర్పడింది. అయితే అల్గోరిథంల ఆధారంగా నడిచే డిజిటల్ ప్రపంచంలో సంఖ్యలు ఆకర్షణీయంగా కనిపించినంత మాత్రాన వాటి వెనుక ఉన్న వాస్తవం కూడా అంతే బలంగా ఉంటుందన్న గ్యారంటీ లేదు. సమాచార విప్లవం ప్రజలకు అవగాహన పెంచుతున్నప్పటికీ, అదే సమయంలో అప్రమత్తత లేకపోతే అవాస్తవాలకూ అవకాశం కల్పిస్తోంది. అందువల్ల మనం స్వీకరిస్తున్న సమాచారాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించడం నేటి అత్యవసర అవసరంగా మారింది.

గణాంకాల ప్రభావం.. విశ్వసనీయత ప్రశ్నార్థకం

భారతదేశంలో యూట్యూబ్ వినియోగం విస్తృతంగా పెరుగుతున్నది అన్నది నిర్వివాద సత్యం. కోట్లాది మంది ఈ వేదికను వార్తలు, వినోదం, అభిప్రాయాల కోసం వినియోగిస్తున్నారు. ప్రముఖ మీడియా సంస్థలు, సంగీత సంస్థలు భారీ సంఖ్యలో చందాదారులతో ముందంజలో ఉన్నాయి. అయితే చందాదారుల సంఖ్యకు, వాస్తవంగా వీడియోలను నిరంతరం వీక్షించే వారి సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఉంటుందని అనేక డిజిటల్ విశ్లేషణలు సూచిస్తున్నాయి. అందువల్ల కేవలం గణాంకాల ఆధారంగా ఒక వ్యక్తి లేదా వేదిక ప్రభావాన్ని అంచనా వేయడం సరైన ప్రమాణం కాదన్న అభిప్రాయం బలపడుతోంది.

డిజిటల్ వేదికలు.. చట్టపరమైన పరిధి

డిజిటల్ మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తిని నియంత్రించేందుకు భారత ప్రభుత్వం సమాచార సాంకేతిక నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. ప్రజా శాంతి, జాతీయ భద్రతకు భంగం కలిగించే కంటెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం సంబంధిత సంస్థలకు ఉంది. గత కొన్నేళ్లలో నిబంధనలను ఉల్లంఘించిన పలు డిజిటల్ ఛానళ్లపై చర్యలు తీసుకున్నట్లు అధికారిక ప్రకటనలు వెలువడ్డాయి. ఇది డిజిటల్ మీడియా రంగం పూర్తిగా నియంత్రణల వెలుపల కాదన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది.

డిజిటల్ ఆదాయం.. పారదర్శకత అవసరం

యూట్యూబ్ వంటి వేదికల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా చట్టబద్ధమైన వృత్తిపరమైన ఆదాయంగానే పరిగణిస్తారన్న అవగాహన క్రమంగా పెరుగుతోంది. సంబంధిత పన్ను నిబంధనల ప్రకారం కొన్ని రకాల డిజిటల్ ఆదాయాలపై పన్ను బాధ్యత ఉంటుంది. సరైన లెక్కల నిర్వహణ, పారదర్శక ఆర్థిక వ్యవహారాలు క్రియేటర్లకు దీర్ఘకాలిక భద్రతను అందిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. చట్టబద్ధంగా వ్యవహరించడం ద్వారా మాత్రమే ఈ రంగంలో స్థిరమైన ఉపాధి సాధ్యమవుతుందన్న వాస్తవం ఇక్కడ స్పష్టమవుతోంది.

తప్పుడు సమాచారం.. సామాజిక సవాలు

కృత్రిమ మేధ ఆధారిత వీడియోలు, ధృవీకరణ లేని

సమాచారం, సంచలనాత్మక శీర్షికలు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అధిక వీక్షణల కోసం బాధ్యతారాహిత్యంగా రూపొందించే కంటెంట్ వ్యక్తిగత జీవితాలపైనా, సామాజిక శాంతిపైనా ప్రభావం చూపవచ్చు. ఈ పరిస్థితుల్లో సమాచారాన్ని అందించే క్రియేటర్ల నైతిక బాధ్యతతో పాటు, దాన్ని స్వీకరించే వీక్షకుల విజ్ఞత కూడా సమానంగా అవసరం.

బాధ్యతాయుతమైన డిజిటల్ దారి

డిజిటల్ వేదికలు సమాజ మార్పుకు శక్తివంతమైన సాధనాలుగా ఎదిగాయి. అయితే అవి సత్యం, బాధ్యత, చట్టపరమైన అవగాహనతో నడిచినప్పుడే నిలకడగా ఉంటాయి. కాపీరైట్, మేధో సంపత్తి హక్కులను గౌరవిస్తూ స్వంత సృజనాత్మకతతో రూపొందిన కంటెంట్‌కే దీర్ఘకాలిక గుర్తింపు లభిస్తుంది. మనం చూస్తున్నది నిజమా కాదా అన్న ప్రశ్నకు సమాధానం వెతకడమే నేటి డిజిటల్ యుగంలో అత్యవసరమైన సామాజిక బాధ్యత. వాస్తవాలను గౌరవిస్తూ, చట్టబద్ధంగా సాగే డిజిటల్ ప్రయాణమే దేశ అభివృద్ధికి నిజమైన తోడ్పాటునందిస్తుంది.

(వ్యాస రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

కల్వకుంట్ల ఫ్యామిలీనే ఓ డ్రామా కంపెనీ

- బావబామ్మర్దులవి అసత్య ప్రచారాలు
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: కల్వకుంట్ల ఫ్యామిలీనే ఓ డ్రామా కంపెనీ అని, తెలంగాణ భవన్‌ను డ్రామా కంపెనీగా మార్చివేశారని ఆరోపించారు. భావ హరీశ్, బావమరిది ఇద్దరు ఫోన్ ట్యాపింగ్ అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే సింగరేణి కోల్ టెండర్లపై అసత్య ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. తెలంగాణ సిరుల వేణి మన సింగరేణిని ఆనాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ కాపాడుకుంటూ వస్తోందన్నారు. మంగళవారం సాయంత్రం గాంధీభవన్ లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సింగరేణి అనేది ఒక అటానమస్ సంస్థ అని, సింగరేణి సంస్థ ప్రోసీజర్స్ ప్రకారమే నిర్ణయాలు జరుగుతాయని తెలిపారు. టెండర్లపై ఆరోపణలు రాగానే టెండర్లు రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇక సైట్ విజిట్ అనే నిబంధన కోల్ ఇండియా 2018లోనే పెట్టిందని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం కొత్తగా పెట్టింది ఏమీ కాదని తెలిపారు. కోల్ ఇండియా నిబంధన ప్రకారమే సైట్ విజిట్ తప్పనిసరి అని సింగరేణి సంస్థ 2021లో పెట్టిందని ఉప ముఖ్యమంత్రి ఇప్పటికే స్పష్టం చేశారన్నారు.2018, 2021లో అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ పాలకులేనని అంటూ కేంద్ర ఆధీనంలోని ఎన్ఎండీసీ కూడా 2021లో బిడ్డర్లు సైట్ విజిట్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలని నిబంధన పెట్టిందని తెలిపారు. .దేశంలోని చాలా కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ నిబంధనలు అమలు చేస్తున్నాయి, దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ రైల్వే, హిందూస్థాన్ కాపర్ లిమిటెడ్‌లోనూ ఇదే నిబంధన ఉంది, కాంట్రాక్టర్, వెండర్ సైట్ విజిట్ చేయాలని హెచ్‌పీసీఎల్‌లోనూ ఉంది.మరి ఇప్పుడు ఏదో కొత్తగా పెట్టినట్టు, బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని వెంకట్ ఎద్దేవా చేశారు. నిబంధనలు పాటించకుండా పదేళ్లు పంది కొక్కుల్లా తెలంగాణ నిధులన్నీ దోచుకున్నది కల్వకుంట్ల ఫ్యామిలీ అని వెంకట్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. అందుకే ప్రజా ప్రభుత్వం కూడా అలాగే చేసిదేమోనని బీఆర్ఎస్ నేతలు కలవరపడుతున్నారన్నారని అన్నారు. పదేళ్లలో వారు చేయని స్కాం లేదు. దోచుకొని రంగం లేదు.కాళేశ్వరం నుంచి మొదలు పెడితే పాలమూరు వరకు ఫార్ములా ఈ కార్ రేస్ నుంచి మొదలు పెడితే... గొర్రెల స్కాం వరకు దోచుకున్నారని తెలిపారు. ఛత్తీస్గఢ్ విద్యుత్ కొనుగోళ్లలో దాదాపు రూ.6 వేల కోట్లు స్కాం చేసిందెవరు? అని కేటీఆర్ , హరీశ్ రావును ప్రశ్నించారు. ఆనాడు తక్కువకు విద్యుత్ కొనే అవకాశం ఉన్నా... ఎక్కువ కు కొనుగోలు చేసి... రాష్ట్ర ఖజానాకు నష్టం చేసిందెవరు? అగ్గువ, సగ్గువకు సిరీస్ కంపెనీకి ప్రభుత్వ భూములు కట్టబెట్టింది ఎవరు..? అంటూ బల్మూరి ప్రశ్నల వర్షం కురిపించారు. అయినా ఉప ముఖ్యమంత్రి బాధ్యతతో మీడియా సమావేశం పెట్టి వివరాలు వెల్లడించారన్నారు. ఆధారాలు ఉంటే.... ఇస్తే విచారణ కూడా చేస్తామన్నారు.అవి చేయకుండా... అనవసరపు హడావిడి చేస్తూ... ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మీరు ఇలాగే అబద్ధాలతో అసత్య ప్రచారాలు చేస్తే..ప్రజలే చెప్పులు తీసుకుని కొట్టే పరిస్థితి వస్తుందని బల్మూరి వెంకట్ హెచ్చరించారు. మీ ఆడ బిడ్డ చేసిన ఆరోపణలకు ఆన్సర్ చేసే దమ్ము, ధైర్యం లేని మీరు ప్రజల కోసం పనిచేస్తున్న ప్రజాప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడం ఆపకపోతే ప్రజలే బుద్ధిచెబుతారన్నారు.

న్యాయవాది అశోక్ యాదవ్‌పై దాడి హేయం

- విధులు బహిష్కరించిన న్యాయవాదులు
- న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 27: సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో న్యాయవాది అశోక్ యాదవ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ హుస్నాబాద్ న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు విధులను బహిష్కరించి, స్థానిక కోర్టు భవనం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల క్రితం కోర్టు ఆవరణలోనే అశోక్ యాదవ్‌పై భౌతిక దాడికి పాల్పడటం హేయమైన చర్య అని వారు మండిపడ్డారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, న్యాయవాదులకు భద్రత లేని చోట సామాన్యులకు రక్షణ ఎక్కడుంటుందని ప్రశ్నించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను డిమాండ్ చేశారు.నిరంతరం దాడులకు గురవుతున్న న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం, పోలీసు శాఖ పూర్తి బాధ్యత వహించాలని కోరారు. తక్షణమే 'న్యాయవాదుల రక్షణ చట్టాన్ని' తీసుకురావాలని, లేని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు యాళ్ల శ్రీనివాస్ రెడ్డి, సాయిని మల్లేశం, వి. మురళీమోహన్, ఏ. బాలకిషన్, శివశంకర్, పి. దేవదాసు, దేవేందర్, సంపత్ కుమార్, అశోక్ కుమార్, జాల జ్యోతి కుమార్, భానోతు శ్రీనివాస్, సూర్య ప్రకాశ్ రెడ్డి, అరుణ్ తేజ్, శ్రీశైలం, అజయ్, ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలన్నిటికీ పరిష్కారం

- సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- మంత్రికి టీడబ్ల్యూజేఎఫ్, బీజేఎఫ్టీ ధన్యవాదాలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 2: ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు అన్యాయం జరగదని, సమస్యలన్నీ పరిష్కరిస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. అక్రెడిటేషన్ల విషయంలో డెస్క్ జర్నలిస్టులకు గతంలో మంత్రి ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేసిన మంత్రికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, హెచ్ యూజే, డీజేఎఫ్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు. వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వ సహకారం కొనసాగాలని, ఇతర పెండింగ్ సమస్యలు కూడా పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. మంత్రి పొంగులేటి స్పందిస్తూ, ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ఆదరణ ఉంటుందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో టీడబ్ల్యుజేఎఫ్ ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, కార్యదర్శి ఇ.చంద్రశేఖర్ , హెచ్ యూజే నాయకులు, డీజేఎఫ్టీ నాయకులు మస్తాన్, ఉపేందర్, విజయ, రాజారాం, కృష్ణ, తదితరులు ఉన్నారు.

హైడ్రా పాత్ర అభినందనీయం

- ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్: హైదరాబాద్ మహానగర ఆస్తులు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడటంలో హైడ్రా పోషిస్తున్న పాత్ర అభినందనీయం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు, నగర సౌందర్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఆయువుపట్టు లైన చెరువుల రక్షణ, పునరుద్ధరణలో ప్రజా ప్రభుత్వం ఆలోచనలను హైడ్రా ఆచరణలో పెడుతోందని, ఆ క్రమంలో మీర్ ఆలం చెరువు పునరుద్ధరణ సందర్భంగా అక్కడ పని చేస్తున్న పలువురు ఇంజనీర్లు, కార్మికులు అనుకోని ఆపదలో చిక్కుకోగా, రంగంలోకి దిగి, వారి ప్రాణాలను కాపాడిన హైడ్రా సిబ్బందికి ప్రత్యేక అభినందనలు అని ఎక్స్ ద్వారా తెలిపారు.

రహదారి ఆక్రమణపై చర్యలు

- కాచవాణి సింగారంలో ప్రహరిని తొలగించిన హైడ్రా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 27: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం కాచవాణి సింగారంలో రోడ్డు ఆక్రమణను మంగళవారం హైడ్రా తొలగించింది. 40 ఫీట్ల రహదారిలోకి 13 అడుగుల మేర జరిగి పక్కనే ఉన్న తన పొలం హద్దులుగా పేర్కొంటూ ఒక కిలోమీటరు మేర ప్రహరీ నిర్మించగా, దివ్యానగర్ సింగరేణియన్స్ వెల్ఫేర్ సొసైటీ ఫిర్యాదు మేరకు హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. నారాపల్లి - దివ్యనగర్ - కాచవాణి సింగారం గ్రామాలను కలుపుతూ సాగే ఈ రహదారిని ఆక్రమించారంటూ ఫిర్యాదు చేయగా, హైడ్రా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో పరిశీలించింది. దివ్యానగర్ ఫేజ్ 5 పేరిట నాలుగు లే ఔట్లు వేసినప్పుడు 40 ఫీట్ల వెడల్పుతో రహదారిని కేటాయించారు. తర్వాత ఆ పక్కనే వ్యవసాయభూమి ఉన్న వ్యక్తి తన భూమి ఉందని పేర్కొంటూ,13 అడుగుల మేరకు రోడ్డులోకి జరిగి ప్రహరీ నిర్మించారు. లే ఔట్‌లోని వెయ్యికి పైగా ఉన్న ప్లాట్ల యజమానులకు.. సమస్య దశాబ్ద కాలంగా ఈ సమస్య నలుగుతోంది. ఇదే విషయాన్ని సొసైటీ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. లే ఔట్ ప్రకారం రహదారిని పరిశీలించి ప్రహరీని హైడ్రా తొలగించింది. దీంతో రహదారి పూర్తి వెడల్పుతో తిరిగి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రజా రహదారుల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడలు ఒత్తిడిని తగ్గిస్తాయి

- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ & ఎండీ సోనీ బాలాదేవి
- సచివాలయ స్పోర్ట్స్ మీట్ – 2026 ఘనంగా ప్రారంభం

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: ఉద్యోగుల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని, పనిలో ఒత్తిడిని తగ్గించి స్నేహభావాన్ని పెంపొందిస్తాయని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ & ఎండీ సోనీ బాలాదేవి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెక్రటేరియట్, తెలంగాణ శాసనసభ, లోక్ భవన్ ఉద్యోగులు, అధికారుల కోసం నిర్వహిస్తున్న సచివాలయ స్పోర్ట్స్ మీట్ - 2026 ఎల్బీ స్టేడియంలో ఉదయం 11.30 గంటలకు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి ఐఎఫ్ఎస్ హాజరై క్రీడలను అధికారికంగా ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్ లో క్రికెట్, వాలీబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ (100 మీటర్లు, రిలే రేస్) వంటి పలు ఇండోర్ మరియు అవుట్ డోర్ క్రీడా పోటీలు నిర్వహించబడుతున్నాయి. వివిధ విభాగాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరి శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రేమ్, ట్రెజరర్ కైలాష్, స్పోర్ట్స్ సెక్రటరీ వంశీదర్ రెడ్డితో పాటు ఆఫీస్ బేరర్స్ నవీన్, ఆయిష తబస్సుమ్, రాము భూక్యా, కంచెర్ల శ్రీనివాస్ రెడ్డి, నీరజాక్షి, రాజేశ్వర్, కనక తార తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కులను కాపాడుతాం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి
- ఆల్ మేవా క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: ఉద్యోగస్తుల హక్కులను, ముఖ్యంగా మైనారిటీ ఉద్యోగస్తుల హక్కులు కాపాడుతామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ 2026 డైరీ, క్యాలెండర్ను చిన్నారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా మైనార్టీలకు రావలసిన హక్కులను కాపాడటంలో అవసరమైతే పోరాటం చేసి వాటిని అమలు అయ్యేట్లు కాంగ్రెస్ పార్టీ పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ మే వావా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్ వహీద్ షా ఖాద్రి, కోశాధికారి ఏం. ఏ. రషీద్, రాష్ట్ర నాయకులు జావేద్ అహ్మద్, తక్యుద్దీన్ అహ్మద్, ప్రవాస భారతీయుడు ముహమ్మద్ వాజీద్, సయ్యద్ అజమ్ హుస్సేన్, ఖాజా ఫరూఖ్ అలీ, ముంతాజ్ అలీ, అతి ఖుర్ రెహమాన్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల కోసం సర్వం సిద్ధం

- 28 వార్డులకు 53,403 మంది ఓటర్లు
- షాద్ నగర్ మున్సిపాలిటీలో 76 పోలింగ్ కేంద్రాలు
- మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన డీసీపీ శిరీష

ప్రతిపక్షం, షాద్ నగర్, జనవరి 27: మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని షాద్ నగర్ లో అధికారులు ఏర్పాట్లను సమీక్షించారు. మంగళవారం సాయంత్రం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే మున్సిపాలిటీలో నామినేషన్ల పర్వం కోసం పూర్తి ఏర్పాట్లు చేశారు. కమిషనర్ సునీత రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లను షాద్ నగర్ జోన్ డీసీపీ సీహెచ్ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయకుమార్ తదితరులు కార్యాలయం వద్ద భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. రేపు ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న నామినేషన్ల పర్వం కోసం కార్యాలయంలో తగిన ఏర్పాట్లు సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి తో డీసీపీ శిరీష మాట్లాడారు. కార్యాలయానికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..నామినేషన్ల పర్వం కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. అదేవిధంగా మున్సిపాలిటీలో 28 వార్డుల్లో 53, 403 మంది ఓటర్లు ఉన్నారని, 76 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు.

నా చిరకాల కోరిక పేదోడు చదువుకోవాలి

- బొట్టుగూడ పాఠశాల ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి
- కోమటిరెడ్డి ప్రతీక్‌ఫౌండేషన్‌ఆధ్వర్యంలో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మాణం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 26: కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 కోట్ల రూపాయల వ్యయంతో నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పేదోడు చదువుకొని అభివృద్ధి చెందాలన్నదే తన చిరకాల కోరిక అని,ఎలాంటి వసతులు లేకుండా నిర్వహిస్తున్న బొట్టు గూడ పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టి, అధునాతన హంగులు కల్పించాలన్నది తన చిరకాల కోరిక అని అన్నారు. 2500 గజాల స్థలంలో అన్ని అత్యాధునిక వసతులతో బొట్టుగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను నిర్మించడం జరిగిందని అన్నారు. బొట్టు గూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల రొటీన్ పాఠశాల కాదని, సంప్రదాయ విద్య కాకుండా అన్ని రకాల నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా ఒక పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా వాల్డాఫ్ విద్యా విధానాన్ని ఈ పాఠశాలలో అమలు చేయడం జరుగుతుందన్నారు. పాత సిలబస్ తో పాటు, సీబీఎస్ఈ ని కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పాఠశాల ద్వారా అనుభవాత్మక విద్యను నేర్పించడం జరుగుతుందని తెలిపారు. పిల్లలపై ఒత్తిడి లేకుండా విద్య నేర్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. నల్గొండ అభివృద్ధిలో భాగంగా 800 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు తీసుకొని రావడం జరిగిందని, రానున్న రెండేళ్లలో నల్గొండ రూపురేఖలను మార్చడం జరుగుతుందని అన్నారు. బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల ద్వారా మంచి విద్యను అందించడం పై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని, పాఠశాల ద్వారా ఆణిముత్యాల లాంటి విద్యార్థులను తయారు చేయాలని, ఐఏఎస్, ఐపీఎస్, సైంటిస్టులను తీర్చిదిద్దాలని, అలాగే పేదవారి చదువు కోసం సహకారం అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బొట్టు గూడ పాఠశాల ప్రవేశాల ఆధారంగా అవసరమైతే అదనపు గదులను నిర్మిస్తామని ఆయన వెల్లడించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్ష్యులు హఫీజ్ ఖాన్,ప్రతీక ఫౌండేషన్ సీఈఓ గోనా రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పలువురు అధికారులు, పాఠశాల హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ మధ్వనవమి వేడుకలు

- చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

ప్రతిపక్షం, షాద్ నగర్, జనవరి 27: షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం మధ్వనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ మధ్వ నవమి ని పురస్కరించుకొని దేవాలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకం, ఆకు పూజ, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. షాద్నగర్ విష్ణు సహస్ర పారాయణ మండలి ఆధ్వర్యంలో దేవాలయ ఆవరణలో గీతా పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి పల్లకి సేవ తో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు రఘుపతిరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాఘా శుద్ధ నవమి రోజున మధ్వనవమి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. వాయుదేవుడే మధ్వాచార్యులుగా అవతరించాడని, మధ్వాచార్యుల యొక్క గొప్పతనాన్ని విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ ఊరేగింపులో భక్తుల ఆటపాటలు భజనలతో దేవాలయం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. అదే విధంగా నారాయణపేట కొల్లూరుకు చెందిన కర్ణాటక సంగీత భజన మండలి సభ్యుల గీతాలాపనలతో భక్తులు ద్వైత సిద్ధాంతకర్తను స్మరించుకున్నారు. అనంతరం బ్రాహ్మణులకు, భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యంసాని నర్సింలు, వీర్లపల్లి కృష్ణయ్య, ప్రవీణ్ యాదవ్, యాదగిరి, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, గోరియా నాయక్, లింగమయ్య భజన మండలి సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

“

సినిమా రిజల్ట్‌పై హీరోల ఫ్యాన్ వార్స్ ప్రభావం ఏమాత్రం ఉండదు. ఏం చేసినా ఫ్యాన్ వార్స్ ఆగవు. కానీ వాటి వల్ల సినిమాకి వచ్చే రెవెన్యూలో అర్ధ రూపాయి కూడా తగ్గదు. మూవీ బాగుంటే ఆయా హీరోల ఫ్యాన్స్‌తో పాటు జనరల్ ఆడియన్స్ ఆదరిస్తారు.

- డైరెక్టర్ అనిల్ రావిపూడి

ప్రాంతీయం

ప్రజల పక్షాన నిలబడే పత్రిక 'ప్రతిపక్షం'

- తహసీల్దార్ ఖాసీం , ఎస్సై సైదా రాహుఫ్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం, గుండాల, జనవరి 27: గుండాల మండల కేంద్రంలో 'ప్రతిపక్షం' పత్రిక క్యాలండర్‌ను మంగళవారం గుండాల తహసీల్దార్ ఖాసీం,ఎస్సై సైదా రాహూఫ్, ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సమాజాభివృద్ధికి, ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా 'ప్రతిపక్షం' పత్రిక ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి, ప్రజల పక్షాన నిలబడుతూ బాధ్యతాయుత పాత్ర పోషిస్తోందని అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రతిపక్షం ప్రతినిధి మలిపెద్ది పవన్, ప్రెస్ క్లబ్-2 అధ్యక్షులు గడ్డం వీరన్న, ప్రెస్ క్లబ్-3 అధ్యక్షులు తవిడిశెట్టి రాంబాబు, కోడెం ప్రవీణ్ పాల్గొన్నారు.

కరీంనగర్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రి పొన్నం దంపతులు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, జనవరి 27: కరీంనగర్ జిల్లాలో భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఇప్పటికే భక్తులతో కళకళలాడుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇవాళ ఎంతో విశేషమైన ఎదుర్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ భక్తిశ్రద్ధలతో పాల్గొని, శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించడం విశేషంగా నిలిచింది. వేద మంత్రోచ్చారణల నడుమ,ఆలయ అర్చకుల ఆశీర్వచనాలతో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి సర్వ ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ వేడుకను మరింత ఘనంగా తీర్చిదిద్దారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడుతుండగా,ఆధ్యాత్మిక వాతావరణం కరీంనగర్ ప్రాంతమంతా పరచుకుంది. ఇక రాబోయే రోజుల్లో కూడా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో వివిధ ప్రత్యేక పూజలు, వాహన సేవలు భక్తుల కోసం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వేములవాడ రాజన్నకు ప్రత్యేక పూజలు

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు.అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు అందరి పై ఉండాలని ప్రార్థించారు. రాష్టంలో 121 మున్సిపాలిటీ లు ,10 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి..అనివార్య కారణాల వల్ల 10 మున్సిపాలిటీ లకు ఎన్నికలు జరగడం లేదన్నారు.అన్ని మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ప్రజా పాలన ప్రభుత్వం లో రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మున్సిపాలిటీ లకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ ల్లో ప్రభుత్వం అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందన్నారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఒక్క డబుల్ బెడ్ రూం ఇవ్వలేదు.. మేము నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు...ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు.. మేము రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నాం..ఇది నిరంతర ప్రక్రియ అన్నారు.దేశంలో ఉన్న ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ లో మాత్రమే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. పేద ప్రజలు నెలకు 1000 రూపాయల కరెంట్ బిల్లు కట్టే పరిస్థితి ఉండేది.. మేము నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. మహిళలు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా వేములవాడ ,సమ్మక్క సారలమ్మ జాతర కి వెళ్ళిన ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు..తెలంగాణ ప్రభుత్వం 9 వేల కోట్ల విలువైన ప్రయాణం ఉచితంగా చేశారు..ప్రభుత్వం ఆర్టీసీకి డబ్బులు చెల్లిస్తుందన్నారు. కేసీఆర్ కూతురు ,కేటీఆర్ సోదరి హరీష్ రావు మరదలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు జవాబు చెప్పాలన్నారు.జిల్లాల తొలగింపు ఉండదు.. జిల్లాలు తొలగిస్తామని ఎవరు అనలేదు..సాంకేతికంగా హద్దులు వద్ద ఇబ్బందులు ఉన్నాయి..మా హుస్నాబాద్ బలవంతంగా సిద్దిపేట లో కలిపారు.. దానిని కరీంనగర్ లో కలుపుతామన్నారు.

నేడు మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం.

హాజరు కానున్న మంత్రి వర్యులు తుమ్మల, పొన్నం హుస్నాబాద్ లోని కేజేఆర్ గార్డెన్స్ లో బుధవారం ఉదయం 11 గం.లకు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పాల్గొంటారు. హుస్నాబాద్ టౌన్ మాజీ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న , మాజీ వైస్ చైర్మన్ ఆయిల్నేని అనితా రెడ్డి తో పాటుగా పలువురు నాయకులు మంత్రి వర్యుల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి చేరుతారు. ఈ కార్యక్రమంలో టౌన్ నాయకులు, కార్యకర్తలు. పార్టీ శ్రేణులు పాల్గొంటారు.

నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, జనవరి 27: మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటిలో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సహాయార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఎన్‌ఓసీ కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సందర్శనలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా ఉన్నారు.

మైనార్టీలంతా కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

- కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, జనవరి 27: కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ మైనార్టీ సోదరులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీతో దశాబ్దాలుగా మైనార్టీలకు ప్రత్యేక అనుబంధం సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఎన్నికల్లోను కాంగ్రెస్ కు అండగా నిలుస్తున్నారని చెప్పారు.మంగళవారం కరీంనగర్ లోని 31 డివిజన్ ఖాన్ పూరాలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ కార్యాలయాన్ని రాజేందర్ రావు ప్రారంభించారు. అంతకు ముందు భారీ ర్యాలీతో రాజేందర్రావు తరలివచ్చారు. ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ నాయకులు మైనార్టీ నాయకులు, సోదరులు మహిళలు ప్రజలు రాజేంద్ర రావుకు ఘన స్వాగతం పలికారు.

'ద పీపుల్స్ ఆఫ్ గాడ్ చారిటబుల్ ట్రస్ట్' సేవా కార్యక్రమం

- నిరుపేదలకు నెలనెలా అన్నదానం

ప్రతిపక్షం, ఖమ్మం, జనవరి 27: నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా 'ద పీపుల్స్ ఆఫ్ గాడ్ చారిటబుల్ ట్రస్ట్' మంగళగూడెం ఆధ్వర్యంలో ఉచిత ఆహార పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఖమ్మం పాత బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసరాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 60 మంది నిరుపేదలకు ఒక్క పూట భోజనం అందజేశారు.ఈ ట్రస్ట్ ప్రతి నెల నిరంతరంగా ఈ విధమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ,ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయంగా నిలుస్తోంది. ఆకలితో బాధపడుతున్న వారిని ఆదుకోవడమే తమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ సేవా కార్యక్రమానికి దున్న వినీత్ రాజ్ విజయశ్రీ దంపతులు సహకారం అందించారు. వారి సహకారంతో ఆహార పొట్లాలను సిద్ధం చేసి అవసరమైన వారికి పంపిణీ చేశారు.ఆహార పంపిణీ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సాదిన్ని వీరబాబు ఆనంద్ పాల్, ట్రెజరర్ మాధవి, పున్న రామారావు, తోకల వెంకన్న, రుద్ర నాగేశ్వరరావు, తోకల రమేష్‌తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు.

వాసవి వనితా వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో గోమాత పూజ

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, జనవరి 27: ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు క్యాలెండర్ ఈవెంట్లో భాగంగా వాసవి వనితా వాగ్దేవి క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో వాగ్దేవి క్లబ్ అధ్యక్షురాలు అయినటువంటి గంప హారిణి ఇంటి వద్ద జెండా ఆవిష్కరణను చేసి, గోమాతను పూజించుకోవడం జరిగింది. క్లబ్ సభ్యులను ప్రోత్సహించే విధంగా వాళ్ళకి ఆటల పోటీలను నిర్వహించి అందులో గెలుపొందినటువంటి అభ్యర్థులకు బహుమతులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జంధ్యం మాధవి, సూర గీత, రాచమల్ల గాయత్రి, మాడిశెట్టి ఉమాదేవి, జోనల్ చైర్పర్సన్ భారతి , క్లబ్ అధ్యక్షులు గంప హారిణి ,క్లబ్ కార్యదర్శి కేశెట్టి విశాల , క్లబ్ కోశాధికారి ముస్త్యాల సమత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ హయాంలో నగరం అభివృద్ధి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, జనవరి 27: కరీంనగర్ నగరంలోని తొమ్మిదవ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి గంగుల కమలాకర్ ప్రసంగించారు.రాబోయే నగరపాలక సంస్థ ఎన్నికల్లో 9వ డివిజన్ నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న జంగిలి ఐలేందర్ యాదవ్ - లతలను భారీ మెజారిటీతో గెలిపించాలని గంగుల కమలాకర్ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ హయాంలో కరీంనగర్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, మౌలిక సదుపాయాలు, రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు వంటి సమస్యలను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించిందని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పని చేస్తుందని, అందుకే మరోసారి పార్టీకి అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే, 9వ డివిజన్‌లో మరింత అభివృద్ధి జరగాలంటే అనుభవం ఉన్న బీఆర్ఎస్ నాయకులను గెలిపించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతోనే పార్టీ మరింత బలపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పార్టీ కార్యాలయం ప్రారంభంతో 9వ డివిజన్‌లో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

'మంచి నీళ్లు' తాగే అవకాశం ఉందా?

- డీజే ఎఫ్ డబ్ల్యూ, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వడ్డేపల్లి హనుమంతు

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 27: ఒకప్పుడు బయట నుంచి ఇంటికి రాగానే ముందుగా చేతులు, కాళ్లు కడుక్కొని ఆ తర్వాత ఇంట్లోకి వెళ్లేవాళ్లం. ఇప్పుడు అదంతా ఏం లేదు. చెప్పులతోనే లోపలికి వెళ్తున్నాం. చల్లటి మట్టికుండ నీళ్లను ఒకప్పుడు తాగేవాళ్లం. ఇప్పుడు ఎక్కడెక్కడో తిరిగి వచ్చి, మన ఇంట్లోనో లేకపోతే మరొకరి ఇంటికో వెళ్లి నీళ్లు తాగేస్తున్నాం. ఇంతకు ముందు గ్లాసును నోటికి తగిలించకుండా పైకి ఎత్తి నీళ్లు తాగడం తెలుసు. వేడి వేడి కాఫీని కూడా గ్లాసు పైకెత్తి తాగేవాళ్లం. దాన్ని మడి చాదస్తం అంటారు. కానీ ఇప్పుడేంటో గ్లాసును నోటికి తగిలించి ఎంగిలి చేసేస్తున్నాం. కాళ్లు కడుక్కోవాల్సిన అవసరం లేదు. చెప్పులు, బూట్లతోనే ఇంట్లో కూర్చుని మాట్లాడుకుంటున్నాం. నోట్లో పెట్టుకుని నీళ్లు తాగుతున్నాం. దుకాణాల్లో ప్లాస్టిక్ బాటిల్‌ను చేతికి ఇస్తారు. అందులోని నీళ్లను సగం తాగి బాటిల్‌ను పక్కకు పారేస్తారు. ప్లాస్టిక్‌తో పాటు నీళ్లను కూడా చెత్తకుండలో నింపుతూ వెళ్తున్నాం. కొందరు మూత పెట్టరు. అక్కడ పడిపోయి నీళ్లు కారుతుంటాయి. ప్లాస్టిక్ బాటిల్ ఇప్పుడు మన నాగరికతలో భాగంగా మారిపోయింది. ప్రతి ఇంట్లో ఉండే బావి ఇప్పుడు లేదు. కాలనీ, అపార్ట్‌మెంట్‌లలో బావి అవసరం లేదనుకుంటున్నారు. నీళ్ల కనెక్షన్ ఎక్కడ నుంచి వస్తుందో అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసే వ్యక్తి అడగడం లేదు. "వాటర్ బబుల్ కొనుక్కోండి" అంటారు. అందులో లేదా ప్లాస్టిక్ బాటిల్‌లో బిస్లరీ అంటున్నారు. అవి మంచి నీళ్లా? మామూలు నీళ్లా? ఏదో తెలియదు. 'మంచి నీళ్లు' అడగడమనే మాటే ఇప్పుడు తెలియదు.

ఇప్పుడిదే సంస్కృతి, నాగరికత, సంస్కారం

ఒకప్పుడు చెరువు ఉండేది. దానికి కట్ట ఉండేది. ఆ కట్టను కాపాడుకునే దేవత ఉండేది, ఉంటుంది. మైసమ్మ కట్టని, గండి కట్ట మైసమ్మని, పోచమ్మని ప్రజలు పిలుచుకుంటుంటారు. ప్రస్తుతం చాలా చోట్ల చెరువు లేదు. కట్ట కూడా లేదు. కట్టమైసమ్మ మాత్రం ఉంది. దానికి పెద్ద గుడి కడుతున్నారు. పెద్ద పెద్ద కొత్త కార్లు కొనుక్కొని దానికి నిమ్మకాయలు మొదలైనవి కట్టి, గుమ్మడికాయలు పెట్టి, పూలహారాలతో అలంకరించి పూజారి పూజ చేస్తారు. దానికి టికెట్ ఉంటుంది. వాహన టికెట్ వేరే ఉంటుంది. అష్టోత్తర స్తోత్రం చేస్తారు దానికి ఇంకో టికెట్.వాటర్ బబుల్ కొనుక్కొని అందులోని మంచినీటితో చిలకరిస్తే పూజ అయిపోతుంది. కొత్త కారు సంగతి సరేసరి. అంతరిక్షానికి పంపే రాకెట్లు, ఉపగ్రహాలకు కూడా నిమ్మకాయలు, చింతకాయలు వగైరా కడతారు ఇంకా వివరాలు నాకు తెలియదు ,ఎవరి నమ్మకాలు వారివి. తప్పేమీ లేదు. కానీ చెరువు మాయమైంది. ఉంటే మురికి అయింది, మురికి మూసి అయింది. ప్రతి చెరువు ప్రాంతంలో కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, పెద్ద పెద్ద మాల్‌గోమాల్‌లు వచ్చాయి. ప్రభుత్వ కార్యాలయాలు కూడా కట్టేశారు. కట్టలు, గుళ్లు మిగిలాయి. కానీ చెరువు లేదు. అసలు ఇది వరకున్న చెరువే లేదు. కొత్త చెరువులు నిర్మిస్తారో లేదో తెలియదు. మన ఊరి చెరువులో నీళ్లు తాగం. తాగకూడదు. బావిలోని నీళ్లు మంచివి కాదంటున్నారు. మనకు మంచి నీళ్లూ లేవు. మంచి వాళ్లూ లేరు. రాజ్యాంగం మాత్రం మంచిదే. రాజ్యాంగాన్ని అమలు చేసే ముఖ్యమంత్రులు, ప్రధానులు కూడా మంచి వాళ్లే అంటారు. కానీ రాజ్యం ఏది? ప్రజాస్వామ్యం ఏది? ఓట్లు వేసే జనమేరి? దొంగ ఓట్లను ప్రశ్నించే వారెవరు? మంచి నీళ్లు, గాలి, మన పర్యావరణంప్రాథమిక హక్కులు పర్యావరణ విధులు: ఆర్టికల్ 48ఏ ప్రకారం, పర్యావరణాన్ని రక్షించడం ప్రభుత్వ బాధ్యత. అలాగే ఆర్టికల్ 51ఏ జీ, ప్రకారం, సహజ వనరులను కాపాడటం ప్రతి పౌరుడి ప్రాథమిక విధి.. ఆర్టికల్ 21 జీవించే హక్కు: గౌరవప్రదమైన జీవితం అంటే కేవలం బ్రతకడం మాత్రమే కాదు, పరిశుభ్రమైన గాలి, నీరు, ఆరోగ్యకరమైన పర్యావరణం లేకుండా అది సాధ్యం కాదని డిజె ఎఫ్ డబ్ల్యూ, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల్లో పటిష్ట బందోబస్తు మధ్య నామినేషన్ల స్వీకరణ

- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, జనవరి 27: నగరంలో రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో, రేపటి నుండి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియను అత్యంత భద్రతతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వెల్లడించారు. ఈ మేరకు ఆయన మంగళవారం భద్రతా ఏర్పాట్లపై మీడియాకు వివరాలు వెల్లడించారు.

ముఖ్యమైన భద్రతా చర్యలు:

నామినేషన్ కేంద్రాలు: కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని రెండు భవనాలలో మొత్తం 15 గదులను నామినేషన్ల స్వీకరణ కోసం కేటాయించారు. ఇక్కడ 33 మంది రిటర్నింగ్ అధికారులను నియమించగా, ప్రతి గది వద్ద అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు.

యాక్సెస్ కంట్రోల్

నామినేషన్ కేంద్రాల నుండి 100 మీటర్ల దూరం వరకు కఠినమైన యాక్సెస్ కంట్రోల్ అమలులో ఉంటుంది. ఈ పరిధి దాటి అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే లోపలికి అనుమతి ఉంటుంది.భద్రతలో భాగంగా నామినేషన్ కేంద్రాల భవనాల ప్రవేశ ద్వారాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు:

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 25 నుండి 30 శాతం వరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు సీపీ తెలిపారు. ఈ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అదనపు బలగాలను మోహరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.మున్సిపల్ ఎన్నికలు అత్యంత ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా పారదర్శకంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని, అభ్యర్థులు మరియు ప్రజలు పోలీసులకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ లతో కలిసి నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిన భవనాలు, గదులను మంగళవారం సందర్శించారు.

"

భారత్ టీ20 వరల్డ్‌కప్ గెలవకపోతే ఆయన్ను తప్పించాలి. కేవలం ఐపీఎల్‌విజయాల ఆధారంగా ఆయన్ను కోచ్‌గా నియమించడం సరికాదు. గంభీర్ స్థానంలో వీవీఎస్‌లక్ష్మణ్‌ను ప్రధాన కోచ్‌గా ఎంపిక చేయాలి. అపారమైన కోచింగ్ అనుభవం ఉన్న ఆయన జట్టుకు మెరుగైన ఫలితాలను అందిస్తారు.

- మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ

ప్రాంతీయం

మేడారంలో విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించిన సీఎండీ

- రేపటి నుండి ప్రారంభం అవుతున్నమేడారం జాతరకు విద్యుత్ శాఖ సర్వం సిద్ధం: ఎన్పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ జనవరి 27

మేడారం సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఎన్పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి , ఐఏఎస్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విద్యుత్ అధికారులతో మేడారంలో పర్యటించి విద్యుత్ సరఫరా తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.132 కెవి కమలాపూర్ , పస్రా , ములుగు నుండి వచ్చే 33 కెవి నాలుగు వేర్వేరు మార్గాల నుండి ప్రత్యామ్నాయ సరఫరా కోసం డి.పి. స్ట్రక్చర్‌తో కూడిన 8 పోల్ వ్యవస్థను పర్యవేక్షించారు . 106 ట్రాన్స్‌ఫార్మర్లను నేరుగా సబ్ స్టేషన్ నుండి మానిటర్ చేసేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, దీని ద్వారా సమస్యను తక్షణమే గుర్తించి సరిచేయవచ్చని తెలిపారు.జాతర విధుల్లో ఉండే సిబ్బంది కోసం 55 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు పర్యవేక్షకులుగా ఉంటారు. సమ్మక్క సబ్ స్టేషన్ వద్ద సిబ్బందికి ఎన్పీడీసీఎల్ లోగోతోకూడిన టిషర్టులను సీఎండీ పంపిణీ చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా ను ఎప్పటికప్పుడు మానిటర్ చేయడానికి 600 మంది సిబ్బందిని జాతర కొరకు నియమించడం జరిగిందని చెప్పారు . వీరందరికి అన్ని వసతులు ఏర్పాటు చేశామని 70 టెంట్లను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు . తాడ్వాయి, పస్రా సబ్ స్టేషన్లను సందర్శించిన సీఎండీ కొత్తగా నిర్మిస్తున్న సెక్షన్ ఆఫీస్ మరియు గట్టమ్మ వద్ద సబ్ స్టేషన్ పనులను వేగవంతం చేయాలని ఏజెన్సీలను ఆదేశించారు.జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో , డైరెక్టర్లు వి . మోహన్ రావు టి .మధుసూదన్ , చీఫ్ ఇంజనీర్ కె . రాజు చౌహాన్ , సీఈ ఐటి శ్రవణ్ కుమార్ , జియం ఐటి శ్రీనివాస్ , ములుగు ఎస్ఈ ఆనందం , భూపాలపల్లి ఎస్ ఈ మల్చూరు , డిఈ ములుగు పి . నాగేశ్వర రావు , డి .ఈ ఎంఆర్‌టీ & కంస్ట్రక్షన్ సదానందం, డ.ఈ టెక్నికల్ భాస్కర్ , ఈ ఈ సివిల్ వెంకట్ రామ్ , ఏడీఈలు : రాజేష్ , వేణుగోపాల్ , సందీప్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు .

సేవలో సంతృప్తి .. మద్దెల రాజయ్య

ప్రతిపక్షం, మిడిదొడ్డి, జనవరి 27

సేవ చేయడంలో ఎంతో సంతృప్తిగా ఉంటుందని మీరుదొడ్డి ఆరవ వార్డు నెంబర్ మద్దెల రాజయ్య అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని 5 అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న ప్రతి విద్యార్థులకు ప్లేట్లు ,గ్లాసులు ఆయన సొంత ఖర్చుతో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామములో ఉన్న 5 అంగన్వాడి సెంటర్ లోని విద్యార్థుల కు ఎలాంటి సౌకర్యాలు అవసరం ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. సేవ చేయడంలో ఎంతో సంతృప్తిగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మానవసేవే మాధవసేవ అనే నినాదంతో ఆయనకు తోచినంత సహాయాన్ని చిన్నారులకు అందించడం పట్ల అంగన్వాడీ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు రాజయ్యను అభినందించారు. విద్యార్థులకు అంగన్వాడి సెంటర్లో సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని వారికి సూచించారు. చిన్న వయసులోనే పౌష్టికాహారం అందిస్తే వారు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఆయన వెంట మిడిదొడ్డి గ్రామస్తులు యాదగిరి తో పాటు అంగన్వాడి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికల విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రతిపక్షం బ్యూరో,

నిజామాబాద్ జనవరి 27 : బోధన్ మండలం అమ్దాపూర్ లో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారుపాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులు ఏ ఒక్కరిని కూడా లోనికి అనుమతించకూడదని, విద్యార్థినులను వారి తల్లిదండ్రులు వస్తేనే వారి వెంట ఇంటికి పంపాలని హితవు పలికారు. తరచూ ఇంటికి వెళ్ళే బాలికల విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, వారు పదేపదే ఎందుకు వెళ్తున్నారు అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. ఇటీవలే బాన్సువాడ మండలం బోర్లం ఎస్సీ రెసిడెన్షియల్ స్కూల్ కు చెందిన సంగీత అనే 8వ తరగతి విద్యార్థిని నిర్వాహకుల అజాగ్రత్త వల్ల ప్రమాదం బారిన పడి మృతి చెందిందని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా సంఘటనలకు ఆస్కారం లేకుండా బాలికల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అంతకుముందు 8వ తరగతి క్లాస్ రూంను కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పాఠాలు బోధించి వారి సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాగా, పాఠశాల చుట్టూ తక్షణమే ప్రహరీ గోడ నిర్మాణం జరిపించాలని, ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చి వేయించాలని, విద్యుత్ వైరింగ్ సరి చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్ కేటాయిస్తామని అన్నారు. వంటగది, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, ఎంఈఓ నాగయ్య, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు తదితరులు ఉన్నారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించిన కలెక్టర్

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం బోధన్ పట్టణంలోని విజయ మేరీ హైస్కూల్ లో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం బోధన్ మున్సిపాలిటీకి సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కోసం విజయ మేరీ పాఠశాలలో అనువుగా ఉన్న ఆయా విభాగాల గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలన జరిపారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఇతర అధికారులతో డిస్ట్రిబ్యూషన్ కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సాఫీగా జరిగేలా, అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రిపోలింగ్ కు ఆస్కారం ఉండకూడదని అన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ విఠల్, సంబంధిత అధికారులు ఉన్నారు.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం,మెదక్ టౌన్,జనవరి 27

మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డితో కలిసి మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి రాణి కుముదిని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు.నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని,ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని ,ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.సరిపడా సిబ్బంది, బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు,పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు,అదనపు కలెక్టర్ నగేష్ ,జెడ్పి సీఈవో ఎల్లయ్య,డిఆర్డిఓ శ్రీనివాసరావు,డీఎస్పీ ప్రసన్న కుమార్, జిల్లా సైన్స్ అధికారి.రాజిరెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,ఎన్నికల అధికారులు,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

35 యేండ్లుగా నరేంద్ర స్మారక పోటీలు అభినందనీయం

- డాక్టర్ జలగం తిరుపతి రావు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 27 :

విధి నిర్వహణలో జర్నలిస్టు మల్లెపూల నరేంద్ర ఆకస్మికంగా మరణించి 35 యేండ్లు గడుస్తున్న ఆయనను గుర్తుపెట్టుకుని జర్నలిస్టులు నరేంద్ర స్మారక క్రీడా పోటీలు నిర్వహించటం అభినందీయమని ప్రముఖ వైద్యుడు జలగం తిరుపతి రావు అన్నారు. నరేంద్ర మెమోరియల్, నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్ లో మంగళవారం జర్నలిస్టులకు షటిల్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీలను ప్రారంభించిన వైద్యుడు తిరుపతిరావు మాట్లాడుతూ అన్నిరకాల వయస్సుల గల జర్నలిస్టులు, వైద్యులు, అధికారులు అన్నిరంగాల్లో నిష్ణాతులైన ఉన్నారు. ఎంత వయస్సు ఉన్న సరే వయస్సు నంబరే తప్పా మనస్సుకు కాదన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రస్తుతం యువత మొబైల్లో గేమ్స్, వీడియో గేమ్స్ కు అలవాటై పోతున్నారు. మైదానంలో ఆడే క్రీడాలను పూర్తిగా మరిచి పోతున్నారు.మైదానంలో ఆడే క్రీడాలతోనే శారీరకంగా, మానసికంగా, ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటుందన్నారు. చాలమంది చదువుతో ఒత్తిడిలకు గురైవుతున్నారు. అటువంటి వారికి ఆటలు ఆడటం అలవాటు ఉన్నట్లు అయితే ఒత్తిడిలు తగ్గి వారి ఆరోగ్యం మెరుగైతుందన్నారు. ఇలాంటి క్రీడాలను గత 35 సంవత్సరాలుగా పాత్రహిస్తున్న మల్లెపూల నరేంద్ర మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, కన్వీనర్, ప్రెస్ క్లబ్ జర్నలిస్టులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర మెమోరియల్ స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డి సాయిలు, కన్వీనర్ మల్లెపూల నర్సయ్య, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పంచరెడ్డి శ్రీకాంత్, ఐజేయూ నాయకులు బొబ్బిలి నర్సయ్య, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చింతల గంగాదాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు హైమద్ అలీఖాన్, ప్రెస్ క్లబర్ ప్రధాన కార్యదర్శి వాగ్మేరే సుభాష్, కోశాధికారి రాజ్కుమార్, ఆఫీసర్స్ క్లబ్ మేనేజర్ సురేష్, జర్నలిస్టులు పాల్గొన్నారు. షటిల్ విజేతలు ...జర్నలిస్టు నరేంద్ర స్మారకార్థం నిర్వహించిన షటిల్ పోటిల ఫైనల్ మ్యాచ్ లో భానుతేజ, సందీప్ ల పై శ్రీకాంత్, రాజలింగం జట్టు 6 15 తేడాతో గెలుపొందింది.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించింది

- సాగునీరు ఇవ్వడంలో ఘోరంగా విఫలమైంది
- రంగనాయక సాగర్ ఇరిగేషన్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 27:

చిన్నకోడూరు మండలంలోని రంగనాయక సాగర్ ఇరిగేషన్ కార్యాలయం వద్ద రైతులు ధర్నాకు దిగారు. నాట్లు వేసుకొని పంటలను కాపాడుకునేందుకు నీళ్ల కోసం ఎదురుచూస్తున్నామని, కానీ అధికారులు మాత్రం స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లో నాట్లు ఎండిపోతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే నీటిని విడుదల చేయకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల ధర్నాకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో మద్దతుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని, సాగునీరు ఇవ్వడంలో ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రంగనాయక సాగర్ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసన తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఎట్టకేలకు రంగనాయక సాగర్ నుంచి అధికారులు నీళ్లు విడుదల చేశారు. మొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ మంత్రి ఉత్తమ్ కు లేఖ రాశారు. నేడు రైతుల ధర్నా తో ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేశారు.

సిద్ధిపేట మున్సిపాలిటీ నిధులు దారి మళ్లింపు

- అఖిలపక్షం కౌన్సిలర్లు ఆందోళన

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి27

సిద్దిపేట మున్సిపాలిటీలో నిధులు దారి మళ్లుతున్నాయని సిద్దిపేట అఖిల పక్షం కౌన్సిలర్లు రియాజుద్దీన్,బాల లక్ష్మీ ఆరోపించారు. సిద్దిపేట సిద్దిపేట మున్సిపాలిటీ లో పాలకవర్గం సాధారణ సమావేశం నిర్వహించిన అనంతరం అఖిల పక్షం ఆధ్వర్యంలో మున్సిపల్ ఎజెండా ను కాల్చేశారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ మున్సిపల్ నిధులు ఇష్టరీతిగా బడ్జెట్ కేటాయింపులు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. పట్టణం లోని ప్రైవేట్ సంఘాలకు ప్రజల సొమ్ము ఎలా కేటాయిస్తారని మండిపడ్డారు. పట్టణంలోని 12 వార్డులో ప్రజాప్రతినిధి వ్యవసాయ క్షేత్రానికి రోడ్లు వేసుకోవడం సిగ్గు చేటన్నారు. కాలనిలో కొన్ని చోట్ల రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సొంత పొలానికి రోడ్లు వేయించుక్కవడం ప్రజల టాక్స్ ను దుర్వినియోగం చేయడమే అన్నారు.మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ కుమ్మక్కయ్ ఆడుతున్నా నాటకాలని ఆరోపించారు.కోట్ల రూపాయలను పక్కదారి మళ్లీస్తున్నారన్నారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ ను సస్పెండ్ చేయలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కవిత, రాధ, శ్రీదేవి, పూర్ణిమ కాంగ్రెస్ నాయకులు సాకి ఆనంద్, బీజేపీ నాయకుడు కొత్తపల్లి వేణుగోపాల్,ఎల్లం పలువురు పాల్గొన్నారు.

అరణ్యాల నుంచే ఆదాయం: ఎంపీ

ప్రతిపక్షం బ్యూరో, ఖమ్మం, జనవరి 27



అడవులను రక్షించుకుంటూనే సముదాయ ఆధారిత గ్రీన్ జీవనోపాధుల అభివృద్ధి చేయాలని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ''తెలంగాణ వన్ జీవన్‌ధారా ఖమ్మం పైలట్ ప్రాజెక్టు''ను ఎంపీ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అడవులను రక్షించుకుంటూనే సముదాయ ఆధారిత గ్రీన్ జీవనోపాధుల అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ప్రజలకు స్థిరమైన ఉపాధి లభిస్తుందని అన్నారు. ''తెలంగాణ రైసింగ్ విజన్ 2047'' లక్ష్యాలకు అనుగుణంగా వన సంరక్షణ సమితులను స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్‌ప్రైజ్‌లుగా తీర్చిదిద్దే ఈ వినూత్న ప్రయత్నాన్ని ఎంపీ ప్రశంసించారు.

జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టాలి. బాధితురాలితో ఫోన్‌లో మాట్లాడిన ఘటనపై వివరాలు సేకరించాం. మహిళ గౌరవం, భద్రతకు భంగం కలిగించే చర్యలను సహించబోం. ఘటనలో నిజానిజాలు తేల్చి బాధితురాలికి అండగా ఉంటాం.

- ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ

ప్రాంతీయం

ప్రణాళికబద్ధమైన చదువే ఉత్తమ ఫలితాలకు మార్గం

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 27:

పదవ తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి కనకరాజు అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాల, దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి పాఠ్యాంశాన్ని పూర్తిగా అవగాహన చేసుకుంటూ నిరంతరం సాధన చేస్తే ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణులు అవుతారని అన్నారు. విద్యార్థులందరూ పట్టుదలతో కష్టపడి బాగా చదవాలని సూచించారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో మిషన్ పదవ తరగతి కార్యక్రమాన్ని ప్రకటించారని రాష్ట్ర, జిల్లా,నియోజకవర్గ, మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.మండల స్థాయిలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిస్తే రూ, 10,000 నగదు బహుమతి అందజేస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ రాష్ట్రస్థాయి నగదు బహుమతులను సొంతం చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ బ్రాంచ్ మేనేజర్ నాగరాజు, ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, బాసిత్,రాజేశ్వర్, యాదగిరి, శ్రీధర్, రమేష్, సాగరిక, సిఆర్పి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 27:

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో గల హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్ మున్సిపాలిటీలకు నిర్వహించనున్న 2వ సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నోడల్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని మంగళవారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మున్సిపల్ ఎన్నికలలో అధికారులు అంకితభవంతో పనిచేసి ఎలాంటి తప్పులకు తావు లేకుండా మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమీదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన అనంతరం జిల్లా కలెక్టర్ కే. హైమావతి కలెక్టరేట్లో మున్సిపల్ ఎన్నికల జిల్లా నోడల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ, బ్యాలట్ బాక్సులు, రవాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్షణ, మీడియా, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల

పరిష్కారం, నివేదికలు, మైక్రో ఆబ్జర్వర్లు తదితర కీలక అంశాలకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.నియమితులైన నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఆదేశాల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా ఎలాంటి పొరపాటుకు తావులేకుండా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, జడ్పీసీఈఓ రమేష్, డిపిఆర్ఓ రవికుమార్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్, డివిజనల్ పంచాయతీ అధికారి, సహకార అధికారి నాగేశ్వరరావు, ఎన్నికల శిక్షణ అధికారులు అయోధ్య రెడ్డి, రామస్వామి, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం సర్పంచ్ వెంకటయ్యకు సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 27:

మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ పరిధిలోని ఆగ్రహారం గ్రామానికి చెందిన సర్పంచ్ అంబాపురం వెంకటయ్య ను ఘనంగా సన్మానించారు. నూతన సర్పంచ్ గా ఎన్నికైన సందర్భంగా ముదిరాజ్ మహాసభ మెదక్ జిల్లా కార్యదర్శి తలారి బిక్షపతి ముదిరాజ్ సమక్షంలో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో చేగుంట మాజీ ఎంపీపీ కే, పాండు రెడ్డి పల్లి మాజీ సర్పంచ్ మంద బాలచంద్రం మాజీ ఎంపీటీసీ కటిక హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- **ఐదు కోట్ల 65 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 27 :

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం భారతి నగర్, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో 5 కోట్ల 65 లక్షల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి బల్దియా పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకార అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హాజరైన స్థానిక కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, డిఈ వెంకటరమణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, ప్రమోద్ గౌడ్, ఆయా కాలనీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకలవ్య మహర్షి విగ్రహం ఏర్పాటు చేయాలి

- **కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్**

ప్రతిపక్షం,సిద్దిపేట టౌన్, జనవరి 27:

పట్టణంలో ఏకలవ్య మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని 26వ వార్డు కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రవీణ్ మాట్లాడుతూఅన్ని కులాలకు లభిస్తున్న గౌరవం మా ఏకలవ్య కులానికి కూడా దక్కాలని ఆయన పేర్కొన్నారు.ఆదివాసీ గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన ఏకలవ్య మహర్షి విగ్రహాన్ని పట్టణంలోని ప్రధాని కూడలి వద్ద ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్పర్సన్ మంజులకు కౌన్సిలర్ ప్రవీణ్ వినతి పత్రాన్ని అందజేశారు.ఈ ప్రతిపాదనపై మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సానుకూలంగా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వర్ధన్నపేట రాజకీయాల్లో కలకలం బిఆర్ఎస్‌లోకి మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్!

- **వేడెక్కిన వాతావరణం**

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 27....

వర్ధన్నపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తన అనుచరులతో కలిసి బిఆర్ఎస్ పార్టీలో చేరనుండటంతో నియోజకవర్గ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.స్థానికంగా అధికార కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే ఉన్నప్పటికీ, కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమని పలువురు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా, పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకోవడంలో అధికార పార్టీ విఫలమైందనే భావన బలపడుతోంది.కార్యకర్తల సమస్యలను పట్టించుకోకుండా ఎమ్మెల్యే నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే కారణంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్ష పార్టీల వైపు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో ఆరూరి రమేష్‌కు ఉన్న ప్రాబల్యం మరింత పెరుగుతోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలో అభివృద్ధి కనిపించకపోవడంతో ప్రజలు కూడా అధికార పార్టీపై ఆసక్తి కోల్పోయి ప్రతిపక్ష పార్టీల వైపు చూడడం ప్రారంభించినట్టు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు తిరిగి బిఆర్ఎస్ లేదా బీజేపీ వైపు మొగ్గు చూపడం అధికార పార్టీలో కలవరం రేపుతోంది.గత సర్పంచ్ ఎన్నికల్లో అధికార పార్టీ చాలా చోట్ల పరిమితమైపోవడం, మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నాయకులు పార్టీలు మారడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అధికార పార్టీని వీడుతూ ప్రతిపక్ష పార్టీల వైపు నాయకులు వెళ్లడం గందరగోళ పరిస్థితిని సృష్టిస్తోంది.ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఎవరు ఏ పార్టీలో ఉంటారు? ప్రజలు ఏ వైపు మొగ్గు చూపుతారు? అన్నది అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులను గమనిస్తే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా అధికార పార్టీకి గట్టి సవాలు ఎదురయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఓటు అడిగే హక్కు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు లేదు

- **కేంద్రం పైసలతోనే మున్సిపాలిటీల అభివృద్ధి**
- **ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి**

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 27: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదని, బీజేపీకి మాత్రమే ఉందని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు.కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీ లు మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నాయని, ఆ రెండు పార్టీ లతో పైస ఉపయోగం లేదన్నారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం లో బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీ ఆర్ ఎస్ పార్టీల విధానం, వైఖరి ప్రజలను మోసం చేయడమన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అందించే నిధులతోనే రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధి జరుగుతుందన్నారు. 10 సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్, రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమి లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉజ్వల యోజన, స్వచ్ భారత్ మిషన్, స్మార్ట్ సిటీ, అమృత్, తదితర పథకాల కింద ఇచ్చిన నిధులతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదవి కాలం పూర్తియినా ఏడాదిగా మునిసిపల్ ఎన్నికలు పెట్టడం లేదన్నారు. కేవలం కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం ఎన్నికలను నిర్వహిస్తుందన్నారు. ఎన్నికల్లో సర్వే ఆధారంగా గెలిచే అభ్యర్థులకు టికెట్లు ఇస్తామని తెలిపారు. మున్సిపాలిటీల్లో ఈ సారి బీజేపీకి అవకాశం ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

“

ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నాశనం చేసింది. కార్మికుల హక్కులు, పంచాయతీలు, రాష్ట్రాల అధికారాలను హరించడం, దేశాన్ని రాజుల కాలంలోకి నెట్టడమే ప్రభుత్వ ఉద్దేశం. అలా అయితే పవర్, సంపద కొద్దిమంది చేతుల్లోనే ఉంటుంది కదా. కనీస వేతనాలు, పనికి గ్యారంటీ, స్వేచ్ఛ, గౌరవంతో పని చేసే హక్కుతో ఎంజీనరేగా తమ జీవితాలను మార్చిందని కార్మికులు అంటున్నారు.

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

విద్యతోనే సమాజంలో గుర్తింపు

ప్రతిపక్షం ప్రతినిధి,

విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని గౌరుముచ్చు నాంచారయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గౌరుముచ్చు అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఘంటసాల జడ్పీ పాఠశాల 80వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీరంగవల్లి, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గురుకుల సూపరింటెండెంట్ బి రమేష్‌కు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట :

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని దుబ్బాక మండలం రామక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో సూపరింటెండెంట్ గా విశిష్ట సేవలు అందిస్తున్నందుకు బి రమేష్ జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్నారు . ఈ సందర్భంగా రమేష్ ను గురుకుల పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మేడారం జాతరకు పోటెత్తిన భక్తులు

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, జనవరి 27

సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఉదయం వరకు స్వల్పంగా ఉన్న భక్తుల రద్దీ మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా పెరిగింది. సాయంత్రం సమయానికి మేడారం పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.బుధవారం సారలమ్మ గద్దెకు, గురువారం సమ్మక్క గద్దెకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో మేడారానికి చేరుకుంటున్నారు. వాహనాలు, ఆటోలు, బస్సులు, నడక మార్గాల ద్వారా లక్షలాది మంది భక్తులు తరలివస్తుండటంతో రహదారులపై ట్రాఫిక్ పెరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. తాగునీరు, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారు.

మేడారం జాతర సందర్భంగా భక్తులు సంప్రదాయ పూజలు నిర్వహిస్తూ అమ్మవార్ల దర్శనంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.

చట్ట ఉల్లంఘన తగదు: డాక్టర్ అర్షియా సేథి

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 27:

చట్టాలను గౌరవించినప్పుడే అవి మనకు రక్షణ కల్పిస్తాయని, చట్ట ఉల్లంఘన తగదని ఫుల్‌బ్రైట్ ఫెలో, విద్యావేత్త డాక్టర్ అర్షియా సేథి అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళలు విభాగం ఆధ్వర్యంలో 'మౌనాన్ని వీడడం: నేటి భారతదేశంలో కళలు, చట్టం' అంశంపై ఆమె అతిథ్య ఉపన్యాసం ఇచ్చారు.ఈ సందర్భంగా మేధో సంపత్తి హక్కులు (ఐపీఆర్)పై అవగాహన కల్పిస్తూ, కాపీరైట్, ట్రేడ్‌మార్కులు, జీఐ, పైరసీ, సాహిత్య

దొంగతనం వంటి అంశాలను వివరించారు. 1957 కాపీరైట్ చట్టం, 2012 సవరణల ప్రాధాన్యతను ఆమె వివరించారు. ఐపీఆర్ ఉద్యోగాలు, ఆదాయ సృష్టి, ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కళారూపాలపై ఎవరికీ గుత్తాధిపత్య హక్కు ఉండదని, అయితే కళాకారుల నైతిక హక్కులు గౌరవించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తొలుత, కార్యక్రమ సమన్వయకర్త వైష్ణవి అతిథిని స్వాగతించి, సభికులకు పరిచయం చేశారు. లలిత, ప్రదర్శన కళల విభాగానికి చెందిన డాక్టర్ లలిత సింధూరి, డాక్టర్ ఆదిశేషయ్య అతిథిని జ్ఞాపికతోసత్కరించారు.కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ లో పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు ధరకాస్తు చేసుకోండి

- ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలి
- ఓయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముడావత్ రవినాథ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 27:

గ్రూప్ 1,2,3,4, ఆర్ ఆర్ బి, ఎస్ఐ , కానిస్టేబుల్, ఎస్ ఎస్ సి తదితర పోటీ పరీక్షలకు సిద్దిపేట టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఫౌండేషన్ కోర్సు ద్వారా 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నారని , నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని ఓయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముడావత్ రవినాథ్ అన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ తో కలసి ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లా లోని అభ్యర్థులు అందరు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 9 నుంచి 30 వ తేదీ వరకు దరఖాస్తు లను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ

పూర్తి చేసి 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్లైన్ లో tsstudycercle. co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 8 న ప్రతిభ డిగ్రీ కళాశాల లో ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 91822 20112 లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 27:

జిల్లా కేంద్రంలోని పాత ఎల్లెంకి ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. వంట గది, డైనింగ్ హాల్ గదులు మురికిగా ఉన్నందున సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం డిటర్జెంట్ తో కడిగాకే వంట చెయ్యాలని డైనింగ్ హాల్ లో విద్యార్థులకు భోజనం పెట్టాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. మళ్ళీ ఒక గంటలో వస్తానని మొత్తం శుభ్రం చెయ్యాలని పారిశుధ్య సిబ్బందిని హెచ్చరించారు. గంట తర్వాత మళ్ళీ గురుకుల పాఠశాలలో పారిశుధ్య సిబ్బంది పనిని పర్యవేక్షించారు. వంట గది, డైనింగ్ హాల్ కడిగినాక ఎంత శుభ్రం గా ఉందని రోజు ఇలాగే చెయ్యాలని మళ్ళీ పర్యవేక్షణకు వచ్చినపుడు అపరిశుభ్రంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం ఇడ్లీ పెట్టమని మధ్యహ్నం అన్నం, చిక్కుడుకాయ, గుడ్డు, సాంబారు చేస్తున్నట్లు వంట సిబ్బంది తెలపగా విద్యార్థులకు రుచికరంగా

వండాలని ఆదేశించారు. స్టోర్ రూమ్ లో మెటీరియల్ ను తనికి చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం రోజు ఆహార పదార్థాలను అందించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. విద్యార్థులకు కామన్ డైట్ మెనూ పాటించడం తో పాటు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని ప్రిన్సిపల్ ను , ఉపాధ్యాయులను ఆదేశించారు.

మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక సీపీఐని గెలిపించండి

- రిజర్వాయర్లలో నీటిని నింపి రైతాంగానికి విడుదల చేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 27:

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతు అయిన సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని,జిల్లాలో బలమున్న చోట్ల పార్టీ అభ్యర్థులను బరిలో దించుతామని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. మంగళవారం నాడు పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగినటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో బరిలో ఉంచుతున్నామని, ప్రజా సమస్యల పైన నిరంతరం పోరాడే, ప్రశ్నించే గొంతుకలు అయిన సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. మతతత్వ శక్తులను ఓడగొట్టాలంటే కాంగ్రెస్, సీపీఐ పార్టీలు కలిసి ఎన్నికల్లో పనిచేస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగు అంటి పోవడం వల్ల బావులలో నీళ్లు లేక జిల్లా లోని రైతులు ఇబ్బందులు పడుతున్నారని,పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని, జిల్లా లో ఉన్న మల్లన్నసాగర్,రంగనాయక సాగర్ ప్రాజెక్టు లో నిలువ ఉన్న నీటిని రైతాంగానికి నీటిని అందించాలని, రైతుల బాధలను ప్రభుత్వం తీర్చాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం ఇన్చార్జి శివలింగ కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, మండల సహాయ కార్యదర్శి కొండకింది పోచయ్య, పార్టీ నాయకులు కొండి రాజం, చింత శీను, రామచంద్రం, స్వర్గం రాములు నాయకులు కొండి రాజ్యం, పోతుల శంకరయ్య, రుద్రారం బిక్షపతి, శివలింగ నారాయణ, రుద్రారం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతంలో బిగ్ డేటా అనలిటిక్స్ పై కార్యశాల

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 27 :

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఎంటెక్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న రెండు రోజుల 'బిగ్ డేటా అనలిటిక్స్ ఆచరణాత్మక శిక్షణ' మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యశాలను ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ నిర్వహిస్తుండగా, నాగపూర్ ప్రభుత్వ కళాశాలలోని సీఎస్ఈ విభాగం ఆచార్యుడు డాక్టర్ కమలాకాంత్ లక్షణ్ బవాంకులే ప్రధాన వక్తగా పాల్గొంటున్నారు.

హడూప్ ఉపయోగించి డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్ పై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించడం దీని లక్ష్యమన్నారు. ఈ శిక్షణలో భాగంగా, ప్రాథమిక భావనలు, సిస్టమ్ రూపకల్పన, ఆచణాత్మక వ్యాయామాలపై దృష్టి సారిస్తున్నారు. ఇందులో పాల్గొనేవారు బిగ్ డేటా ప్రాసెసింగ్, డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్ డిజైన్ పై సమగ్ర అవగాహన పొందుతారని తెలియజేశారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలి : ఏఐటీయూసీ

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, జనవరి 27 :

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12వ తేదీన చేపట్టనున్న సమ్మెకు సంబంధించి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్‌ను నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ షబ్బీర్ అలీకి అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ, పారిశ్రామిక వివాదాల చట్టం-1947 లోని సెక్షన్ 22, సబ్ సెక్షన్ (1) నిబంధనల ప్రకారం సమ్మె నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. 21 నవంబర్ 2025న జారీ చేసిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల అమలుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేసి, వాటి స్థానంలో గతంలో అమలులో ఉన్న 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల పరిర

క్షణ కోసం ఫిబ్రవరి 12న చేపట్టే సమ్మెను కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- పోటీ చేసే అభ్యర్థులు నూతన బ్యాంక్ అకౌంట్ ను ఓపెన్ చేయాలి
- నూతన బ్యాంక్ అకౌంట్ ద్వారా ఎన్నికల ఖర్చులు చేయాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్ష ప్రతినిధి మెదక్ జనవరి 27:-

మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం తూప్రాన్ పట్టణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ కొరకు మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో, తాహసిల్దార్ ,మున్సిపల్ కమిషనర్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ..మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నూతన బ్యాంక్ అకౌంట్ ను ఓపెన్ చేయాలన్నారు.నూతన బ్యాంక్ అకౌంట్ ద్వారా ఎన్నికల ఖర్చులు చేయాలనీ,జిల్లా లో మున్సిపల్ ఎన్నికల ఓటర్ లిస్ట్ పూర్తి అయిందని,తూప్రాన్ లో 16 వార్డు లకు గాను ,32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ,జిల్లాలో మున్సిపల్ ఎన్నికల కోసం డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్,కౌంటింగ్ సెంటర్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 150 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా కలెక్టర్ కార్యాలయం నుంచి పర్యవేక్షణ చేపడుతున్నట్లు వివరించారు.ఈ మున్సిపల్ ఎన్నికల యొక్క నియమ నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.మున్సిపాలిటీ ఎన్నికలలో కీలకమైన అన్ని అంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు కలిసి 15 0 పోలింగ్ కేంద్రాలు, 75 వార్డులు ఉన్నాయన్నారు.రానున్న మున్సిపల్ ఎన్నికల కోసం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసి యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.నామినేషన్ ప్రక్రియ నుంచి ఎన్నికలు పూర్తి అయ్యే వరకు అప్రమత్తంగా ఉండి ,ఎన్నికల సంఘం నియమాల ప్రకారం ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ జయచంద్ర రెడ్డి, స్థానిక తహసిల్దార్ ,సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ పాటించకుంటే సిబ్బందిని మార్చాలి

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 27:

సిద్దిపేట పట్టణంలోని వేములవాడ కామన్ పక్కన గల ప్రభుత్వ నూతనొన్నత పాఠశాలలో మధ్యాహ్న బోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆహార పదార్థాలు అన్నం, సొరకాయ టమాటా, సాంబారు లను తనికి చేశారు. విద్యార్థులకు సరిపోయేంత అన్నం, కూర, సాంబారు పెట్టాలని వంట సిబ్బందిని ఆదేశించారు. కూరగాయలు దొరకట్లేదని ఇతరత్ర కారణాల వల్ల మెనూలో పాటించకుండా ఇష్టానుసారంగా పెడితే వంట సిబ్బందిని మార్చాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. కడుపునిండా అన్నం కూరలు అన్ని బాగా తినాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు మరల అన్నం, కూరలను వారు కూర్చున్న వద్దకు వెళ్లి వడ్డించాలి వంట సిబ్బందిని ఆదేశించారు. భోజనం చేస్తున్నపుడు విద్యార్థులు లేవకూడదని తెలిపారు.

"

ఆధారాలతో సహా సింగరేణి కుంభకోణాన్ని బట్టబయలు చేశాం. గవర్నర్‌ను కలిసి వినతి పత్రాన్ని ఇచ్చాం. సింగరేణి కుంభకోణాన్ని డైవర్ట్ చేయడానికి విచారణ పేరిట ఒక్కొక్కరిని పిలుస్తున్నారు. ఇవాళ సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు, కోల్ మాఫియాకి నాయకుడిగా ప్రజలు, సింగరేణి కార్మికులు భావించే పరిస్థితి ఉంది. టెండర్లకు సంబంధించి శ్వేతపత్రం రిలీజ్ చేయమంటే సమాధానం లేదు.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రాంతీయం

స్వయం ఉపాధితోనే ఆర్థిక అభివృద్ధి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి
- ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 27 :

ప్రభుత్వాలు ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించలేని పరిస్థితుల్లో స్వయం ఉపాధే బలమైన మార్గమని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సెట్విన్ ద్వారా విస్తృత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.

మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సెట్విన్ శిక్షణ కేంద్రంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కేంద్రంలో ఎంపిక చేసిన రంగాల్లో లబ్ధిదారులకు ఆరు రోజుల పాటు రోజువారీ వేతనంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందించడం, అలాగే వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు కూడా అందించనున్నట్లు తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించలేని పరిస్థితుల్లో స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. పురుషులు, మహిళల అభిరుచులకు అనుగుణంగా కంప్యూటర్ కోర్సులు, ఉమెన్ ఓరియెంటెడ్ కోర్సులు, విద్య, హోటల్ మేనేజ్‌మెంట్, టెక్నికల్, భవన నిర్మాణ రంగాలకు సంబంధించిన అనేక కోర్సులు సెట్విన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.మహిళల ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ తమకు ఇష్టమైన రంగంలో నైపుణ్యం సాధించేందుకు సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. చదువుకున్న వారికి డిప్లమా కోర్సులు, నిరక్షరాస్యులకు ఉపాధి కల్పించేలా ప్రత్యేక శిక్షణకోర్సులు ఉన్నాయని తెలిపారు.సెట్విన్ కేంద్రం పనితీరుపై తరచూ పర్యవేక్షణ చేస్తానని, ఎంతమందికి రుణాలు అందాయో సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల మేధస్సు, ఏకాగ్రత పెంపొందించే కోర్సుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రస్తుతం హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని, యువత ఈ కోర్సుల్లో చేరాలని సూచించారు. భవన నిర్మాణ రంగంలో కార్మికుల కొరత ఉన్నందున ఈ రంగాన్ని యువత ఎంచుకోవాలని తెలిపారు. టెక్నికల్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించేందుకు సెట్విన్ పూర్తిగా సిద్ధంగా ఉందని, కొత్త ఆలోచనలు, ఉత్సాహం ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏ పని చేసినా దానిని దైవంగా భావించి నిబద్ధతతో నేర్చుకుంటే ఆ రంగంలో నైపుణ్యం సాధించి ఉపాధి పొందవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో సెట్విన్ ట్రైనింగ్ అధికారి అమీనా భాను, జిల్లా సెట్విన్ మేనేజర్ శ్రీనివాస్, ఎల్‌డీఎం హరిబాబు, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ దుల్హాన్ సింగ్ బీస్ట్, డీపీఎంయూ శిరీష, స్టేట్ లెవల్ పీఎంయూ సభ్యులు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం పలువురు లబ్ధిదారులకు యూనిట్లు, సర్టిఫికెట్లు అందజేశారు.

బ్యాంకింగ్‌లో ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలి

- 5 డే బ్యాంకింగ్ అమలు చేస్తూ.. ప్రతి శనివారం సెలవు ఇవ్వాలి
- యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ సెక్రటరీ బి శ్రీనివాస్
- సిద్దిపేటలో విధులు బహిష్కరించి సమ్మె చేసిన బ్యాంకు ఉద్యోగులు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 27:

బ్యాంకు ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే వారంలో ప్రతి శనివారం సెలవు ఇవ్వాలని, బ్యాంకులకు వారంలో ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ సిద్దిపేట రీజియన్ రీజినల్ సెక్రటరీ బి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బ్యాంకులకు ఐదు రోజుల పని దినాలు (5 డే బ్యాంకింగ్) అమలు కోసం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ అధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో పలు బ్యాంకుల ఉద్యోగులు విధులు బహిష్కరించి మంగళవారం సమ్మె నిర్వహించారు. ఈ సంధర్భంగా శ్రీనివాస్, క్రాంతికుమార్, మహేష్ మాట్లాడుతూ..బ్యాంకింగ్ రంగ చరిత్రలో మొట్ట మొదటి సారిగా బ్యాంక్ ఉద్యోగ సంఘాలు సింగిల్ ఎజెండాతో 5 డే బ్యాంకింగ్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. యూనియన్లు ఉద్యమానికి దిగడం ఇదే తొలిసారి కావడం ఈ డిమాండ్ ప్రాధాన్యతను స్పష్టంగా చూపుతుందన్నారు. బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ లావాదేవీలు పెరిగిన కాలంలో ఏటీఎం, యుపిఐ, ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవలు 24గంటలు అందుబాటులో ఉన్నాయన్నారు. కానీ బ్యాంకు ఉద్యోగులు మాత్రం ఇంకా అధిక పని ఒత్తిడితో వారానికి ఆరు రోజులు పని చేయాల్సిన పరిస్థితి కొనసాగుతుందన్నారు. కరోనా సమయంలో కూడా సేవలందించామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, పీఎస్‌యులు, ఐటీ, కార్పోరేట్ రంగాల్లో వారంలో ఐదు రోజుల పని అమల్లో ఉండగా బ్యాంకింగ్ రంగంలో మాత్రం ఇది అమలు కాకపోవడం అసమానత్వానికి నిదర్శనమన్నారు. ఐదు రోజుల పని దినాల అమలుతో ఉద్యోగుల వర్క్, లైఫ్ బ్యాలెన్స్ మెరుగుపడి ఆరోగ్యం, ఒత్తిడి లేకుండా వినియోగదారులకు సమర్థవంతమైన బ్యాంకింగ్ సేవలు అందుతాయన్నారు. తక్షణమే బ్యాంకింగ్‌లో వారంలో ఐదు రోజుల వర్క్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బిఐ ఓబిసి అసోసియేషన్ మహేష్, ఆఫీసర్స్ యూనియన్ రీజినల్ సెక్రటరీ రమేష్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, డిస్టిక్ కోఆపరేటివ్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లకు చెందిన సుమారు 200మంది సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలు పగడ్బందిగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 27 :

మంగళవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే రిటర్నింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు అందరి సహకారంతో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. అదే విధంగా చేర్యాల, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ మున్సిపాలిటీలలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను కూడా పగడ్బందిగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియ, పోలింగ్ బూత్ ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు విధానాలపై మాస్టర్ ట్రైనర్ అందించే శిక్షణను క్లుప్తంగా అవగాహన చేసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన ఎలక్షన్ కరదీపికలోని మార్గదర్శకాలను అనుసరించి మాత్రమే ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు.ప్రతి రిటర్నింగ్ అధికారి ఎలక్షన్ కరదీపికను ఒక భగవద్గీతలా భావించి అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలక్టోరల్ రోల్ అత్యంత కీలకమైన అంశమని పేర్కొంటూ, ఏ చిన్న పొరపాటు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.మంచి శిక్షణ పొందుతూ నిబద్ధతతో పని చేసి, మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించాల్సిందిగా రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్, దుబ్బాక మున్సిపల్ కమిషనర్లు మల్లికార్జున్, రమేష్, మాస్టర్ ట్రైనర్ అయోధ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు అందుకున్న కౌన్సిలర్ దీప్తి నాగరాజు

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 27:

స్వచ్ఛ బడి నిర్వహణతో నినాదంతో 39వ వార్డును ఆదర్శంగా నిలిపిన కౌన్సిలర్ దీప్తి నాగరాజు ఉత్తమ అవార్డు అందుకున్నారు.గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి చేతుల మీదుగా ప్రశంసా పత్రం పొందారు. సిద్దిపేట పట్టణంలోని మాతా శిశు రక్షణ కేంద్రం ఆవరణలో స్వచ్ఛ బడిని నిర్వహిస్తున్న దీప్తి నాగరాజు వ్యర్థాల ద్వారా సేంద్రీయ ఎరువు తయారు చేస్తూ ఆదర్శంగా నిలిచారు. వీటి కృషిని గుర్తించిన ప్రభుత్వం రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. సిద్ధిపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ హైమావతి దీప్తి నాగరాజు ప్రశంసా పాత్ర అందించి సన్మానించారు. ఈ సందర్భంగా దీప్తి నాగరాజు మాట్లాడుతూ ఈ అవార్డుతో తమ బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇండ్లకు మోక్షం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 27:

సిద్దిపేట మున్సిపాలిటీ నర్సాపూర్ 2వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.
జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి కి, సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, మొదటి విడతలో పేరు రాని అర్హులైన లబ్ధిదారులకు రెండవ విడతలో తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు.పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అనేక ప్రజా సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రటరీ ఎర్రబోలు రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు బండారి కనకరాజు, మోత్కూరి శ్రీనివాస్, మోత్కూరు కనకయ్య, యాదగిరి మల్లేశం, రవి, బాను శంకర్, వార్డు నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉగాది బాలల కథల పోటీ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 27:

తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదిన సందర్భంగా బాలల్లో సాహిత్య అభిరుచి పెంపొందించి, తద్వారా వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశ్యం తో సిద్దిపేట జిల్లా లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థులనుండి కథలను ఆహ్వానిస్తున్నామని సుగుణ సాహితి సమితి కన్వీనర్ భైతి దుర్గయ్య అన్నారు. పోటీల ప్రకటన ను మంగళవారం ప్రెస్ క్లబ్ లో ప్రముఖ బాల సాహితీ వేత్త గరిపెల్లి అశోక్ విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో బాల సాహిత్య రచయితలు పెందోట వెంకటేశ్వర్లు,అనిశెట్టి సతీష్, సాహిత్యాభిమానులు శేషు,అశోక్ లు పాల్గొన్నారు..ప్రథమ బహుమతి 1500 రూపాయలు, రెండు ద్వితీయ బహుమతులు 1000రూపాయలు చొప్పున, మూడు తృతీయ బహుమతులు500 రూపాయలు చొప్పున మరియు 300 రూపాయలు చొప్పున 16 ప్రత్యేక బహుమతులను ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మర్పడగ చెన్నకృష్ణారెడ్డి అందిస్తున్నారు.హామీ పత్రంతో పాటు విద్యార్థులు తాము వ్రాసిన కథలను "కన్వీనర్, ఉగాది కథల పోటీ,ప్రతిభ డిగ్రీ కళాశాల, మెదక్ రోడ్ సిద్దిపేట502103 చిరునామా కు 2026 ఫిబ్రవరి,20వ తేదీలోగా స్వయంగా,రిజిస్టర్ పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపగలరు.పూర్తి వివరాలకు 9959007914 సెల్ నంబర్ లో సంప్రదించవచ్చునని తెలిపారు.

రైతులకు ఆర్థికంగా దన్నుగా నిలవాలి..

- కోదండరాం

ప్రతిపక్షం బ్యూరో, హైదరాబాద్

అన్నదాతలను ఆర్థికంగా బలంగా నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని, చిన్న, సన్నకారు, మహిళా రైతులను దృష్టిలో పెట్టుకునే వ్యవసాయరంగంలో భవిష్యత్ ప్రణాళికలు రూపొందించాలని ఆచార్య కోదండరాం సూచించారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్, సుస్థిర వ్యవసాయ కేంద్రం, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీల ఆధ్వర్యంలో 'తెలంగాణ వ్యవసాయరంగం... భవిష్యత్ ప్రణాళిక'పై మంగళవారం హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ... "వరి, పత్తితోపాటు అన్ని పంటలకూ మద్దతు ధర కల్పించాలి. అన్నదాతలకు ఆర్థికంగా అండగా నిలవాలి" అని సూచించారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ... "ఎరువులు, విత్తనాలు కల్తీమయం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. విత్తనం ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లింది" అని ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యాన వర్సిటీ వైస్‌ఛాన్సలర్ రాజిరెడ్డి మాట్లాడుతూ... ఉద్యాన పంటలే రైతులకు లాభదాయకమన్నారు. నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ... రైతుల అభ్యున్నతికి నాబార్డు అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలను సాఫీగా నిర్వహించాలి

- కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం దిశా నిర్దేశం

ప్రతిపక్షం బ్యూరో

నిజామాబాద్, జనవరి 27 : ఎలాంటి అవాంతరాలు, లోటుపాట్లకు తావులేకుండా మున్సిపల్ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, సాఫీగా జరిపించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీ.జీ.పీ శివధర్ రెడ్డిలతో కలిసి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు. జిల్లాలో నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలు ఉన్నాయని, మొత్తం 146 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఎన్నికల షెడ్యూల్ ను అనుసరిస్తూ బుధవారం నుండి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు వీలుగా ఆయా మున్సిపాలిటీల పరిధిలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నిజామాబాద్ నగరం, బోధన్ పట్టణాలలో ఎన్నికల భద్రత విషయంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపిస్తామని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా, అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల నియమావళిని తు.చ తప్పక పాటించాలని, మున్సిపల్ పట్టణ పరిధిలో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, ఫోటోలు, ఇతర ప్రచార సామాగ్రిని తొలగించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశించారు.
నామినేషన్ సెంటర్లలోని అన్ని గదులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అలాగే నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, కామారెడ్డి ఇంచార్జి అదనపు కలెక్టర్ మధుమోహన్, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, కిరణ్మయి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడానికి ప్రాంతీయ ఆసుపత్రుల్లో 13 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీలను నెలకొల్పుతున్నాం. వీటిలో 134 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ఆసుపత్రులకు వచ్చే రోగులతో పాటు పీహెచ్సీ, ఇతర ఆసుపత్రుల రోగులనూ ఇక్కడికి రిఫర్ చేస్తారు. వ్యాధులకు కారణాన్ని గుర్తించి ఇతర శాఖలతో సమన్వయానికీ ఇవి ఉపకరిస్తాయి. వీటికోసం ₹16.25 CRను వెచ్చిస్తున్నాం.

- ఏపీ మంత్రి సత్యకుమార్

ఆల్‌టైమ్ కనిష్ఠానికి ఇరాన్ కరెన్సీ

ఒకవైపు ఆందోళనలు, మరోవైపు ఆర్థికపరమైన ఆంక్షలతో ఇరాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ పరిణామాల నడుమ దేశ కరెన్సీ మళ్లీ పతనమైంది. డాలర్ విలువతో పోలిస్తే చరిత్రలోనే అత్యల్ప స్థాయి 15 లక్షల రియాల్స్‌కు పడిపోయింది.అణ్వస్త్ర కార్యక్రమాల కారణంగా అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొన్నేళ్లుగా పతనావస్థలో ఉంది. 2015లో అమెరికా (USA) ఇరాన్ అణు ఒప్పందం చేసుకునే నాటికి ఒక డాలర్‌కు 32వేల రియాల్స్ ఉండేవి. కొంతకాలంగా పతనమవుతూ వస్తున్న దీని విలువ.. ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం మరింత క్షీణిస్తోంది. కరెన్సీ పతనం, ఆర్థిక సంక్షోభం వంటి కారణాలతోనే ఇటీవల ఇరాన్ పౌరులు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. అయితే, ఆందోళనకారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది.భద్రతాబలగాల కాల్పుల్లో 6,126 మందికిపైగా మృతి చెందినట్లు అమెరికా కేంద్రంగా పనిచేసే హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.రియాల్ కుదేలుతో ఇరాన్ ప్రజల రోజువారీ జీవనం అస్తవ్యస్తమవుతోంది. నిత్యవసరాలు, మందులు, దిగుమతి వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. పెరుగుతున్న ఖర్చులను భరించేందుకు చాలా మందికి ప్రభుత్వం నెలకు ఏడు డాలర్ల మేర సాయం అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. తరచూ నిరసనలు, అవినీతి, అసమర్థ నిర్వహణ వంటివి దేశ ఆర్థిక వ్యవస్థను మరింత దెబ్బతీస్తున్నాయి.

విశ్వ వీక్షణం

పడిపోయిన పాక్ సైన్యం ర్యాంక్..

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితి, సంఘర్షణల మధ్య, గ్లోబల్ ఫైర్‌పవర్ 2026 సంవత్సరానికి తన మిలిటరీ స్ట్రెంత్ ర్యాంకులను విడుదల చేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా 145 దేశాల సైనిక బలానికి వార్షిక ర్యాంకింగ్. ఈ ర్యాంకింగ్స్‌లో ప్రతి దేశం పవర్ ఇండెక్స్ స్కోర్‌కు దోహదపడే 60 కంటే ఎక్కువ అంశాలు ఉన్నాయి. ఒక దేశం బలాన్ని దాని పవర్ ఇండెక్స్ స్కోర్ ఆధారంగా అంచనా వేస్తారు. గ్లోబల్ ఫైర్‌పవర్ ప్రకారం.. ఒక ఖచ్చితమైన PwrIndx స్కోరు 0.0000, ఇది ప్రస్తుత GFP ఫార్ములాలో సాధించలేము; కాబట్టి, PwrIndx విలువ తక్కువగా ఉంటే, దేశం సాంప్రదాయ యుద్ధ సామర్థ్యాలు అంత శక్తివంతంగా ఉంటాయి. ఈ ర్యాంకింగ్‌లో భారతదేశం నాల్గవ స్థానంలో కొనసాగుతోంది. భారతదేశం భారీ సైన్యం, క్షిపణి వ్యవస్థలు, S400 రక్షణ వ్యవస్థ, రాఫెల్ వంటి యుద్ధ విమానాలను కలిగి ఉంది. సైనిక శక్తి జాబితాలో అమెరికా అగ్రస్థానంలో ఉంది, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యం, వైమానిక దళం, నావికాదళం కలిగి ఉంది. రష్యా, చైనా వరుసగా 0.0791, 0.0919 స్కోర్‌లతో రెండవ స్థానంలో ఉన్నాయి.ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ కు లొంగిపోయిన పాకిస్తాన్ సైనిక బల ర్యాంకింగ్స్‌లో తగ్గుదలకు గురైంది. గత సంవత్సరం పాకిస్తాన్ 12వ స్థానంలో ఉండగా, ఈ సంవత్సరం అది 14వ స్థానానికి పడిపోయింది. పాకిస్తాన్ ర్యాంకింగ్ తగ్గుతూనే ఉంది. 2024లో పాకిస్తాన్ తొమ్మిదవ స్థానంలో ఉంది, కానీ 2025లో 12వ స్థానానికి పడిపోయింది. ఇప్పుడు, 2026లో, అది 0.2626 PwrIndx స్కోరుతో 14వ స్థానానికి పడిపోయింది.ఈ సంవత్సరం ర్యాంకింగ్స్‌లో ఫ్రాన్స్ ఆరో స్థానానికి ఎగబాకింది, 2025లో ఏడవ స్థానంలో, 2024లో 11వ స్థానంలో నిలిచిన తర్వాత దాని పెరుగుదలను కొనసాగించింది. 2026లో జపాన్ కూడా ఒక స్థానం ఎగబాకి ఏడవ స్థానానికి చేరుకుంది. ఈ ర్యాంకింగ్‌లో ఇటలీ 0.2211 PwrIndx స్కోరుతో 10వ స్థానాన్ని నిలుపుకుంది, తద్వారా టాప్ టెన్‌లో చోటు దక్కించుకుంది. ఈ ర్యాంకింగ్‌లో జర్మనీ అత్యంత అద్భుతమైన పురోగతిని సాధించింది, 2024లో 19వ స్థానం నుండి 2026లో 12వ స్థానానికి చేరుకుంది.

ట్రంప్ నిర్ణయాలకు అమెరికన్ల అసంతృప్తి

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు ఈ అంశంలో ట్రంప్ నిర్ణయాలకు ప్రజల మద్దతు భారీగా తగ్గింది. రాయిటర్స్‌ఇప్సాస్ నిర్వహించిన పోల్‌లో ఈ విషయం వెల్లడైంది. వలసలపై ఆయన తీసుకుంటున్న కఠినచర్యలు చాలాదూరం వెళ్లాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వలసదారుల్ని అడ్డుకోవడానికి అమెరికా)లోని పలు ప్రాంతాల్లో ట్రంప్ యంత్రాంగం ఇమిగ్రేషన్ ఏజెంట్లను మోహరించింది. దీనికి నిరసనగా జరిగిన ఘర్షణల్లో ఆ ఏజెంట్ల చేతిలో శనివారం మినియాపొలిస్‌లో మరో అమెరికా పౌరుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు ముందు, తర్వాత అంటే శుక్రవారం నుంచి ఆదివారం మధ్య ఈ పోల్ చేపట్టగా.. ట్రంప్ నిర్ణయాలను ఆమోదించేవారి సంఖ్య తగ్గిపోయింది. తాజాగా 39 శాతం మంది ఆమోదించగా.. అంతకుముందు ఆ రేటు 41 శాతంగా ఉంది. 53 శాతం మంది ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసలకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేశారు. ఈ విషయంలో తొలుత ఆయనకు ప్రజల నుంచి భారీ ఆమోదం లభించింది. గత ఫిబ్రవరిలో 50 శాతం మంది ఆయన విధానాలకు అనుకూలంగా స్పందించడం గమనార్హం.



బడ్జెట్ సెషన్‌కు రంగం సిద్ధం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. పార్లమెంట్ సమావేశాలను పురస్కరించుకొని ప్రభుత్వం మంగళవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసింది.ఈ సందర్భంగా వివిధ విపక్షాలకు చెందిన నేతలు మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం పునరుద్ధరణ, ఓటర్ల జాబితాను సవరించేందుకు చేపట్టిన 'సర్' ప్రక్రియ, భారత విదేశాంగ విధానం, వివాదాస్పదమైన యూజీసీ కొత్త మార్గదర్శకాలపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను, సర్‌పై విస్తృత చర్చను ప్రభుత్వం తోసిపుచ్చింది.

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ బడి



- చిన్నగుండవెళ్ళిలో మారిన ప్రభుత్వ పాఠశాల ముఖచిత్రం
- వాల్ పెయింట్స్‌తో వెలిగిపోతున్న బడి
- నమ్మకం పెంచుకుంటున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
- చదువుకు రంగులద్దిన చిన్నగుండవెళ్ళి బడి

చదువు నేడు ఒక వ్యాపారంగా మారుతున్న కాలమిది. పేదలకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాయి. అయినా వాటిపై సమాజంలో ఇంకా చిన్నచూపే కనిపిస్తోంది. దీనికి కారణం రోజురోజుకూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలే. ఈ స్థితిలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తాం. అని చెబితే సరిపోదు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి ఫలితాలను రాబడితేనే పాఠశాల పట్ల నమ్మకం పెరుగుతుంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయడం చేసి ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగ్గా, కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా తీర్చిదిద్దారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా తీర్చిదిద్దబడి, ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న అభిప్రాయాన్ని మార్చుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సిద్దిపేట జిల్లా సిద్దిపేట గ్రామీణ మండలంలోని చిన్న గుండవెల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధాపద్మజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమిష్టి కృషి తల్లిదండ్రుల నమ్మకాన్ని చూరగొన్నది.

ఆకర్షించే రంగు రంగుల చిత్రాలు

ఈ పాఠశాలలోకి అడుగు పెట్టగానే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. ప్రతి తరగతి గదిలో గోడలపై వేసిన రంగురంగుల చిత్రాలు, విద్యకు సంబంధించిన బొమ్మలు విద్యార్థులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. విద్యార్థుల మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు ఎలాంటి ఒత్తిడి లేకుండా చదువుకునేలా అందుబాటులో ఉన్న నిధులతో పాటు, దాతలు అందించిన సహకారంతో అన్ని వసతులు కల్పించారు. విద్యార్థులకు చదివిన దాని కంటే చూసినది ఎక్కువ కాలం గుర్తుండి పోతుందని మానసిక శాస్త్రవేత్తల పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని గోడలపై గుణింతాలు, ఇంగ్లీష్ పదాలు, గణితం, సైన్స్‌కు సంబంధించిన రంగు రంగులతో బొమ్మలు, చిత్రాలను వేయించారు. వీటి వల్ల తరగతి గదిలో కూర్చున్నామనే భావన కంటే, ఏదో అద్భుత ప్రపంచంలో ఉన్నామనే అనుభూతి విద్యార్థులకు కలుగుతోంది. దీంతో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఇరుకైన గదులు, సరైన ఆట స్థలాలు లేకపోయినా తల్లిదండ్రులు వాటి వైపే మొగ్గు చూపుతున్న పరిస్థితిని అధిగమించేందుకు, ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా తీర్చిదిద్దారు.

పెరిగిన విద్యార్థుల నమోదు

ఈ మార్పులను గమనించిన గ్రామంలోని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం పెంచుకుని తమ పిల్లలను ఇక్కడ చేర్పిస్తున్నారు. గత సంవత్సరం వరకు ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 72 మాత్రమే. ఈ విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి నుంచి ఆరవ తరగతికి సుమారు 17 మంది వెళ్లారు. కొత్తగా కలిపి 63 మంది పిల్లలను వారి తల్లిదండ్రులు వివిధ తరగతుల్లో చేర్పించారు. దీంతో విద్యార్థుల సంఖ్య ఈ విద్యా సంవత్సరంలో 118కి పెరగడంతో ఈ పాఠశాల ఉత్తమ బోధనకు నిదర్శనంగా నిలుస్తోంది. దీనికి తోడు విద్యార్థులకు ఆడుతూ, పాడుతూ పాఠాలు నేర్పిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతోంది. అందుకే పిల్లలు ఇష్టపడి పాఠశాలకు వస్తున్నారు. ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ ఒక పెద్ద సమస్యగా మారింది. చిన్న వయసులోనే విద్యార్థులు సెల్‌ఫోన్‌కు అలవాటు పడడంతో జ్ఞాపకశక్తి తగ్గుతోంది. సెల్ ఫోన్ వ్యాసంగా మారి దానికి పిల్లలు బానిసలుగా మారుతున్నారు. ఈ సమస్యపై అవగాహన కల్పించేందుకు గోడలపై సెల్‌ఫోన్ వల్ల కలిగే నష్టాలను చిత్రాల రూపంలో స్పష్టంగా తెలిపారు. ఎటు చూసినా చదువుకు సంబంధించిన బొమ్మలు, పదాలు, చిత్రాలు కనిపించడం వల్ల విద్యార్థుల జ్ఞాపకశక్తి మరింత పెరుగుతోంది,

ఆహ్లాదకర వాతావరణంలో అభ్యసనం

- రాధా పద్మజ, ప్రధానోపాధ్యాయులు

ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువును అభ్యసించేందుకు వాల్ పెయింటింగ్స్ ఉపయోగపడుతున్నాయని ప్రధానోపాధ్యాయురాలు రాధాపద్మజ తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పాఠశాలను అభివృద్ధి చేయడం వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తే ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న అభిప్రాయం మారుతున్న దానికి తమ పాఠశాల ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు.

- కత్తుల లక్ష్మారెడ్డి, సిద్ధన్నపేట



బీసీసీఐకి కొత్త చీఫ్ సెలెక్టర్ రేసులో మాజీ పేసర్!

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న అజిత్ అగర్కర్ కాంట్రాక్ట్‌ను బీసీసీఐ పొడిగించే అవకాశం లేదని తెలుస్తోంది. అజిత్ అగర్కర్ సేవలపై బీసీసీఐ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ భారత పేసర్ ఆర్‌పీ సింగ్ తదుపరి బీసీసీఐ చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని ఓ స్పోర్ట్స్ ఛానెల్ తమ కథనంలో పేర్కొంది.అజిత్ అగర్కర్ నాయకత్వంలోని సెలెక్షన్ కమిటీ కాలపరిమితి ముగింపు దశకు చేరుకోవడంతో.. కొత్త చీఫ్ సెలెక్టర్ ఎంపికపై బీసీసీఐ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో భారత జట్టుకు గతంలో కీలక విజయాలు అందించిన ఆర్‌పీ సింగ్ పేరు ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. క్రికెట్‌పై లోతైన అవగాహనతో పాటు యువ ఆటగాళ్లను గుర్తించే సామర్థ్యం ఆర్‌పీ సింగ్‌కు ఉందన్న అభిప్రాయం బలంగా ఉంది. భారత జట్టుకు 2007 టీ20 వరల్డ్‌కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆర్‌పీ సింగ్.. 2018లో రిటైర్మెంట్ ఇచ్చాడు. రిటైర్మెంట్ తర్వాత విశ్లేషకుడిగా, వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ.. ఆటపై తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నాడు.ఆర్‌పీ సింగ్‌కు చీఫ్ సెలెక్టర్ బాధ్యతలు అప్పగిస్తే భారత క్రికెట్‌కు కొత్త దిశ చూపించే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ విషయంలో బీసీసీఐ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అజిత్ అగర్కర్ కాంట్రాక్ట్‌పై తుది నిర్ణయం, కొత్త సెలెక్షన్ కమిటీ నియామకంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశముంది. ఆర్‌పీ సింగ్ చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపడతాడా అనే ఉత్కంఠ ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో నెలకొంది. ఆర్‌పీ సింగ్ భారత్ తరఫున 14 టెస్టులు, 58 వన్డేలు, 10 టీ20లు ఆడాడు. 2007 నుంచి 2011 వరకు టీమిండియాకు ఆర్‌పీ సింగ్ ఆడాడు.

యువ భారత్ భారీ విజయం..

అండర్ 19 వన్డే ప్రపంచకప్‌లో ఓటమన్నదే లేకుండా ఆడుతున్న యువ భారత జట్టు జోరు కొనసాగించింది. సూపర్ సిక్స్ గ్రూప్ 2లో భాగంగా మంగళవారం బులవాయోలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో భారత అండర్ 19 జట్టు ఏకంగా 204 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తుచేసింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. 50 ఓవర్లలో 352/8 పరుగుల భారీ స్కోరు చేసింది.మిడిలార్డర్ బ్యాటర్ విహాన్ మల్హోత్ర (107 బంతుల్లో 109 నాటౌట్, 7 ఫోర్లు) స్ఫూర్తిదాయక శతకంతో ఆకట్టుకోగా అభిగ్యాన్ (61), వైభవ్ సూర్యవంశీ (52) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఛేదనలో జింబాబ్వే 37.4 ఓవర్లలో 148 రన్స్‌కే చేతులెత్తేసింది. లిరాయ్ చివాల (62), బ్లిగ్నట్ (37) ఆ జట్టును ఆదుకున్నారు. సూపర్ సిక్స్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. తమ తదుపరి మ్యాచ్‌ను ఫిబ్రవరి 1న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో ఆడుతుంది.
మొదట బ్యాటింగ్ చేస్తూ సూర్యవంశీ దూకుడుతో పది ఓవర్లకే వంద పరుగుల మార్కును దాటిన భారత్.. ఆ తర్వాత తడబడి 16 ఓవర్లలో 130/4తో నిలిచింది. ఈ క్రమంలో విహాన్, అభిగ్యాన్ ఐదో వికెట్‌కు 113 రన్స్ జతచేసి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. ఆఖర్లో అభిగ్యాన్ నిష్క్రమించినా ఖిలాన్ పటేల్ (12 బంతుల్లో 30*, 1 ఫోర్, 3 సిక్సులు) ధనాధన్ ఆటతో భారత్ భారీ స్కోరు సాధించింది. ఇక స్కోరుబోర్డుపై ఒక్క పరుగూ చేరకుండానే వికెట్ల ఖాతా తెరిచిన జింబాబ్వే.. 33 ఓవర్లలో 141/4తో కాస్త మెరుగ్గానే కనిపించింది. కానీ 7 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 6 వికెట్లను కోల్పోయింది. భారత బౌలర్లలో కెప్టెన్ అయూశ్ మాత్రె (3/14), ఉద్ధవ్ మోహన్ (3/20) జింబాబ్వే లోయరార్డర్ పనిపట్టారు.భారత్: 50 ఓవర్లకు 352/8 (విహాన్ 109*, అభిగ్యాన్ 61, చిముగొరొ 3/49, సింబరషె 2/51);జింబాబ్వే: 37.4 ఓవర్లలో 148 ఆలౌట్ (లిరొయ్ 62, బ్లిగ్నట్ 37, మాత్రె 3/14, ఉద్ధవ్ 3/20)

ప్లేఆఫ్స్‌లోకి గుజరాత్

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో మరో పోరు అభిమానులను అలరించింది. చివరి బంతి వరకు ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెడుతూ సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గుజరాత్ జెయింట్స్‌దే పైచేయి అయ్యింది. మంగళవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ 3 పరుగుల తేడాతో ఢిల్లీపై అద్భుత విజయం సాధించింది. తద్వారా ప్లేఆఫ్స్‌లోకి ప్రవేశించింది. మరోవైపు గెలిస్తే గానీ నిలువలేని పరిస్థితుల్లో ఢిల్లీ.. మరోమారు గుజరాత్‌కు తలవంచింది. 175 పరుగుల లక్ష్యఛేదన కోసం బరిలోకి దిగిన ఢిల్లీ 8 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది.ఆఖరి ఓవర్‌లో విజయానికి 9 పరుగులు అవసరమైన దశలో బౌలింగ్‌కు దిగిన సోఫీ డివైన్(4/37)..అద్భుతం చేసింది. చివరి మూడు బంతుల్లో అప్పటికే క్రీజులో కుదురుకుని జోరుమీదున్న స్నేహ్‌రానా(29)తో పాటు నిక్కిప్రసాద్(47)ను ఔట్ చేసి గుజరాత్‌ను గెలుపు సంబురాల్లో నిలిపింది. రాజేశ్వరి గైక్వాడ్ (3/20) ఆకట్టుకుంది. తొలుత బేత్ మూనీ (58), అనుశ్కశర్మ(39) రాణించడంతో గుజరాత్ 20 ఓవర్లలో 174/9 స్కోరు చేసింది. శ్రీచరణి (4/31) నాలుగు వికెట్లు తీసింది.

నేడు భారత్, కివీస్ నాలుగో టీ20

స్వదేశం వేదికగా జరుగనున్న టీ20 ప్రపంచకప్ టోర్నీకి ముందు భారత్ దుమ్మురేపుతున్నది. న్యూజిలాండ్‌పై ఇప్పటికే టీ20 సిరీస్‌ను ఖాతాలో వేసుకున్న టీమ్‌ఇండియా తాజాగా క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. బుధవారం ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్‌కు సాగరతీర నగరం విశాఖపట్నం వేదిక కానుంది. పరుగుల వరద పారుతున్న సిరీస్‌లో భారత్‌కు కివీస్ దీటైన పోటీనివ్వలేకపోతున్నది. టీమ్‌ఇండియా టాపార్డర్ సూపర్ ఫామ్ మీద ఉంది.ముఖ్యంగా గత మ్యాచ్‌లో యువ బ్యాటర్ అభిషేక్‌శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగగా, కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్ ఫామ్‌లోకి రావడం జట్టు విజయ అవకాశాలను మెరుగుపర్చుకుంది. వీరికి తోడు ఇషాన్ కిషన్ వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ దుమ్ముదులుపుతుండగా, సంజూ శాంసన్ ఫామ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురిచేస్తున్నది. బౌలింగ్‌లో బుమ్రా రిథమ్‌లోకి రాగా, హర్షిత్ రానా, అర్షదీప్‌సింగ్ నిలకడకనబరుస్తున్నారు. స్పిన్నర్లు రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్‌యాదవ్..వైజాగ్ టీ20 పోరులో కీలకం కానున్నారు. మరోవైపు మిగిలిన రెండింటిలోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలని కివీస్ చూస్తున్నది.

ఓటీటీలోకి అన్నగారు

సాధారణంగా చాలా సినిమాలు.. థియేటర్స్ లో రిలీజ్ అయిన కొన్ని రోజులకు ఓటీటీలోకి వస్తాయన్న విషయం తెలిసిందే. ఇంకా కొన్ని చిత్రాలు.. కేవలం ఓటీటీలోనే విడుదల అవుతుంటాయి. కానీ ఇప్పుడు ఓ మూవీ.. థియేటర్ లోకి వచ్చేందుకు రెడీ అయినా కొన్ని కారణాల వల్ల ప్రేక్షకుల ముందుకు రాలేదు. ఇప్పుడు నేరుగా ఓటీటీలోకి వస్తుంది. మరికొన్ని గంటల్లో స్ట్రీమింగ్ అవ్వనుంది.అదేం సినిమా అంటే.. అన్నగారు వస్తారు (వా వాతియార్). కోలీవుడ్ స్టార్ హీరో కార్తి, ఉప్పెన కృతి శెట్టి లీడ్ రోల్స్ లో మాస్ ఎంటర్టైనర్ గా రూపొందిన ఆ సినిమా.. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కింది. నలన్ స్వామి దర్శకత్వంలో తెరకెక్కిన ఆ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఎప్పుడో రిలీజ్ కావాల్సిన సినిమా.. అనేక కారణాల వల్ల లేట్ అవుతూ వచ్చింది.
ముఖ్యంగా ఫైనాన్షియల్ సమస్యల కారణంగా సినిమా వాయిదాల మీద వాయిదాలు పడుతూ.. జనవరి 14 న రిలీజ్ అయింది. అది కూడా తమిళ భాషలో మాత్రమే. తెలుగులో కూడా విడుదల అవుతుందని అనుకుంటే.. సంక్రాంతి పోటీ ఎక్కువగా ఉండడం వల్ల తప్పుకున్నట్లు తెలుస్తోంది. అయితే తమిళంలో రిలీజ్ అయ్యాక.. తెలుగులో కూడా సినిమా సందడి చేయనుందని అంతా అంచనా వేశారు. కానీ తమిళంలో సినిమా డిజాస్టర్ గా నిలిచింది. దీంతో తెలుగులో రిలీజ్ చేయడం ఎందుకు అనుకున్నారో ఏమో కానీ మేకర్స్ ఏకంగా ఓటీటీ బాట పట్టారు. తమిళంలో రిలీజ్ అయ్యి రెండు వారాలు కూడా కాకముందే అన్న గారు మూవీ.. ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేస్తోంది. అయితే రిలీజ్ కు ముందే.. వా వాతియార్ ఓటీటీ రైట్స్ ను ప్రముఖ డిజిటల్ ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైమ్ సొంతం చేసుకుంది.ఇప్పుడు జనవరి 28వ తేదీ నుంచి సినిమా అమెజాన్ లో స్ట్రీమింగ్ కానుంది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో కూడా స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు అమెజాన్ ప్రైమ్ సోషల్ మీడియాలో వెల్లడించింది. దీంతో ఆ విషయం వైరల్ గా మారింది. ఏదేమైనా అన్నగారు.. తెలుగులో రాకుండానే ఓటీటీలోకి వచ్చేస్తున్నారంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే థియేటర్ రిలీజ్ టైమ్ లో తమిళంలో ఎలాంటి పోటీ లేకపోయినా.. వా వాతియార్ మూవీ ఎలాంటి ప్రభావం చూపించలేకపోయింది. పండుగ సెలవులు అయినా కూడా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో విఫలమైంది. ఇప్పుడు తక్కువ టైమ్ లోనే ఓటీటీలోకి అందుబాటులోకి వస్తుంది. మరి థియేటర్ లో ఆశించిన ఫలితాన్ని అందుకోని అన్నగారు.. ఓటీటీలో ఇప్పుడు ఎలాంటి రిజల్ట్ అందుకుంటారో వేచి చూడాలి.

రిటైర్మెంట్ ప్రకటించిన సింగర్ అర్జిత్ సింగ్..

బాలీవుడ్ ప్రముఖ గాయకుడు అర్జిత్ సింగ్ ప్లేబ్యాక్ సింగింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ప్లేబ్యాక్ సింగర్‌గా ఇకపై కొత్త ప్రాజెక్టులు అంగీకరించనని వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. శ్రోతలుగా ఇంతకాలం తనపై ప్రేమ, అభిమానం చూపిన వారందరికీ థాంక్స్ చెప్పారు. ఇప్పటి వరకూ తన ప్రయాణం అద్భుతంగా సాగిందన్నారు. తన రిటైర్‌మెంట్‌కు గల కారణాన్ని వెల్లడించలేదు. సినిమాలకు గుడ్‌బై చెప్పిన అర్జిత్ ఇండిపెండెంట్ సింగర్‌గా కొనసాగుతారని సమాచారం.పశ్చిమ బెంగాల్‌కు చెందిన అర్జిత్ ఓ రియాలిటీ షో ద్వారా గాయకుడిగా 2005లో ప్రయాణం మొదలుపెట్టారు. 2011లో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. తొలిసారి 'మర్డర్ 2'లోని 'ఫిర్ మొహబ్బత్' పాట పాడారు. 'ఆషికీ 2'లోని 'తుమ్ హీ హో'తో శ్రోతలను విశేషంగా అలరించారు. ఈ పాటకుగానూ బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్‌గా ఫిల్మ్‌ఫేర్ అవార్డునూ అందుకున్నారు. 'పద్మావత్'లోని 'బింతే దిల్', 'బ్రహ్మాస్త్ర 1'లోని 'కేసరియా' పాటలకుగానూ బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్‌గా జాతీయ అవార్డులు దక్కాయి.టాలీవుడ్‌లోనూ అర్జిత్ తనదైన ముద్ర వేశారు. కనులను తాకే ఓ కల (మనం), అదేంటి ఒక్కసారి (స్వామి రారా), మాయా (నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా) తదితర పాటలు ఆయన పాడినవే. బెంగాలీ, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ, గుజరాతీ, అస్సామీ, పంజాబీలోనూ అర్జిత్ అదరగొట్టారు. సినీ రంగానికి గాయకుడిగా ఆయన చేసిన కృషికిగానూ కేంద్ర ప్రభుత్వం గతేడాది పద్మశ్రీ అవార్డు అందించింది.

డబ్బింగ్‌లో బిజీగా పవన్

సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం కీలకమైన పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. శుభ ముహూర్తంలో డబ్బింగ్ పనులు ప్రారంభమయ్యాయి. తన శక్తివంతమైన రచన, మాస్ మెచ్చే సంభాషణలకు పేరుగాంచిన హరీష్‌శంకర్ ను అభిమానులు ముద్దుగా 'కల్ట్ కెప్టెన్' అని పిలుస్తారు. ఆ పేరుకి తగ్గట్టుగానే 'ఉస్తాద్ భగత్ సింగ్'ను కల్ట్ చిత్రంగా మలచడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను దర్శకుడు హరీష్ శంకర్ వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ త్వరలో డబ్బింగ్ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఇది అభిమానులలో, సినీ ప్రేమికులలో మరింత ఉత్సాహాన్ని పెంచుతుంది.'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి ఎక్కడా రాజీ పడకుండా ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' గీతం శ్రోతలను ఉర్రూతలూగించింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం యొక్క నిర్మాణాంతర కార్యక్రమాలు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్లను త్వరలోనే నిర్మాతలు వెల్లడించనున్నారు.

నీలి రంగు గౌనులో ఈషా గ్లామర్ హీట్..

బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ ఈషా గుప్తా మరోసారి ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. పారిస్ వేదికగా జరిగిన ఓ ప్రముఖ ఫ్యాషన్ ఈవెంట్ లో ఆమె ధరించిన దుస్తులు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్ గా మారాయి. లేత నీలం రంగు ఆఫ్ షోల్డర్ గౌనులో ఈషా గుప్తా అచ్చం దేవకన్యలా మెరిసిపోతోంది. డీప్ నెక్ లైన్ తో డిజైన్ చేసిన ఈ గౌనులో ఆమె తన గ్లామర్ తో స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. ముఖ్యంగా ఆ డ్రెస్ కింది భాగంలో ఉన్న వెండి రంగు ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె లుక్ కు రాయల్ టచ్ ఇచ్చింది.ఈ లుక్ లో ఈషా మేకప్, హెయిర్ స్టైల్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పాతకాలపు హాలీవుడ్ హీరోయిన్ల తరహాలో షార్ట్ వేవీ హెయిర్ స్టైల్ తో ఆమె చాలా క్లాసీగా కనిపిస్తోంది. ముదురు ఎరుపు రంగు లిప్ స్టిక్ చెవులకు చిన్న డైమండ్ ఇయర్ రింగ్స్ ధరించి ఎంతో హుందాగా తయారైంది. బాల్కనీలో నిల్చుని ఆమె ఇచ్చిన ఫోజులు, ఆ కిల్లర్ ఎక్స్ ప్రెషన్స్ కుర్రాళ్ళ గుండెల్లో మంటలు పుట్టిస్తున్నాయి.ఇక ఈషా గుప్తా కెరీర్ విషయానికి వస్తే.. 'జన్నత్ 2' సినిమాతో బాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్ తో, నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత 'రుస్తుం', 'బాద్ షాహో', 'టోటల్ ధమాల్' వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. కేవలం నటిగానే కాకుండా, తన బోల్డ్ నెస్ తో ఇండస్ట్రీలో ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. మిస్ ఇండియా ఇంటర్నేషనల్ టైటిల్ గెలుచుకున్న ఈ భామ, వెండితెరపై కూడా అదే స్థాయి అందాన్ని ఆరబోస్తూ దూసుకుపోయింది.తెలుగు ప్రేక్షకులకు కూడా ఈషా సుపరిచితురాలే. రామ్ చరణ్ నటించిన 'వినయ విధేయ రామ' సినిమాలో "ఏక్ బార్.. ఏక్ బార్" అంటూ సాగే స్పెషల్ సాంగ్ లో చిందేసి మాస్ ఆడియెన్స్ ను ఉర్రూతలూగించింది. అలాగే 'ఆశ్రమ్' వెబ్ సిరీస్ లో ఆమె చేసిన సోనియా పాత్రకు మంచి క్రేజ్ వచ్చింది. అందులో ఆమె చూపించిన బోల్డ్ పర్ఫార్మెన్స్ కు విమర్శకుల ప్రశంసలు కూడా దక్కాయి. వెండితెరపై అవకాశాలు కాస్త తగ్గినా, వెబ్ సిరీస్ లలో మాత్రం ఈ అమ్మడు దుమ్మురేపుతోంది.ప్రస్తుతం సినిమాల పరంగా స్పీడ్ తగ్గించినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఈషా గుప్తా



హవా ఏమాత్రం తగ్గలేదు. నిత్యం ఇలాంటి ఫోటోషూట్స్ తో, ఫ్యాషన్ ఈవెంట్స్ తో వార్తల్లో నిలుస్తూనే ఉంది. తన ఫిట్‌నెస్ వీడియోలతో, యోగా పోజులతో నెటిజన్లకు ఇన్స్పిరేషన్ గా నిలుస్తోంది. సరైన అవకాశం వస్తే మరోసారి వెండితెరపై సత్తా చాటాలని చూస్తోంది. ఈ లేటెస్ట్ పారిస్ లుక్ చూస్తుంటే ఇంటర్నేషనల్ మోడల్స్ కు ఏమాత్రం తీసిపోని విధంగా ఆమె గ్లామర్ ఉంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200